

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 30-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 181

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు + వెటిలో (సోపతి) వెల : 8.00

చాంపియన్ భారత్

టీ20 వరల్డ్‌కప్ విజేత టీమ్ ఇండియా

ఉత్కంఠ ఫైనల్లో మెరుపు విజయం 14లో..

టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాకు భంగపాటు



మొన్న ఢిల్లీ..ఇపుడు రాజ్‌కోట్

విమానాశ్రయంలో కూలిన క్యానపీ

ప్రధాని ప్రారంభించిన ఏడాది లోపే ఘటన

వారంలో మూడోది

రాజ్‌కోట్ : భారీ వర్షాలకు ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్1లో కొంత భాగం కూలిపోయిన ఘటన మర్చిపోకముందే రాజ్‌కోట్ హిరసార్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన క్యానపీ (గుడ్డతో ఏర్పాటు చేసిన పందిరి)లో కొంత భాగం శనివారం కూలిపోయింది. ప్రయాణీకులను పికప్, డ్రాప్ చేసే టెర్మినల్ వెలుపలి భాగం వద్ద ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రమాదంలో ఎవ్వరూ గాయపడ్డం కానీ, మరణించడం కానీ జరగలేదని అధికారులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును గత ఏడాది జులైలో ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ ఎయిర్‌పోర్టును ...13లో

నీట్ రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

మెడికల్ ప్రవేశాలు రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)ను రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి ఆమోదింపజేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. విద్యార్థుల జీవితాలు గందరగోళమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్డీఏ పాలనలో ఉన్నత చదువుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు, లీకేజీలు సర్వసాధారణంగా మారాయని తెలిపారు. అత్యున్నతమైన పరీక్షలను నిర్వహించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమై విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. గతంలో మాదిరి గానే మెడికల్ అడ్మిషన్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వాలని కోరారు. ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం నీట్‌ను రద్దు చేయాలనీ, ఈ పరీక్షను నిర్వహించే అధికారాలను తమకు అప్పజెప్పాలని కోరుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే మెడికల్ అడ్మిషన్ పరీక్షలను నిర్వంహిచేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

రూ.40 లక్షల నష్ట పరిహారమివ్వాలి

సౌత్ గ్లాస్ కంపెనీ ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

వివరాలు 13లో..

హెరిటేజ్ సిటీగా ఓరుగల్లు

హైదరాబాద్‌కు సమాంతరంగా అభివృద్ధి

వరంగల్ నగరాన్ని హెరిటేజ్ సిటీగా.. హైదరాబాద్‌కు సమాంతరంగా అభివృద్ధి చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం హన్మకొండ కలెక్టరేట్‌లో వరంగల్ నగరాభివృద్ధిపై సీఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 8 అంశాలపై 3 గంటలపాటు సమీక్ష నిర్వహించారు. రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం, మామునూరు ఎయిర్‌పోర్ట్, కాళోజీ కళాక్షేత్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై 20 రోజులకోమారు సమీక్షా సమావేశం నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు.



అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో వరంగల్ నగరాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించిన ముఖ్యమంత్రి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలందించాలన్నారు. జాతీయ రహదారికి కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు వుండాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు కనెక్టివిటీ వుండేలా రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. వర్షాలు పడ్డప్పుడు ఇబ్బందులు ఏర్పడకుండా ...13లో

ప్రత్యేక జోన్‌గా టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

ఉమ్మడి జిల్లాపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

రూ.6,115 కోట్లు అవసరం..

అధికారులతో సమీక్ష

వరంగల్‌లో సీఎం బిజీబిజీ

జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం

మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం

వివరాలు 13లో



కేంద్రానికి నితీశ్ ఝలక్

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

లేదంటే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలి : జనతాదళ్ (యునైటెడ్)

న్యూఢిల్లీ : బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న సుదీర్ఘకాల డిమాండ్‌ను జనతాదళ్ (యునైటెడ్) మళ్ళీ తెరపైకి తెచ్చింది. ఈ డిమాండ్ సాధన కోసం పోరాటాన్ని సాగిస్తామని పునరుద్ఘాటించింది. ఈ మేరకు శనివారం న్యూఢిల్లీలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కూడా ప్రకటించాలని కోరింది. "బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి, అలాగే ప్రత్యేక ...13లో

డీఎస్ కన్నుమూత

కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స

- భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా
- ప్రభుత్వ లాంఛనాలతో నేడు నిజామాబాద్‌లో అంత్యక్రియలు
- హాజరు కానున్న సీఎం, మంత్రులు
- పలువురు ప్రముఖుల సంతాపం



డీఎస్‌కు నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శనివారం తెల్లవారు జామున 3.30 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన ...6లో

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మృతి

జెడ్పీ చైర్మెన్, ఖానాపూర్ ఎమ్మెల్యేగానూ సేవలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర

వివరాలు 6లో

నీట్ పరీక్షను రద్దు చేయాలి

విద్యార్థి సంఘాల ఆందోళన..ఎంపీ డీకే అరుణ ఇంటి ముట్టడి



విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నవతెలంగాణ -మహబూబ్‌నగర్

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ విషయంలో నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇంటిని ముట్టడించారు. పద్మావతి కాలనీ పెట్రోల్ బంక్ నుంచి విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీగా డీకే అరుణ ఇంటి ముట్టడికి బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ బీజేపీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి ఒకటో పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షపై పార్లమెంటులో ఎంపీ డీకే అరుణ మాట్లాడాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన విషయమని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి మళీ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నేతల హస్తం ఉందని విమర్శించారు. ఎన్‌టిఏను రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు నందు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు.

మత విద్వేషానికి పరాకాష్ట

క్రికెట్ టోర్నమెంట్ ప్రాంగణంలో

కత్తులు, బ్యాట్‌లతో దాడి చేసి

ముస్లిం యువకుడి హత్య

గుజరాత్‌లో దారుణం



చికొద్రా, గుజరాత్ : లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే దేశంలో పలుచోట్ల ముస్లింల పట్ల విద్వేషాలు రగులుతున్నాయి. వారిని లక్ష్యంగా చేసుకుని హిందూత్వ మూకలు దాడులు కొనసాగిస్తున్నాయి. తాజాగా ఈ విద్వేషాలు క్రీడా రంగానికి కూడా పాకాయి. గుజరాత్‌లో ఇటీవల జరిగిన క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా ముస్లిం విద్వేషం పెల్లుబికింది. క్రికెట్ మ్యాచ్‌ను చూసేందుకు వెళ్ళిన యువకుడిని ఏకంగా కత్తులు, బ్యాట్‌లతో బాదేసి చంపేశారు. ఈ టోర్నమెంట్ సమయంలో మత ఘర్షణలు పెచ్చరిల్లే అవకాశం వుందని, క్రీడాకారులకు కూడా సురక్షితమైన వాతావరణం లేదని నిర్వాహకులే ముందుగా ఆందోళన వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎలా వుందో అర్థమవుతోంది. మ్యాచ్‌కు ముందుగానే ఉద్రిక్తతలు నెలకొన్నాయని స్థానికులు తెలిపారు. టోర్నమెంట్‌లో ముస్లిం యువకులు బాగా ఆడారు. అలా జరగడం హిందూత్వ అనుకూల స్థానికుల్లో ఒక వర్గానికి నచ్చలేదు. అదీకాక, క్వార్టర్ ఫైనల్స్‌లో, సెమీ ఫైనల్స్‌లో బాగా ఆడినవారిలో చాలామంది ముస్లింలేనని కొంతమంది విద్యార్థులు తనకు చెప్పారని సామాజిక కార్యకర్త అసీమ్ ఖెద్వాలా క్వింట్ పత్రికకు తెలిపారు. చివరకు ఫైనల్‌లో ...6లో

నీట్‌ను ఎత్తివేయాలి

ప్రధాని మోడీ, రాహుల్ గాంధీకి స్టాలిన్ లేఖ

అలాగే ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ..

నీట్ అవకతవకలపై సుప్రీంలో 1100 కేసులు

గుజరాత్‌లో సీబీఐ సోదాలు



వివరాలు 3లో

వొడాఫోన్ ఐడియా చార్జీల పెంపు

ప్రీపెయిడ్,పోస్ట్ పెయిడ్ బాదుడు



న్యూఢిల్లీ : రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ బాటలోనే వొడాఫోన్ ఐడియా (విఐ) తన టారీఫ్‌లను పెంచింది. ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ మొబైల్ చార్జీలను 11-24 శాతం వరకు పెంచింది. రూ.179 ప్లాన్ ధర రూ.199కు చేర్చింది. రూ.459 ప్లాన్‌ను రూ.509కు పెంచింది. 28 రోజుల ...13లో

తెలుగోడికి ఎస్‌బీఐ పగ్గాలు..!

నూతన ఛైర్మెన్‌గా చల్లా శ్రీనివాసులు

న్యూఢిల్లీ : దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సారథి బాధ్యతలు తొలిసారి ఓ తెలుగు వ్యక్తికి దక్కనున్నాయి. ఆ బ్యాంక్ తదుపరి ఛైర్మెన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి నియమితులు కానున్నారు. ప్రస్తుతం ఆయన మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఉన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల చీఫ్ ...13లో



జిల్లా, మండల పరిషత్‌లకు ప్రత్యేక బాధ్యులు..?

జులై 4న ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం - ఇప్పటికే ప్రత్యేక పాలనలో గ్రామ పంచాయతీలు

మరో రెండునెలల్లో మున్సిపాలిటీలదీ అదే పరిస్థితి


ఎన్నికలపై బడ్జెట్ సమావేశాల తర్వాతే ప్రభుత్వ నిర్ణయం?

స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలక వర్గాల పదవీకాలం ముగియనుంది. జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గా(ఎంపీటీసీ)ల ఐదేండ్ల పదవీకాలం జులై4తో ముగియనుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిపే పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల్ని నియమించే అవకాశముంది. ఇప్పటికే గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఐదు నెలలు అవుతోంది. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులంతా మాజీలయ్యారు. ఇక జెడ్పీటీసీ, ఎంపీటీసీలు కూడా మాజీలు కానున్నారు. పార్టీల పరంగా చూస్తే బీఆర్ఎస్ నుంచి గెలిచిన వాళ్లే 95 శాతం జెడ్పీటీసీలు, ఎంపీటీసీలుంటారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో చాలా మంది ఎంపీటీసీలు, కొందరు జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్, బీజేపీలో చేరారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు కౌంట్‌డౌన్ మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా 534 జెడ్పీటీసీ, 5659 ఎంపీటీసీ స్థానాలకు 2019 మే 6, 10, 14 తేదీల్లో మూడు దశల్లో ఎన్నికలు జరిగాయి. అదే నెల 7న మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి, 8న జిల్లా ప్రజా పరిషత్ చైర్మెన్ పదవులకు ఎన్నిక జరిగింది. 32 జిల్లా ప్రజా పరిషత్‌లకు చైర్మెన్, వైస్ చైర్మెన్, కో-ఆప్షన్ సభ్యుల్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో 372 జెడ్పీటీసీ స్థానాల్ని అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ గెల్చుకుని అన్ని జిల్లా పరిషత్ చైర్మెన్ పదవుల్ని దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి 53 జెడ్పీటీసీలే దక్కాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 68 జెడ్పీటీసీ, 708 ఎంపీటీసీ స్థానాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 25 జెడ్పీటీసీ, 295 ఎంపీటీసీ స్థానాలు, సిద్దిపేట జిల్లాలో 23 జెడ్పీటీసీ, 224 ఎంపీటీసీ స్థానాలు, మెదక్ జిల్లాలో 20 జెడ్పీటీసీ, 189 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మూడు జిల్లా పరిషత్‌లకు చైర్‌పర్సన్ పదవుల్ని కూడా బీఆర్ఎస్ దక్కించుకుంది. వారి పదవీకాలం జులై4తో ముగియనుంది. స్థానిక సంస్థల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్ లోకల్ బాడీలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రతి ఐదేండ్లకోసారి విధిగా ...13లో



విద్యారంగంలో సమూల మార్పులు

- ఆకునూరి మురళీ నేతృత్వంలో విద్యాకమిషన్
- రేవంత్ సర్కారు సమాయత్తం
- పలు సంఘాలు, సంస్థలతో కార్యాచరణ
- విస్తృత సంప్రదింపులతో కొత్త విధానం ?


ఫైల్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని సర్కారు భావిస్తున్నది. సమూల మార్పుల ద్వారా విద్యావ్యవస్థను కొత్త పుంతలు తొక్కించేందుకు సమాయత్తమవుతున్నది. భారీ సంస్కరణలతో విద్యారంగాన్ని సమాజానికి దగ్గర చేయాలని భావిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే అనధికారికంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మెన్‌గా నియమించేందుకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత, ఏఐసీసీ నాయకులు మాజీ ఐఏఎస్ కొప్పుల రాజు మార్గదర్శకత్వంలో విద్యారంగంలో మార్పులు చోటుచేసుకోనున్నట్టు సమాచారం. కాగా ఈ సంస్కరణలు చేసేందుకు రాష్ట్రంలోని మేధావులు, సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు, ఇతరుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించనున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆకునూరి మురళి గత బీఆర్ఎస్ సర్కారు అనుచిత వైఖరికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయన ఏపీ ప్రభుత్వంలో విద్యాశాఖ సలహాదారుగా పనిచేశారు. అక్కడ నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మలిచేందుకు కృషి చేశారు. నిరంతరం స్కూళ్లను పర్యవేక్షిస్తూ పాఠశాలల్లో భారీగా మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రయత్నించారు. ఆ తరహాలోనే కొత్త అంశాలను జోడిస్తూ తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలను చేపట్టాలనే లక్ష్యంగా విద్యాకమిషన్‌ను రూపుదిద్దనున్నట్టు తెలిసింది. ఇతమిద్ధంగా కమిషన్ విధివిధానాలు ఖరారు కానప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తేవడంతోపాటు ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను సైతం బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తారని భావిస్తున్నారు. మురళీ నియామకం ఉత్తర్వులు అధికారికంగా వెలువడనప్పటికీ, ఆయన ఇప్పటికే విధుల్లో చేరిపోయారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయాలు ,సలహాలు, సూచనలు సేకరించే పనిలో పడ్డారు. ఈనెల 26న హైదరాబాద్‌లో ఖమ్మం-నల్లగొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవితోపాటు ఇతరులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యారంగంలో తీసుకురావాల్సిన మార్పులు గురించి చర్చించినట్టు తెలిసింది. విధానంతోపాటు సమూల మార్పులు తేవాలంటే నిధులు సైతం భారీగా అవసరమవుతాయి. వాటిని సైతం విద్యారంగానికి కేటాయించేలా కమిషన్ విధివిధానాల్లోనే పొందుపరిచేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్ అయిన ఆకునూరి మురళి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో దీర్ఘకాలం విధులు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ తన శక్తి సామర్థ్యాలను పేదల కోసం ఉపయోగపడేలా కృషి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కొత్త విద్యావిధానాన్ని రూపొందించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. మానవ జీవితం చదువుతో కీలకంగా ముడిపడి ఉన్న సంగతి తెలిసిందే. ఆ చదువు నాణ్యంగా ఉండేలా విద్యాకమిషన్ పని చేయనుంది. ఆర్థికపరమైన అంశాలతోపాటు సామాజిక వ్యవహారాలు సమాజాన్ని ప్రభావితం చేస్తున్న విషయం విదితమే. వీటన్నింటిలోనూ చదువుదే పైచేయిగా ఉంది. ఈ నేపథ్యంలో వ్యవస్థను గాడిన పెట్టడం ఈ కమిషన్ చేయాలని ఆశిస్తున్నారు. ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లోని పాఠశాలల పరిస్థితులపై అవగాహన ఉన్న మురళి భాషకు సంబంధించిన అంశాల పై కూడా అభిప్రాయసేకరణ చేస్తున్నట్టు సమా చారం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాష లేకుండా మనుగడ లేదనే భౌతిక వాస్తవాన్ని అంగీకరిస్తూ ప్రభుత్వ విద్యారం గాన్ని ఆ దిశగా ముందడుగు వేయించే అంశాలనూ ఆకునూరి మురళి పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

విద్యావ్య వస్థలో మెరుగైన ఫలితాల సాధనకు స్కూళ్లు మూసి వేయడం కాకుండా తరగతి గదులను పెంచడం , ఆమేరకు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. తద్వారా చదువు నాణ్యంగా అందడానికి వీలుం టుందని టీఎస్‌యూటీఎఫ్ నాయకత్వం సూచించినట్టు సమాచారం. అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు సైతం భారీగానే కేటాయించాల్సి రావచ్చు. ప్రస్తుత రేవంత్ సర్కారు బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన సంగతి తెలిసిందే. కాగా 13 శాతం కేటాయించినా అద్భుత ఫలితాలు రాబట్ట వచ్చనే భావనతో ఆకునూరి మురళి ఉన్నట్టు సమా చారం. సర్కారు లక్ష్యంగా బాగానే ఉన్నా, ఇప్పటికే నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన కేంద్రం, రేవంత్ ప్రభుత్వ తాజా విద్యా విధానాన్ని అడ్డుకుంటుందా ? లేక స్వాగతిస్తుందా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

మిగిలిన సీట్లలో అడ్మిషన్లకు అవకాశం : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9 వ తరగతుల వరకు మిగిలిన సీట్లలో అడ్మిషన్లు పొందేందుకు మరో సారి ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నదని మంత్రి సీతక్క తెలిపారు. ఈ నెల 27 నుంచి జూలై 12 వరకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసు కోవచ్చు. http://tgswadtr.cgg.gov.in ద్వారా మరో సారి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష రాసి సాంఘీక సంక్షేమ పాఠశాలలో సీటు దక్కించు కోవచ్చు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు అన్ని రకాల సదుపాయాలను ఉచితంగానే ప్రభుత్వం కల్పిస్తున్నట్టు ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేశారు.

త్వరగా దరఖాస్తులు క్లియర్ చేయండి

- ధరణిపై కలెక్టర్లకు సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధరణి మాడ్యూల్స్ ను సవరించిన నేపథ్యంలో వీలైనంత త్వరగా దరఖాస్తులను క్లియర్ చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి కమిషనర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో జిల్లాల వారీగా ధరణి సమస్యలపై వారితో మరోసారి చర్చించారు. లీగల్ సమస్యలు మినహా మిగతా ఫైల్స్ అన్ని క్లియర్ చేయాలని ఆదేశించారు.

కొత్త పరీక్ష తేదీలను ప్రకటించిన ఎన్‌టీఏ

న్యూఢిల్లీ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(యూజీసీ-నెట్), నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ), జాయింట్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీఎస్ఐఆర్-యూజీసీ-నెట్) కొత్త తేదీలను ప్రకటించింది. ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షల్లో పేపర్ లీక్‌లు, ఇతర అవకతవకలకు సంబంధించిన ఇటీవలి ఆరోపణల నేపథ్యంలో ఈ పోటీ ప్రవేశ పరీక్షలు రద్దు చేయబడటం, వాయిదా కావటం వంటివి జరిగిన విషయం విదితమే. యూనివర్సిటీలు, కాలేజీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం నిర్వహించబడే యూజీసీ-నెట్ ఇప్పుడు ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించబడుతుంది. ఈ పరీక్ష జూన్ 18న జరిగింది. అయితే, కొన్ని కారణాలతో మరుసటి రోజు పరీక్ష రద్దయ్యింది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, లెక్చరర్‌షిప్ లేదా విశ్వవిద్యాలయాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం నిర్వహించే సీఎస్ఐఆర్-యూజీసీ-నెట్ జులై 25 నుంచి జులై 27 వరకు నిర్వహించబడుతుంది. జూన్ 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ "అనివార్య పరిస్థితులతో పాటు లాజిస్టిక్ సమస్యలను" పేర్కొంటూ పరీక్షను వాయిదా వేసిన విషయం విదితమే.ఎంపిక చేసిన కేంద్ర మరియు రాష్ట్ర విశ్వవిద్యాలయాలు లేదా సంస్థల్లో నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం ఎన్‌సీఈటీ నిర్వహించబడుతుంది. జూన్ 12న పరీక్ష నిర్వహించాల్సిన కొన్ని గంటల ముందే వాయిదా పడింది. ఇప్పుడు పరీక్ష జులై 10న జరగనున్నది. మే 5న నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అడ్మిషన్ల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-యూజీ)లో పేపర్ లీక్‌లు, కొంతమంది అభ్యర్థులకు ఏకపక్షంగా గ్రేస్ మార్కులు ఇవ్వటం, ఇతర అవకతవకలకు సంబంధించిన ఆరోపణలతో వివాదం ప్రారంభమైంది. నీట్-యూజీ పరీక్షను రద్దయితే చేయలేదు. అయితే దానిని రీషెడ్యూల్ చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్నది. జూన్ 23న ఎన్‌టీఏ దేశంలోని పోస్ట్-గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశాల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-పీజీ)ను నిర్వహించాల్సి ఉన్నది. అయితే, ముందురోజు కొన్ని గంటల ముందే ఈ పరీక్షను కూడా కేంద్రం వాయిదా వేసింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వం తీరుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తల నుంచి ఆందోళనలు వ్యక్తమైన విషయం విదితమే.

గోతికాడి నక్కల్లా ప్రవర్తిస్తున్నారు

- బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై చనగాని దయాకర్ ఫైర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు గోతికాడి నక్కల్లా ప్రవర్తిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనిగాని దయాకర్ విమర్శించారు. ఈమేరకు శనివారం దయాకర్ ఆయన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షల వద్ద రాజకీయాలు చేస్తారా? ఏమైనా ఆస్పత్రులు దీక్షలకు వేదికలా? అని ప్రశ్నించారు. ఆ పార్టీల నేతలకు సిగ్గు లేకుండా పోయిందని తెలిపారు. పదేండ్ల కాలంలో గ్రూప్1 పరీక్షను సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.అగ్నిపథ్‌తో బీజేపీ నిరుద్యోగుల గొంతు కోయలేదా? అని గుర్తు చేశారు. రాష్టానికి ఎన్ని నిధులు తెచ్చారో, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్ని భర్తీ చేశారో కేంద్ర మంత్రులు కిషన్‌రెడి, బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు.

సుఖమంచి కోటేశ్వర్ రావుకు 25వ తంగిరాల క్రిష్ణప్రసాద్

స్మారక రంగస్థల పురస్కారం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సుఖమంచి కోటేశ్వరరావుకు 25వ తంగిరాల క్రిష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు తంగిరాల ట్రస్టు చైర్మెన్ కవి తంగిరాల చక్రవర్తి శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఈ పురస్కారాన్ని జులై 21న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఆ కార్యక్రమానికి మాజీ ఎంపీ వడ్డే శోభనాధీశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, 25 మంది సాహితీవేత్తలకు, కళాకారులకు సత్కారం ఉంటుందని తంగిరాల పేర్కొన్నారు. సుఖమంచి నాటకాలు రాసి, వేశారనీ, సినిమాలకు సంభాషణలు రాశారని తెలిపారు. సినిమాలు కూడా తీస్తున్న ఆయన డబుల్ పీజీ చేశారనీ, వామపక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారని తంగిరాల చెప్పారు.

మిగిలిపోయిన పోస్టులకు పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించాలి

- పీఆర్టీయూ తెలంగాణ

నవతెలంగామ బ్యూరో - హైదరాబాద్

పదోన్నతుల్లో మిగిలిపోయిన ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే ప్రమోషన్స్ కౌన్సిలింగ్ నిర్వహించాలని పీఆర్టీయూ తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం.చెన్నయ్య, పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.భిక్షం గౌడ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంత మంది ఉపాధ్యాయులకు ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టుల్లో అర్హత ఉండి ఒకే సబ్జెక్టులో పదోన్నతి పొందడంతో 600 పోస్టులు మిగిలి ఎస్జీటీల పదోన్నతి లేక నష్టపోతున్నారని వారు తెలిపారు. వెంటనే పదోన్నతులు చేపట్టి ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. దాదాపు పదేండ్లుగా లేని పదోన్నతులను సజావుగా జరుపుతున్న విద్యాశాఖకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్జీటీల ఆప్షన్‌లలో ఒక్కొక్కరు వెయ్యి నుంచి రెండు వేల వరకు ఆప్షన్లు ఇచ్చుకోవడం కష్టంగా ఉందని తెలిపారు. రోజుకు 500 చొప్పున మూడు రోజుల పాటు బదిలీ కౌన్సిలింగ్ జరిపితే బాగుంటుందని సూచించారు. ఇప్పటికే చాలా మంది ఉపాధ్యాయులు వెయ్యికిపైగా ఆప్షన్లు పెట్టుకోవడం ఇబ్బంది ఉంటుందని ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ఈశ్వరమ్మపై లైంగిక దాడి చేసిన

దుండగులను కఠినంగా శిక్షించాలి

- ఆస్పత్రిలో ఆమెను పరామర్శించిన జాన్‌వెస్లీ : ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ములచింతల పల్లెలోని చెంచు గూడెం భ్రమరాంబ కాలనీలో నివాసముంటున్న చెంచు ఈశ్వరమ్మపై అమానుషంగా లైంగిక దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను వారు పరామర్శించారు.

నానా రకాల చిత్రహిం సలకు గురి చేసిన బండి వెంకటేష్ యాదవ్ అతని భార్య, తన తమ్ముడు, ముగ్గురు దుండగులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈశ్వరమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సర్కిళ్ల ప్రయివేటీకరణ ఆపాలి : టీజీయూఈఈయూ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూప్‌నకు ఇవ్వాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను నిలుపుదల చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీయూఈఈయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే ఈశ్వరరావు, వీ గోవర్ధన్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సర్కిళ్ల ప్రయివేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర విద్యుత్ సంస్థల్లోని అన్ని కార్మిక సంఘాలు, అసోసియేషన్లను కలుపుకొని ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సౌత్ సర్కిల్‌లోని బేగంబజార్, ఆస్మాన్‌గఢ్, చార్మినార్ డివిజన్లలో వినియోగానికి తగినట్టు ఆదాయం రావట్లేదనేది నిజమేననీ, దాన్ని సాకుగా చూపి ప్రయివేటీకరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, తానుకూడా అదే తోవలో నడిస్తే తేడా ఏమిటని ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంక్ విధానాల అమల్లో భాగంగా 1999లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఉమ్మడి ఏపీఎస్ఈబీని ప్రయివేటీకరించేందుకు తీవ్రంగా ప్రయత్నించిందని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం సర్కిళ్లు, ఫీడర్ల వారీగా ఫ్రాంచైజీలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, పుదుచ్చేరి ప్రభుత్వాలు కూడా ఇలాంటి ప్రయివేటీకరణ విధానాలు అమలు చేయాలని ప్రయత్నిస్తే, అక్కడి ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారని గుర్తుచేశారు.

ఏకాభిప్రాయం అంటూనే | దృష్టి మరల్చటానికే ఎమర్జెన్సీ అంశం

ఘర్షణకు ప్రాధాన్యం

- నీట్ పరీక్ష లీక్‌లపై మోడీ మౌనం
- ప్రధానిపై సోనియా ఆగ్రహం




న్యూఢిల్లీ : పార్లమెంటు మొదటి సెషన్‌లో డిప్యూటీ స్పీకర్, నీట్ సమస్యపై ప్రభుత్వం, విపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. సభలో మోడీ సర్కారు తీరుపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు, పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపణలు చేశారు. ప్రధాని ఏకాభిప్రాయం విలువను బోధిస్తూనే.. ఘర్షణకు ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ఆంగ్ల పత్రిక సంపాదకీయంలో వివరించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఎన్డీఏ బలహీనమైన మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావటంతో అది ప్రధానికి ఇంకా అవగాహనకు రాలేదని పేర్కొన్నారు. "ప్రధానమంత్రి ఏమీ మారనట్టుగా ఉంటున్నారు. ఆయన ఏకాభిప్రాయ విలువని బోధిస్తారు కానీ ఘర్షణకు విలువ ఇస్తూనే ఉన్నారు. 18వ లోక్‌సభ ప్రారంభమైన మొదటి కొన్ని రోజులు దురదృష్టవశాత్తూ ప్రోత్సాహకరంగా లేవు. మారిన వైఖరిని మనం చూస్తామనే ఆశ పూర్తిగా దెబ్బతిన్నది. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని సంప్రదాయం ప్రకారం విపక్షాలకు ఇవ్వాల్సి ఉన్నది. 17వ లోక్‌సభలో రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయని పాలన.. ఈ సంపూర్ణ సహేతుకమైన అభ్యర్థన ఆమోదయోగ్యం కాదని గుర్తించింది" అని ఆమె ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమయంలో బీజేపీ మిత్రపక్షమైన ఏఐఏడీఎంకేకు చెందిన ఎం.తంబిదురై డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారు. అయితే, 2019-24 మధ్య ఆ పదవి ఖాళీగా ఉండటం గమనార్హం.

'ఎమర్జెన్సీ' అంశంతో కాంగ్రెస్‌పై బీజేపీ దాడికి దిగటంపై సోనియా స్పందించారు. రాజ్యాంగంపై దాడి నుంచి దృష్టిని మరల్చటానికి ప్రధాని ఈ సమస్యను తీసుకొచ్చారని సోనియా ఆరోపించారు. "1977 మార్చిలో మన దేశ ప్రజలు ఎమర్జెన్సీపై నిర్ణయాత్మక తీర్పు ఇచ్చారు. ఆ సమయంలో ప్రజా వ్యతిరేకతకు గురైన పార్టీకి ఓటర్లు మూడేండ్లలోనే అధికారం ఇచ్చారు. ఆ పార్టీ చరిత్ర సృష్టించింది. మోడీ, ఆయన పార్టీ ఎన్నడూ సాధించని మెజారిటీతో అధికారంలోకి రావడం కూడా ఆ చరిత్రలో చాలా భాగం" అని ఆమె తన సంపాదకీయంలో రాసుకొచ్చారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలు ఎమర్జెన్సీపై తమ ప్రసంగంలో వినిపించారు. వారు దీనిని "చీకటి అధ్యాయం", "రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి" అని అభివర్ణించిన విషయం విదితమే.

మణిపూర్ జాతి హింసపై

మణిపూర్‌లో గతేడాది మేలో జాతి ఘర్షణలు చెలరేగినప్పటి నుంచి కలహాలతో దెబ్బతిన్న మణిపూర్‌ను మోడీ సందర్శించక పోవటాన్ని సోనియా తప్పుబట్టారు.

> దేశంలోని ప్రతిష్టాత్మక పరీక్ష అయిన నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ కేసుపై మౌనంగా ఉన్న ప్రధాని మోడీపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు."పరీక్ష పే చర్చ" చేసే ప్రధాని.. దేశవ్యాప్తంగా చాలా కుటుంబాలను నాశనం చేసిన లీక్‌లపై స్పష్టంగా మౌనంగా ఉన్నారని ఆరోపించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) యూనివర్సిటీల వంటి విద్యాసంస్థల ప్రొఫెషనలిజం గత పదేండ్లలో తీవ్రంగా దెబ్బతిన్నదని కాంగ్రెస్ అగ్రనాయకురాలు నొక్కి చెప్పారు.

మణిపూర్‌లో కుకీ, మెయిటీ కమ్యూనిటీల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా వందలాది మంది మరణించగా.. వేలాది మంది తమ స్వంత ప్రాంతాలను విడిచి వెళ్లిపోయిన విషయం విదితమే.

స్పందించిన బీజేపీ.. ఇండియా బ్లాక్ మద్దతు

సోనియా గాంధీ సంపాదకీయంపై బీజేపీ స్పందించింది. ఆ పార్టీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ కాంగ్రెస్ ఎంపీ మాట్లాడుతూ.. ప్రధాని మోడీపై దాడి చేసే ముందు ఆమె తన కుటుంబ గతాన్ని పరిశీలించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. సోనియా గాంధీకి ఇండియా బ్లాక్‌లోని ఆర్జేడీ, శివసేన (యూబీటీ) వంటి మిత్రపక్షాలు మద్దతు పలికాయి. శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ కూడా ప్రధానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఫలితాలు మోడీకి వ్యక్తిగత ఓటమని అన్నారు.

బీజేపీకి జీఎంఆర్ విరాళాలు !

ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అందజేత

- టెర్మినల్-1 ప్రారంభం తర్వాత నిధుల ప్రవాహం
- ట్రస్ట్ నిధుల్లో 75 శాతం కాషాయ పార్టీకే
- బయటపెట్టిన రాయిటర్స్, ఏడీఆర్

న్యూఢిల్లీ : ఢిల్లీ విమానాశ్రయాన్ని జీఎంఆర్ కంపెనీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాజధానిలో కురిసిన భారీ వర్షాలకు ఈ విమానాశ్రయంలోని టెర్మినల్-1 పైకప్పు పాక్షికంగా కూలిపోవడంతో ఒక వ్యక్తి మరణించాడు. ఇదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తోందంటే ఈ జీఎంఆర్ కంపెనీ 2018 నుంచి ఓ ఎలక్టొరల్ ట్రస్ట్ ద్వారా అధికార బీజేపీకి విరాళాలు అందించింది. ఈ విరాళాలు నేరుగా కాకుండా ట్రస్ట్ ద్వారా దొడ్డి దారిన బీజేపీ ఖాతాకు చేరాయి. ప్రుడెంట్ ఎలక్టొరల్ ట్రస్ట్‌కు పెద్ద మొత్తంలో నిధులు అందించిన సంస్థలలో జీఎంఆర్ ఒకటి. ఈ ట్రస్ట్ తనకు అందిన నిధుల్లో అధిక భాగాన్ని బీజేపీకే సమకూర్చింది.

అధిక నిధులు అధికార పార్టీకే

ఎన్నికల కమిషన్ విడుదల చేసిన బాండ్ల కొనుగోలుదారుల జాబితాలో జీఎంఆర్ పేరు లేదు. అయితే ఈ కంపెనీ బీజేపీకి పరోక్షంగా విరాళాలు అందించిందని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. దేశంలో పదిహేను ఎలక్టొరల్ ట్రస్టులు ఉండగా వాటిలో అతి పెద్దది, సంపన్నమైనది ప్రుడెంట్ ఎలక్టొరల్ ట్రస్టే. 2013లో ఈ ట్రస్ట్ ఏర్పడగా ఇప్పటి వరకూ 272 మిలియన్ డాలర్ల నిధులు సమీకరించిందని రాయిటర్స్ వార్తా సంస్థ ఏప్రిల్‌లో విడుదల చేసిన నివేదిక తెలిపింది. ఇందులో సుమారు 75 శాతం నిధులను బీజేపీకే సమర్పించిందని తేల్చింది.

దాతల జాబితాలో లేకున్నా...

వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు ఏ విధంగా విరాళాలు అందించిందీ ప్రుడెంట్ బహిర్గతం చేయలేదు. అయితే 2018-23 మధ్యకాలంలో బడా భారతీయ కంపెనీల నుంచి ట్రస్ట్‌కు అందిన నిధుల వివరాలను రాయిటర్స్ సంస్థ ప్రభుత్వ రికార్డుల నుంచి సేకరించింది. 2019-23 మధ్యకాలంలో ఎనిమిది బడా వ్యాపార గ్రూపులు ఈ ట్రస్టుకు కనీసం యాభై మిలియన్ డాలర్ల నిధులు సమకూర్చాయి. ఆ మొత్తం బీజేపీకి చెక్కు రూపంలో చేరింది. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్సార్, జీఎంఆర్ సంస్థల లావాదేవీలను రాయిటర్స్ గుర్తించింది. ఈ కంపెనీలు బీజేపీకి నేరుగా విరాళాలు ఇవ్వలేదని, అందుకే అవి దాతల జాబితాలో లేవని తెలిపింది.

తన అంతరంగిక మార్గదర్శకాల మేరకు ప్రుడెంట్ ఆయా పార్టీలకు విరాళాలు అందజేసిందని జీఎంఆర్ ప్రతినిధి ఒకరు చెప్పారు. కానీ ఆ మార్గదర్శకాలేమిటో ఇప్పటి వరకూ తెలియ రాలేదు. ఏదో ఒక పార్టీకి కొమ్ము కాయడం జీఎంఆర్‌కు ఇష్టం లేదని రాయిటర్స్ చెప్పింది. ప్రుడెంట్ ట్రస్ట్ ఇతర పార్టీలకు కూడా విరాళాలు అందించింది కానీ ఎక్కువ భాగం బీజేపీ ఖాతాకే చేరాయని రాయిటర్స్ స్పష్టం చేసింది.

ఏడీఆర్ నివేదిక కూడా...

సంవత్సరాల వారీగా ఎన్నికల ట్రస్టుల లావాదేవీలను విశ్లేషించిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) కూడా ప్రుడెంట్ వైపే వేలెత్తి చూపింది. 2018-19లో జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ సంస్థ అందరి కంటే అత్యధికంగా పాతిక కోట్ల రూపాయల విరాళం అందించిందని ఏడీఆర్ తెలిపింది. ఈ సంస్థ నివేదిక ప్రకారం 2018-19లో ప్రుడెంట్ ట్రస్ట్ బీజేపీకి రూ.67.25 కోట్ల విరాళాన్ని అందించింది. దానికి ముందు సంవత్సరం రూ.154.30 కోట్లు ఇచ్చింది. 2019-20లో కూడా అన్ని ట్రస్టులు కలిపి తమకు అందిన నిధుల్లో 76 శాతం నిధులను బీజేపీకే సమర్పించుకున్నాయి. ఆ ఏడాది ప్రుడెంట్ ట్రస్ట్ బీజేపీకి రూ.217.75 కోట్లు అందజేసింది. ఈ ట్రస్టుకు సీఎంఆర్ గ్రూప్, భారతీ ఎయిర్‌టెల్, డీఎల్ఎఫ్, అపోలో టైర్స్ సంస్థలు పెద్ద ఎత్తున అందించాయి.



> ఎన్నికల బాండ్ల పథకాన్ని మోడీ ప్రభుత్వం ప్రవేశపెడితే ఎలక్టొరల్ ట్రస్ట్ పథకాన్ని 2013లో అప్పటి కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చింది. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు రాజకీయ పార్టీలకు నేరుగా విరాళాలు అందజేయవచ్చు. కానీ ఎలక్టోరల్ ట్రస్ట్ పథకం కింద ముందుగా ఏదో ఒక ట్రస్ట్‌కు విరాళం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ ట్రస్ట్ ఆ మొత్తాన్ని రాజకీయ పార్టీలకు అందజేస్తుంది. ఇలాంటి విరాళాలు అందజేసే కార్పొరేట్ కంపెనీలకు పన్ను మినహాయింపులు కూడా ఉంటాయి.

అంగీకరించిన కాషాయ పార్టీ

2021-22లో ప్రుడెంట్ ట్రస్ట్ తనకు అందిన నిధులలో అత్యధికంగా రూ.336.509 కోట్లను బీజేపీకి అందజేసింది. ఇందులో రూ.20 కోట్లు జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ ఇచ్చినవే. 2022-23లో కూడా ఈ తంతు కొనసాగింది. ఆ ఏడాది ప్రుడెంట్‌కు రూ.360 కోట్ల కార్పొరేట్ నిధులు అందాయి. ఆ సంవత్సరం ఎలక్టొరల్ ట్రస్టుల ద్వారా బీజేపీకి లభించింది రూ.259.08 కోట్లు. అందులో ఒక్క ప్రుడెంట్ నుండే రూ.256.25 కోట్లు అందాయి. తనకు అందిన నిధుల్లో అధిక భాగాన్ని ప్రుడెంట్ సంస్థ బీజేపీకి అందజేసిందని, ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్-1ను ప్రధాని మోడీ ప్రారంభించిన నెల రోజుల తర్వాత ఈ విరాళాలు అందాయని రాయిటర్స్ తెలిపింది. ప్రుడెంట్ ట్రస్ట్ నుంచి తనకు భారీగా విరాళాలు అందాయని 2019లో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వివరాలలో బీజేపీ స్వయంగా అంగీకరించింది.

నీట్‌ను ఎత్తివేయాలి

> ప్రధాని మోడీ, రాహుల్ గాంధీకి స్టాలిన్ లేఖ
> అలాగే ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ..



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్ యూజీ పరీక్షలో అవకతవకలపై వివాదం కొనసాగుతున్న వేళ వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష (నీట్) విధానాన్ని ఎత్తివేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన లేఖలు రాశారు. అలాగే నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని పునరుద్ఘాటించారు. జాతీయ స్థాయిలో ఈ వ్యవస్థను తొలగించాలని డిమాండ్ చేశారు. వృత్తిపరమైన కోర్సుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక ప్రవేశ పరీక్షతో కాకుండా 12వ తరగతి మార్కులతో మాత్రమే ఉండాలని ప్రధాని మోడీకి రాసిన లేఖలో స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ అనేది విద్యార్థులపై అనవసరమైన అదనపు ఒత్తిడి అని ఆరోపించారు. 'ఈ ఎంపిక ప్రక్రియను తొలగించాల్సిన అవసరంపై ఇతర రాష్ట్రాలు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి' అని ప్రధానికి రాసిన లేఖలో ఆయన ప్రస్తావించారు. నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని, 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్ల కోసం అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించినట్టు తెలిపారు. రాష్ట్రపతి ఆమోదం కోసం ఈ బిల్లును పంపామని, ఇది పెండింగ్‌లో ఉందని అన్నారు. మరోవైపు నీట్ రద్దు కోసం అసెంబ్లీలలో ఇదే విధమైన తీర్మానాన్ని ఆమోదించడాన్ని పరిశీలించాలని ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్టాలిన్ సూచించారు. తెలంగాణ, కర్నాటక, కేరళ, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పంజాబ్ ముఖ్యమంత్రులకు ఈ మేరకు లేఖలు పంపారు. అలాగే నీట్ మినహాయింపు కోసం తమిళనాడు చేస్తున్న డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కూడా స్టాలిన్ లేఖ రాశారు. ఇటీవల నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై రాష్ట్రం వ్యతిరేకత వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ బిల్లుకు ఆమోదం తెలపాలని, జాతీయ స్థాయిలో వైద్య కమిషన్ చట్టాన్ని కూడా సవరించాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొన్నారు.

నీట్ అవకతవకలపై 1100 కేసులు

> సుప్రీం కోర్టులో 159, రాష్ట్రాల హైకోర్టుల్లో 941 కేసులు

దేశంలో పెను సంచలనం సృష్టించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) అవకతవకలపై దేశవ్యాప్తంగా కోర్టుల్లో 1,100 కేసులకు సంబంధించిన పిటిషన్లు దాఖలయ్యాయి. అందులో సుప్రీంకోర్టులో 159 కేసులకు సంబంధించిన పిటిషన్లు దాఖలు కాగా, 13 రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో 941 కేసులకు సంబంధించిన పిటిషన్లు దాఖలు అయ్యాయి. అత్యధికంగా తమిళనాడులోని మద్రాస్ హైకోర్టులో 216 పిటిషన్లు దాఖలు అయ్యాయి. దాని తరువాత రాజస్థాన్ హైకోర్టులో 127, ఢిల్లీ హైకోర్టులో 99 పిటిషన్లు దాఖలు అయ్యాయి. మహారాష్ట్రలోని ముంబయి హైకోర్టులో 78, పంజాబ్, హర్యానా హైకోర్టులో 62, కేరళ హైకోర్టులో 60, ఒరిస్సా హైకోర్టులో 49, ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో 39, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37, కర్నాటక హైకోర్టులో 36, మధ్యప్రదేశ్ హైకోర్టులో 24, బీహార్‌లోని పాట్నా హైకోర్టులో 19, గుజరాత్ హైకోర్టులో 15 పిటిషన్లు నమోద అయ్యాయి. 2018లో 6, 2019లో 125, 2020లో 137, 2021లో 191, 2022లో 317, 2023లో 185, 2024 (ఇప్పటి వరకు)లో 139 పిటిషన్లు దాఖలు అయ్యాయి.

గుజరాత్‌లో సీబీఐ సోదాలు

నీట్ (యూజీ) చీటింగ్ కేసు విచారణలో భాగంగా గుజరాత్‌లో శనివారం అనేక ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. గోధ్రా, అహ్మదాబాద్, ఖేద, ఆనంద్ జిల్లాల్లోని వివిధ ప్రదేశాల్లో ఈ సోదాలు జరిగాయి.

కాగా, ఈ కేసులో మరొక నిందితుడు, జార్ఖండ్‌లోని హజరిబాగ్‌కు చెందిన ఒక హిందీ దినపత్రిక జర్నలిస్టు జమాలుద్దీన్‌ను అరెస్టు చేసినట్లు సీబీఐ శనివారం తెలిపింది. పేపర్ లీక్ వ్యవహారంలో బీహార్‌లోని ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌కు సహాయం చేసాడనే ఆరోపణలతో జమాలుద్దీన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపింది.

గుజరాత్‌లోని గోధ్రాలో ఒక పరీక్షా సెంటర్‌లో కాపీ జరిగిందనే ఆరోపణలతో ఐదుగుర్ని గుజరాత్ పోలీసులు ఈ నెల 14న అరెస్టు చేశారు. వీరిలో ఒక కోచింగ్ సెంటర్ అధిపతి కూడా ఉన్నాడు. అలాగే గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించే ఒక కోచింగ్ సెంటర్ కూడా ఈ స్కామ్‌లో భాగముందని ఆరోపణలు ఉన్నాయి.

కేజ్రీవాల్‌కు 14 రోజుల కస్టడీ

- సీబీఐ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు
- బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద ఆప్ శ్రేణుల ఆందోళన



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలు ఉన్న కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ, ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చింది. దీంతో కోర్టు మూడు రోజులు సీబీఐ రిమాండ్ విధించింది. శనివారంతో గడువు ముగియడంతో సీబీఐ అధికారులు మరోసారి ఆయనను కోర్టులో హాజరుపర్చారు. విచారణ కోసం రెండు వారాల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని సీబీఐ కోర్టును కోరింది. దాంతో కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు తరలించారు. జూలై 12 వరకు కేజ్రీవాల్ రిమాండ్ కొనసాగనుంది.

బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద ఆప్ ఆందోళన

కేజ్రీవాల్‌ను జైలు నుంచి వెంటనే విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీని డిమాండ్ చేసింది. శనివారం ఢిల్లీలోని దిన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట ఆప్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా బీజేపీకి వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల దుర్వినియోగం, నియంత పాలన అంతం.. కోసం అంటూ పార్టీ శ్రేణులు ప్లకార్డులను ప్రదర్శించాయి. మరోవైపు బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద అనుమతి లేదంటూ ఆప్‌కి చెందిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.



ఆకస్మిక వరదల్లో ఐదుగురు జవాన్లు మృతి

- లద్దాక్‌లో కొట్టుకుపోయిన యుద్ధట్యాంక్

శ్రీనగర్ : ఆకస్మిక వరదల్లో ఐదుగురు సైనికులతో సహా టి-72 యుద్ధట్యాంక్ కొట్టుకొనిపోయిన ఘటన లద్దాక్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసీ) సమీపంలో ష్యోక్ నదిలో జరిగింది. లేహ్‌కు 148 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందిర్ మోర్‌కు సమీపంలో శనివారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో జరిగింది. ఎక్సర్‌సైజులో భాగంగా ట్యాంక్ నదిని దాటుతుండగా ఈ ప్రమాదం జరగ్గా, ట్యాంక్‌లో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఏ)తో సహా ఐదుగురు సైనికులు మరణించారు. ఐదుగురు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. లేహ్‌లోని ఆర్మీ ప్రధాన కార్యలయం ఈ ప్రమాదం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపింది. ష్యోక్ నదిలో ఆకస్మాత్తుగా నీటిమట్టం పెరగడంతో ప్రమాదం జరిగిందని, సహాయక బృందాలు వెంటనే అక్కడకు చేరుకున్నా.. అధికంగా ఉన్న నీటిస్థాయి కారణంగా సిబ్బందిని రక్షించలేక పోయారని తెలిపింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. 'మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి. ఈ దు:ఖ సమయంలో దేశం వారికి అండగా నిలుస్తుంది' అని ఎక్స్‌లో మంత్రి పోస్టు చేశారు.

ఆ మైనారిటీ వర్గమే టార్గెట్

- మోడీ పాలనలో దారుణమైన పరిస్థితులు
- భద్రత కరువు.. పెరిగిన అంతర్గత వలసలు
- ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- మేధావులు, సామాజిక కార్యకర్తల సూచన



న్యూఢిల్లీ : మోడీ పాలనలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలకు రక్షణ కరువైంది. మైనారిటీల్లో ప్రత్యేకించి ఒక వర్గం ప్రజలను సమాజంలో చిన్న చూపు చూస్తున్న సందర్భాలు అనేకం చోటు చేసుకున్నాయి. పీడిత వర్గం ప్రజలకు భద్రత కల్పించి, నిందితులను శిక్షించాల్సిన ప్రభుత్వాలు శాంతి భద్రతల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో ఇలాంటి ఘటనలు దేశంలో నిత్యకృత్యమయ్యాయని మేధావులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి ఆవాస్ యోజన కింద మైనారిటీ వర్గానికి చెందిన మహిళ ప్రభుత్వ ఉద్యోగికి ఫ్లాట్ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ జూన్ 10న వడోదరలోని గృహ సముదాయంలోని 30 మందికి పైగా నివాసితులు నిరసన తెలిపారు. ఆమె, తన కుమారుడితో ఇక్కడ ఉండటం తమకు ముప్పును, ఇబ్బందిని కలిగిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటన భారతదేశంలోని ఆ వర్గం ప్రజలపై లోతైన పక్షపాతాన్ని నొక్కి చెప్పిందని అంటున్నారు. ఇది భారతదేశంలోని ఆ వర్గం ప్రజలు ఎదుర్కొంటున్న అంతర్గత వలసల పరిస్థితిని ప్రతిబింబిస్తుందని చెప్తున్నారు. ముఖ్యంగా గత దశాబ్దంలో బీజేపీ పాలనలో ఇది తీవ్రమైందని అంటున్నారు.

బాధిత వర్గం వ్యతిరేక మతోన్మాదానికి సంబంధించిన ఇలాంటి సందర్భాలు భారతదేశం అంతటా కనిపించాయి. గతేడాది జూన్‌లో, ఉత్తరాఖండ్‌లోని పురోలాలో ఆ వర్గం వ్యాపారులను బెదిరించి, వారి దుకాణాలను ధ్వంసం చేసి, డజనుకు పైగా కుటుంబాలు పారిపోయేలా చేశారు. మార్చిలో, ఉత్తరాఖండ్‌లోని ధార్చుల పట్టణంలో ఇలాంటి పరిస్థితి చోటు చేసుకున్నది. ఆగస్టులో హర్యానాలోని నుహ్‌లో జరిగిన హింసాకాండ తర్వాత, ప్రభుత్వం "బుల్డోజర్ న్యాయం" ద్వారా ప్రభావితమైనది కూడా ఆ మైనారిటీ వర్గం వారే.

డిసెంబరు 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత దేశవ్యాప్త అల్లర్లు జరిగినప్పటి నుంచి ఈ వలసలు కనిపిస్తున్నాయి. అనేక అల్లర్లు లేదా ఆటంకాలు 'ఆ వర్గం' ప్రజలను మిశ్రమ జనాభా ఉన్న పొరుగు ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు బలవంతంగా తరలించడానికి దారితీశాయని సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు.

"ఇలాంటి పరిస్థితులు ముంబయి, గుజరాత్‌లోని నగరాల్లో ప్రత్యేకంగా కనిపిస్తుంది. 1992-93 నాటి అల్లర్ల తరువాత, ముంబయి మీరా రోడ్, ముంబ్రాకు బాధిత మైనారిటీ వర్గం ప్రజలు తరలి వచ్చారు. గుజరాత్‌లో, 2002 అల్లర్ల తర్వాత, అహ్మదాబాద్‌లో దాదాపు ఐదు లక్షల మంది మైనారిటీలు నివసించే సిటిజన్ నగర్, జుహాపురాలు వెలిశాయి. వీటిలో చాలా ప్రాంతాలను మెజారిటీ వర్గంవారు తరచుగా "ఛోటా పాకిస్తాన్" అని పిలుస్తారు" అని తెలిపారు. 'ఆ వర్గం' ప్రజలపై దాడులను ఆపేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ, లేకపోతే దేశంలో లౌకికవాదం దెబ్బతినే ప్రమాదమున్నదని వారు హెచ్చరిస్తున్నారు.

కోల్‌కతాలో మరో మూక హత్య

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మరో మూక హత్య జరిగింది. శనివారం మొబైల్ ఫోన్ దొంగతనం చేసాడనే అనుమానంతో నగర శివారు ప్రాంతం సాల్ట్ లేక్‌లో ఒక వ్యక్తిని దారుణంగా కొట్టి చంపారు. మృతుడ్ని 22 ఏండ్ల ప్రసేన్ మండల్‌గా గుర్తించారు. శుక్రవారం నగరం నడిబొడ్డున మూక హత్య జరిగిన సంగతి తెలిసిందే. మొబైల్ ఫోన్ దొంగతనం చేసాడనే అనుమానంతోనే చాందనీ చౌక్ ప్రాంతంలో ఇర్షాద్ అనే వ్యక్తిని కొట్టి చంపారు. ఈ కేసులో 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే శనివారం కేసులో ముగుర్ని పోలీసులు అరెస్టు చేశారు.

ఎవ్వరినీ బతకనివ్వను

- ఇక్కడున్న 2 లక్షల మందిని చంపేస్తా
- 'ఒక వర్గం'పై బీజేపీ నాయకుడి బెదిరింపులు
- పోలీసుల ముందే హెచ్చరికలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఒక మైనారిటీ వర్గం ప్రజలను చంపుతానంటూ బీజేపీ నాయకుడు బెదిరింపు లకు దిగిన ఘటన కలవరపెడుతున్నది. సాక్షాత్తూ దేశ రాజధాని న్యూఢిల్లీలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ మారింది. వివరాల్లోకెళ్తే.. న్యూఢిల్లీలోని హిందూ దేవాలయానికి కొద్ది దూరంలో తెగిపడిన ఆవు తల కనబడింది. దీనిపై బీజేపీ నాయకుడు కర్నైల్ సింగ్ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఇక్కడ ఆ వర్గం ప్రజలు 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు ఉన్నారనీ, ఏ ఒక్కరినీ వదలకుండా వారందరినీ చంపేస్తానంటూ సాక్షాత్తూ పోలీసులతోనే చెప్పాడు. తన మద్దతు దారులకు కత్తులు ఇచ్చి రెండు లక్షల మంది 'ఆ వర్గం' ప్రజలను చంపేస్తానని హెచ్చరించాడు. సంగం విహార్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. ఘటనకు సంబంధించి పలువురు సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశారు. కాగా, ఆయన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. కర్నైల్ సింగ్‌ను అరెస్టు చేయాలనీ, ఆయన వ్యాఖ్యలో తమలో తీవ్ర భయాందోళనలను కలిగించాయని కొందరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



కొత్త న్యాయం!

బాధితులు ఎవరైనా న్యాయం కావాలంటూ స్టేషనుకు వెళితే, ముందు కేసు నమోదు చేసి విచారణ చేయాలి. కానీ విచారణానంతరం అది ఎంత సమయమైనా సరే ఆ తర్వాతే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసేట్టుగా కొత్తచట్టం అనుమతిస్తుంది. ఇది పోలీసు అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది. రాజద్రోహం లాంటి నేరాలు వలసపాలనకు గుర్తులని సుప్రీంకోర్టు గతంలో నిలిపివేసింది. కానీ అదే నేర చట్టాన్ని మరింత ప్రమాదకరంగా 'దేశ ఐక్యత, సమగ్రత' రూపంలో తీసుకువచ్చింది. 'ఉపా' కేసులో అన్యాయంగా, అక్రమంగా అరెస్టు కాబడినవాళ్లు వందలమంది, నేరం రుజువు కాకుండానే శిక్షలు అనుభవిస్తున్నారు. అట్లా బోలెడంతకాలం నిర్బంధంలో ఉన్న ప్రబీర్ పురకాయస్త, సాయిబాబా, ఇంకా ఎందరినో అన్యాయ మంటూ కోర్టులు విడుదల చేసింది.

సంపాదకీయం

'ఏది ఇలలోన అసలైన న్యాయం' అంటూ ఎప్పుడో చాన్నాళ్ల కిందట సినిమాలో బాలు పాడతాడు. 'న్యాయం నిర్ణయించు విధి మాది. మీరు సంజాయిషీ ఇచ్చుకొనుడు' అని యమధర్మ రాజు డైలాగ్ ఒకటి నాటకంలోది ప్రతి సారీ గుర్తుకొస్తూ ఉంటుంది. ఎందుకంటే న్యాయం అనే పదాన్ని మనం ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటాం. సమాజంలో న్యాయం కోసం అశేష ప్రజలు నిత్యం ఎదురు చూస్తూనే ఉన్నారు. అది దక్కటం చాలా కష్టంగా ఉంటుంది. అసలు ఏది న్యాయం, ఏది అన్యాయం కూడా ఒక పెద్ద సమస్య. న్యాయం ఎప్పటికీ ఒక్కలాగ కూడా లేదు. కాలాలను బట్టి, సమాజాల్ని బట్టి, పరిపాలకులను బట్టి మారుతూ వస్తోంది. ఒకరు కష్టపడి సంపాదించుకున్న డబ్బును ఇంకొకరు అతనిపై దౌర్జన్యం చేసి ఎత్తుకెళితే అది నేరం. ఆ డబ్బు తిరిగి కష్టజీవికి ఇప్పించడం న్యాయం. ఒక మనిషిని, తనకేదో మోసం చేసాడని చంపేస్తే నేరం. ఆ నేరం చేసిన వాడికి శిక్షపడటం న్యాయం. అదే వ్యాపారం పేరుతో లాభం పొంది, కష్టపడ్డవాడి సొమ్ము పొందితే చట్ట పరంగా న్యాయమైనదే. చంపేంత తప్పు చేశాడని న్యాయస్థానం భావిస్తే చంపేయడమూ న్యాయమే అంటారు. ఉరివేస్తారు. ఇంతకీ ఏది న్యాయం! చట్ట ప్రకారం చేసేది న్యాయమంటారు. చట్టం రాజ్యం చేస్తుంది. మరి రాజ్యాన్ని ఎవరు చేస్తారు! తోలుబొమ్మలాట అనేది మన ప్రాచీన కళ. అందులో అసలు ఆడించేవాడు కనపడడు. కానీ వాడు ఆడించే బొమ్మలు బయట కథను నడిపిస్తాయి. రాచరికం నుండి ప్రజా స్వామ్య వ్యవస్థగా చెప్పుకున్నప్పటికీ కనిపించని శక్తులే ప్రజాస్వామ్యాన్నీ నడిపిస్తుంటారు. ఇప్పుడైతే పార్లమెంటులోనే కనిపిస్తున్నారు. కోట్లకు పడగలెత్తిన వారే మన ప్రజాప్రతినిధులు కదా! వ్యాపారస్తులూ చట్టసభల్లో నిండిపోయారు. అంటే ఆడించేవాడు ప్రత్యక్షంగానే దిగాడన్నమాట!

ఇప్పుడీ న్యాయం గొడవకు కారణముంది. రేపు జూలై 1 నుండి మన దేశంలో కొత్త నేరన్యాయాలు అమల్లోకి రానున్నాయి. దేశ ప్రజలకు కొత్తగా రాబోయే నేరన్యాయ చట్టాల గురించి ఎక్కువగా తెలిసి ఉండదనుకుంటా. న్యాయంకోసం వాదించే న్యాయవాదులకు, న్యాయం అందించే న్యాయమూర్తులందరికీ అవగాహన అయితే అదే మహాభాగ్యంగా భావించవచ్చు! ప్రజలకోసం రూపొందించే న్యాయచట్టాలు ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం లేదనుకుంటుంది మన ప్రజాస్వామ్యం. అంతదాకా ఎందుకు, అసలు న్యాయవ్యవస్థకే సంబంధం లేకుండా వచ్చేస్తున్నాయి న్యాయచట్టాలు. న్యాయకోవిదుల ప్రమేయమూ లేదు. కానీ కొత్త చట్టాలకు రూపకల్పన చేసింది పోలీసు వ్యవస్థ .(హోంశాఖ) అదీ గమనించాల్సిన అసలు విషయం.

ఈ కొత్త మూడు నేరన్యాయ చట్టాలకు సంస్కృత పేర్లనూ ఖరారు చేసింది. అవేమంటే, 1.భారతీయ న్యాయ సంహిత (ఐ.పి.సి పాతపేరు) , 2. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (సి.ఆర్.పి.ఎఫ్.), 3. భారతీయ సాక్ష్య అధినియం (ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్). కొత్త దేవుళ్లు రాగానే కొత్త న్యాయాలూ వస్తాయి. ఈ చట్టాలపై కనీసం పార్లమెంటులో చర్చ జరగలేదు. మొత్తం ప్రతిపక్ష సభ్యులను సభనుండి సస్పెండ్ చేసి చట్టాలను ఆమోదించుకున్నారు ప్రభుత్వ నిర్వాహకులు. ఇందులో 95 శాతం పాత చట్టాలలోనివే ఉన్నాయి. నేర శిక్షా సంహితలో కొత్తగా 20 రకాల నేరాలను చేర్చారు. అవి అవసరమా కాదా అనేది చర్చేలేదు. కొన్నింటికి జైలుశిక్షలు పెంచింది. న్యాయస్థానాలకు ఉండే విచక్షణాధికారాలను తొలగించింది. స్వతంత్రంగా వ్యవహరించే న్యాయస్థానాల విధులు, కొత్త చట్టాల ద్వారా కొంత అస్పష్టతలోకి పోయినట్లు న్యాయకోవిధులు చెబుతున్నారు. బాధితులు ఎవరైనా న్యాయం కావాలంటూ స్టేషనుకు వెళితే, ముందు కేసు నమోదు చేసి విచారణ చేయాలి. కానీ విచారణానంతరం అది ఎంత సమయమైనా సరే ఆ తర్వాతే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసేట్టుగా కొత్తచట్టం అనుమతిస్తుంది. ఇది పోలీసు అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది. రాజద్రోహం లాంటి నేరాలు వలసపాలనకు గుర్తులని సుప్రీంకోర్టు గతంలో నిలిపివేసింది. కానీ అదే నేర చట్టాన్ని మరింత ప్రమాదకరంగా 'దేశ ఐక్యత, సమగ్రత' రూపంలో తీసుకువచ్చింది. 'ఉపా' కేసులో అన్యాయంగా, అక్రమంగా అరెస్టు కాబడినవాళ్లు వందలమంది, నేరం రుజువు కాకుండానే శిక్షలు అనుభవిస్తున్నారు. అట్లా బోలెడంతకాలం నిర్బంధంలో ఉన్న ప్రబీర్ పురకాయస్త, సాయిబాబా, ఇంకా ఎందరినో అన్యాయ మంటూ కోర్టులు విడుదల చేశాయి. ఇవన్నీ హక్కుల అణచివేతలో భాగం.

అన్యాయాన్ని, దోపిడీని, నిర్బంధాన్ని ప్రతిఘటించిన వారిని, ప్రశ్నించిన వారి గొంతులను నొక్కివేయటానికి మరింత పదునుగా తెస్తున్న చట్టాలే ఇవి. మేధావులు, న్యాయనిపుణులు, ప్రజా నాయకులు వీటిని గురించి చర్చించాలి. ప్రభుత్వ దమననీతిని ప్రజలకు వివరించాలి.

కొత్త మలుపుల్లో కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు


తెలకపల్లి రవి

ఎన్నికలు ముగిసి కొత్త సభలు కొలువు తీరిన సందర్భం. ఏపీ శాసనసభ సభ్యుల ప్రమాణాలతో వాయిదా పడగా పార్లమెంటు ఉభయ సభలు వాడివేడిగా నడుస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాల తొలి అడుగులు వాటి పనితీరు ఎలావుండబోయేది సంకేతప్రాయంగా చెబుతున్నాయి. సొంత మెజార్టీ కోల్పోయి మిశ్రమ సర్కారుగా మారినప్పటికీ మోడీ ప్రభుత్వం మౌలికంగా హిందూత్వ కార్పొరేట్ ఏకపక్ష నమూనాలోనే నడవబోతుందని స్పష్టమవుతున్నది.గత రెండు పర్యాయాలు కాంగ్రెస్ కోరినా ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి నిరాకరించిన స్పీకర్ ఈసారి అనివార్యంగా ప్రజల తీర్పుతోనే రాహుల్‌గాంధీని ప్రతిపక్షనేతగా ప్రకటించాల్సి వచ్చింది.అయితే దీటైన ప్రతిపక్ష కూటమిగా 'ఇండియా' వున్నా ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించే ప్రసక్తి లేదని లోక్‌సభ తొలిసమావేశాలనే వాయిదా వేయడం ద్వారా కేంద్రం చెప్పేసింది. దేశమంతటినీ ఆందోళన పరిచిన 'నీట్'పై చర్చకు నిరాకరించడంలో నిరంకుశత్వం ప్రస్ఫుటమైంది. అలాగే డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపక్షాల అభ్యర్థనను పరిశీలించడానికి కూడా నిరాకరించడంలో సర్కారు సిద్ధం కాకపోవడం దాని భయాన్ని ప్రతిబింబిస్తున్నది. పదేళ్ల పోరాటం తర్వాత భారత రాజకీయ రంగంలో ప్రజాస్వామ్య లౌకిక శక్తుల పోరాటానికి ఒకింత చోటు లభించడం మాత్రం సానుకూల పరిణామంగా కనిపిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే కేంద్రంలో పాలక కూటమి అతిపెద్ద మద్దతుదారుగా వున్న తెలుగుదేశం పార్టీ,దాని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీల పాలన ప్రారంభమైంది. మోడీకి సొంతంగా మెజార్టీ లేదు గనక కింగ్ మేకర్‌గా చంద్రబాబునాయుడు స్పీకర్ పదవి కోరతారని, ఏదో తేడా వస్తుందని మీడియాలో వెలువడిన ఊహాగానాలు నిజం కాలేదు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలైన పురంధరేశ్వరి పేరు తెలుగు మీడియాలో విరివిగా వినిపించినా ఆ ప్రభావం కనిపించలేదు. డిప్యూటీ స్పీకర్‌గా బీజేపీ భాగస్వామ్య పక్షాలకు అవకాశం అంటున్నారు గనక ఏం జరిగేది చూడవలసి వుంటుంది. ఏమైనా టీడీపీ,దాని తర్వాత ప్రధాన మద్దతుదారుగా ఉన్న జెడియులు ఏపీ, బీహార్ రాజకీయాల కోణంలో రాష్ట్రాల కోసం తప్ప కేంద్ర బీజేపీ విధానాలను ప్రభావితం చేయడం జరగదనీ, ఆ ఆలోచన శక్తి కూడా లేవని అర్థమవుతున్నది. ఆ విధమైన విధాన ప్రకటనలు సూచనలు కూడా ఏమీ వెలువడింది లేదు. ఏపీలో వైసీపీ పాలనపై శ్వేతపత్రాలను విడుదల చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం నిమగ్నమై వుంది. అధికారుల నియామకాలు, బదిలీలు, పాత పాలకులకు ఏజెంట్లుగా వ్యవహరించిన వారికి హెచ్చరికలు వీటిపై దృష్టి కేంద్రీకృతమైంది. ఎన్నికల అనంతర ఉద్రేకాలు ఉద్రిక్తతలు కూడా తీవ్రంగానే వుంటున్నాయి. సరైన అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో కట్టారంటూ వైసీపీ కార్యాలయాలకు నోటీసులు ,కూల్చివేతలపై కోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చి తీర్పు రిజర్వు చేశారు. తప్పులు జరిగివుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గాని కూల్చివేతలకు దిగితే గతంలో వలెనే కక్ష సాధింపు వాతావరణం పునరావృతమవుతుందని సీపీఐ(ఎం), కాంగ్రెస్ వంటి పార్టీలూ, మీడియా కూడా వ్యాఖ్యానించిన పరిస్థితి. అసలు మాజీ ముఖ్యమంత్రి జగన్ కార్యాచరణ కూడా ఇప్పటికీ వెల్లడికాకపోగా అసలు శాసనసభకు వస్తారా? అనే దానిపైనే సందేహాలు నెలకొన్న విచిత్ర పరిస్థితి.

జగన్ లేఖ

బలం తగ్గిన తాము శాసనసభకు వెళ్లినా సమయం ఇస్తారనే నమ్మకం లేదని జగన్ మొదట్లోనే మాట్లాడారు.తనపై తీవ్ర దుర్భాషలాడిన వ్యక్తిని స్పీకర్‌ను చేస్తున్నారని విమర్శించారు. సభ్యుడిగా ప్రమాణ స్వీకారం తర్వాత ఆయన గాని ఇతర వైసీపీ సభ్యులుగాని మీడియాతో పెద్దగా మాట్లాడలేదు. స్పీకర్ ఎన్నికలోగానీ, పదవీ స్వీకారంలో గానీ పాల్గొనలేదు. తర్వాత జగన్ ఆయనకు లేఖ రాస్తూ తన ఆరోపణను పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తే సభకు వస్తామని, లేకపోతే ప్రయోజనం వుండదని దాంట్లో సూటిగానే పేర్కొన్నారు. లోక్‌సభ ఆనవాయితీ ప్రకారం ప్రతిపక్ష నాయకుడి హోదాకు అవసరమని భావిస్తున్న పదిశాతం సీట్లు వైసీపీకి రాలేదు గనక ఆ అవకాశం వుండదనే అభిప్రాయం బలంగా వుంది. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నా చట్టపరంగా మాత్రం ఇవ్వాలని చెప్పే బలమైన ఆధారాలు లేవు. ఇప్పుడు వైసీపీకి వచ్చిన 11 సీట్ల కన్నా చాలా ఎక్కువ సీట్లు వచ్చిన సందర్భంలోనూ ప్రతిపక్షనేతకు క్యాబినెట్ హోదా ఇవ్వలేదు. ఉమ్మడి ఏపీ శాసనసభలో గానీ, గత రెండు లోక్‌సభలలో గానీ హోదాను ఆ కారణంగానే నిరాకరించారు. గత రెండు లోక్‌సభలలో కాంగ్రెస్‌కు 50 పైనే స్థానాలున్నా ఫలితం లేకపోయింది. ఫిరాయింపుల నిరోధ చట్టం తర్వాత పదిశాతం ఉంటేనే రాజకీయ పక్షం, లేకపోతే గ్రూపు అన్న నిర్వచనం వర్తించదని ఒక వాదన. అయితే ఆ మేరకు పాత నిబంధనలు సవరించలేదు గనక ఆ వాదన నిలవదు. గతంలో పి.జనార్థనరెడ్డి, పి.ఉపేంద్రలకు పదిశాతం లేకున్నా హోదా ఇచ్చారంటూ జగన్ ఇచ్చిన ఉదాహరణ కూడా పూర్తిగా నిజం కాదు. అతి పెద్ద ప్రతిపక్ష గ్రూపునేతలుగా గుర్తించడం తప్ప రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేతలుగా వారికి సదుపాయాలు కల్పించింది లేదు. 70 మంది సభ్యులు గల ఢిల్లీ శాసనసభలో బీజేపీకి ముగ్గురే ఉన్నా హోదా ఇచ్చిన ఉదాహరణ ఉంది. కానీ అది అంతిమంగా స్పీకర్ విచక్షణపైనే ఆధారపడి ఆయన ద్వారానే జరగవలసి వుంటుంది. ఏపీలో ఇప్పుడున్న అసహన వాతావరణంలో ఆ విధమైన అవకాశం లేదు. సూటిగా తిరస్కరించారు కూడా. ప్రజల తీర్పును గౌరవించి సభలో పాల్గొనాలనే అభిప్రాయమే అన్ని పార్టీలూ వెలిబుచ్చాయి.పైగా గత ప్రభుత్వానికి సంబంధించిన విమర్శలపై సమాధానాలు చెప్పడం ఆయన బాధ్యత కూడా.ఈ నేపథ్యంలో జగన్ లేఖ రాజకీయంగా రాసింది మాత్రమేనా లేక దానికి కట్టుబడి సభకు వచ్చినా ప్రయోజనం ఉండదని సమర్థించుకోవడానికి ప్రయత్నమా అనేది ఆచరణలో చూడాలి.

రెండు రాష్ట్రాల సమస్యలు - బీజేపీ

కేంద్రం నుంచి ఏపీ ప్రయోజనాల సాధనకు తీవ్రకృషి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ తప్పిదాలనూ, లోపాలను నివేదించడంతో పాటు తాము ఇచ్చిన హామీల అమలుకు తొలిసానుకూల ప్రాధాన్యత ఇవ్వాలని ఆశిస్తున్నారు. విశాఖ రుషికొండ భవనాల వంటి వాటితో పాటు ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడం వంటివి మరింత కీలకమవుతాయి. ఎన్డీయేలో కీలక భాగస్వామి అయినప్పటికీ రాష్ట్రంలో టీడీపీ నాయకత్వమే వుంది గనక లౌకికతత్వానికి, మత సామరస్యానికి భంగం కలిగించే ఎలాటి చర్యలకూ అవకాశమివ్వరాదని ప్రజాస్వామిక వాదులు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్రంలో అసహన రాజకీయాలు, కక్ష సాధింపు వాతావరణం మారాలని, మీడియాపై ఆటంకాలు తొలగిపోవాలని ఎదురు చూస్తున్నారు. విభజిత రాష్ట్రంలో వరుసగా మూడుసార్లు ప్రభుత్వాలు మారుతున్న నేపథ్యంలో ఈ రెండు రాష్ట్ర పార్టీల మధ్యనే పరిభ్రమిస్తూ కేంద్రం పాత్ర మరుగుపడే పరిస్థితికి అవకాశమివ్వడం వాంఛనీయం కాదు. పోలవరంపై శ్వేతపత్రంవిడుదల చేయడం వరకూ బాగానేవున్నా ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం పాత్రపై పల్లెత్తు మాట అనకుండా వుండటం ఎలా సాధ్యం? రాజధాని నిర్మాణం,విభజన సమస్యలు హామీలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది. ఇప్పటికీ వైసీపీ కేంద్రంలో బీజేపీనే మోస్తున్న తీరు చూస్తే ఏపీలో మోడీ ద్వంద్వ రాజకీయంలో మార్పులేదనే అర్థమవుతుంది.ఇదే సమయంలో తెలంగాణ గవర్నర్‌గా ఉన్న బీజేపీ నేత రాధాకృష్ణన్ చంద్రబాబును కలుసుకోవడం, బీఆర్ఎస్, బీజేపీ కలసి పాచికలు వేస్తున్నాయనే వార్తలు వ్యాపిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు భిన్న సంకేతాలకు ఆస్కారమిస్తున్నాయి. మరింత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారనే వార్తల నేపథ్యంలో బీజేపీ ఎలా వ్యవహరిస్తుందనేది చూడవలసిందే.టీడీపీని మళ్లీ తెలంగాణలో క్రియాశీలం చేయడానికి చంద్రబాబు నిర్ణయాలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది.ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తెలంగాణ సందర్శనలు చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయేను ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయా? అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. చంద్రబాబుపై తనకు ఎంత గౌరవభావం ఉన్నా తన పదవికే ఎసరు తెచ్చుకునేలా ఎందుకు వ్యవహరిస్తానని రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆయన ఆలోచనను వెల్లడించాయనుకోవాలి.

ప్రత్యేక పరిస్థితి

ఏది ఏమైనా రెండు తెలుగు రాష్ట్రాల సమస్యలను సహేతుకంగా రాజ్యాంగ బద్ధంగా పరిష్కరించి సహాయపడే బదులు తన స్వప్రయోజనాలకోసం కేంద్రంలోని బీజేపీ ఉభయ పక్షాలతో చెలగాటమాడటం నష్టదాయకమవుతుంది. వివిధ రాష్ట్రాలలో తనతో చేతులు కలిపిన ఎజిపి, జెడిఎస్,బిఎస్‌పి,జెడియు వంటి పార్టీలను పథకం ప్రకారం దెబ్బతీస్తూ వస్తున్న బీజేపీ తెలుగు రాష్ట్రాల్లో కూడా అంతకంటే భిన్నంగా వ్యవహరిస్తుందనుకోవడం పొరపాటు. పైగా సొంతబలం తగ్గిన దృష్ట్యా ఈ తరహా కుటిల రాజకీయాలు ఇంకా తీవ్రం కావచ్చు కూడా. ఎన్నికల అవసరాల కోసం బీజేపీతో చేరి మోడీ మూడో సర్కారుకు ప్రధాన ప్రాపుగా మారిన టీడీపీకి ఈ వాస్తవాలు తెలియవని భావించలేము. ఇక ఎన్నికల్లో దారుణంగా దెబ్బతిన్న వైసీపీ మనుగడ కోసం, కేసుల నుంచి రక్షణ కోసం బీజేపీని మరింత బలపర్చడమే తరుణోపాయమని భావించడం కూడా విచిత్రమే.తాము కాంగ్రెస్‌లో కలసిపోతామని కొందరు ఏపీ బీజేపీ నేతలు చెబుతున్న మాటలు నిజం కాదని కూడా వైసీపీ వారంటున్నారు. బీఆర్ఎస్ తదుపరి అడుగుల విషయంలోనూ చాలా సందేహాలున్నాయి. ఏతావాతా రెండు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతీయ పార్టీలను తన గుప్పిట్లో పెట్టుకునే దిశలోనే బీజేపీ అడుగులేస్తున్నది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మరోసారి సిబిఐ అరెస్టు చేయడంలోనూ ఆయా పార్టీలను ఒత్తిడి పెట్టే ఎత్తుగడ వుంది. మోడీ సర్కారు మతతత్వ కార్పొరేట్ ఏకపక్ష విధానాలపై పోరాడేందుకు తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వెసులుబాటు పెరిగినప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న ఈ పరిస్థితులను ప్రత్యేకంగా చూడవలసిన అగత్యమేర్పడుతున్నది.కనుకనే ఇక్కడ వామపక్ష లౌకిక శక్తులు, ప్రజాస్వామ్య ప్రియులు మరింత అప్రమత్తత వహించాల్సి వుంది. వివిధ పాలకపార్టీల వ్యూహాలకూ విశాల ప్రజాస్వామిక ప్రయోజనాలకు మధ్యన గల వ్యత్యాసాలను నిశితంగా గమనిస్తూ అడుగువేయవలసి ఉంటుంది. ■



ఏపీలో వైసీపీ పాలనపై శ్వేతపత్రాలను విడుదల చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం నిమగ్నమై వుంది. అధికారుల నియామకాలు, బదిలీలు, పాత పాలకులకు ఏజెంట్లుగా వ్యవహరించిన వారికి హెచ్చరికలు వీటిపై దృష్టి కేంద్రీకృతమైంది. ఎన్నికల అనంతర ఉద్రేకాలు ఉద్రిక్తతలు కూడా తీవ్రంగానే వుంటున్నాయి. సరైన అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో కట్టారంటూ వైసీపీ కార్యాలయాలకు నోటీసులు ,కూల్చివేతలపై కోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చి తీర్పు రిజర్వు చేశారు. తప్పులు జరిగివుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గాని కూల్చివేతలకు దిగితే గతంలో వలెనే కక్ష సాధింపు వాతావరణం పునరావృతమవుతుందని సీపీఐ(ఎం), కాంగ్రెస్ వంటి పార్టీలూ, మీడియా కూడా వ్యాఖ్యానించిన పరిస్థితి. అసలు మాజీ ముఖ్యమంత్రి జగన్ కార్యాచరణ కూడా ఇప్పటికీ వెల్లడికాకపోగా అసలు శాసనసభకు వస్తారా? అనే దానిపైనే సందేహాలు నెలకొన్న విచిత్ర పరిస్థితి.

తెలంగాణ గవర్నర్‌గా ఉన్న బీజేపీ నేత రాధాకృష్ణన్ చంద్రబాబును కలుసుకోవడం, బీఆర్ఎస్, బీజేపీ కలసి పాచికలు వేస్తున్నాయనే వార్తలు వ్యాపిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు భిన్న సంకేతాలకు ఆస్కారమిస్తున్నాయి. మరింత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారనే వార్తల నేపథ్యంలో బీజేపీ ఎలా వ్యవహరిస్తుందనేది చూడవలసిందే.టీడీపీని మళ్లీ తెలంగాణలో క్రియాశీలం చేయడానికి చంద్రబాబు నిర్ణయాలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది.ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తెలంగాణ సందర్శనలు చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయేను ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయా? అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. చంద్రబాబుపై తనకు ఎంత గౌరవభావం ఉన్నా తన పదవికే ఎసరు తెచ్చుకునేలా ఎందుకు వ్యవహరిస్తానని రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆయన ఆలోచనను వెల్లడించాయనుకోవాలి.

రైతు ఉద్యమాలే కొరటాలకు నిజమైన నివాళి


కామ్రేడ్ కొరటాలగా అందరూ పిలుచుకునే ప్రియతమ నేత, సీపీఐ(ఎం) ఉమ్మడి రాష్ట్ర కమిటీ పూర్వ కార్యదర్శి, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, రైతు, వ్యవసాయ కార్మిక, చేనేత కార్మిక సంఘాల ఉద్యమ సారథి కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి జులై ఒకటి. ఆయన గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో 1923 సెప్టెంబర్ 24వ తేదీన భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే పద్నాలుగేళ్ల వయసులో డిటెన్షన్‌కు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంతో ప్రజాజీవితంలోకి ప్రవేశించిన కొరటాల 2006 జులై 1వ తేదీన అనారోగ్యంతో మరణించే వరకు ఏడు దశాబ్దాల పాటు ఎర్రజెండా చేత పట్టుకుని అలుపెరుగని పోరాటం నిర్వహించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధ కాలంలో నాలుగేండ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపారు. అజ్ఞాత జీవితంలో ఉండగా 1948లో అరెస్టు చేసి సుమారు మూడేండ్లకు పైగా బళ్లారి, కడలూరు జైళ్లలో నిర్బంధించారు. చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా జరిగిన భూపోరాటంలో, పేదల స్వాధీనంలో ఉన్న బంజరు భూముల పోరాటంలో ఆయనది ప్రత్యేక స్థానం. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, కరువు నుండి రాయలసీమను విముక్తి చేసేందుకు, ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు మళ్లించాలని సాగిన పోరాటాల్లో చేసిన కృషి మరువలేనిది. రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు నివారించాలని, రైతులకు పంటలకు మద్దతు ధరలు కల్పించాలని జరిగిన ఉద్యమాల్లో కొరటాలది క్రియాశీలక పాత్ర.

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్రంలో కరువు, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా బాధితుల పక్షాన నిలబడి ఉద్యమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన పత్తి రైతుల ఆత్మహత్యలపైన, వరి, పత్తి, కంది, మిరప, పొగాకు వంటి పంటలకు కనీస మద్దతు ధరల కోసం ఉద్య మాలు నిర్వహించారు. వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకునిగా వ్యవసాయ కార్మికు లకు బంజరు భూములు పం చాలని, కూలి రేట్ల పెంపుదల, ఉపాధి వంటి సమస్యలపై ఉద్యమాలు నిర్వహిం చారు. చేనేత కార్మిక సంఘం బాధ్యుడిగా చేనేత కార్మికుల మజూరి, రంగుల ధరలు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు వంటి సమస్యలపై ఎనలేని కృషి చేశారు. తాను ఏ రంగంలో పని చేసినా ప్రజాసమస్యల పరిష్కారం కోసం లోతైన అధ్యయనంతో ఉద్యమ నిర్మాణానికి కొరటాల కృషి చేశారు.

రైతు వ్యతిరేక విధానాలపై...

2024 పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్ట పోయినట్లుగా బొటాబొటీ మెజారిటీతో, చంద్రబాబు, నితీష్‌కుమార్ వంటి మిత్రుల మద్దతుతో కేంద్రంలో బీజేపీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చింది. అయినా బీజేపీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం తన వెనుకటి విధానాల నుండి ఏ మాత్రం పక్కకు వైదొలగలేదన్నది స్పష్టమవుతున్నది. జూన్ 19న 2024-25 ఏడాదికి 14 రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం అరకొరగా మద్దతు ధరలను ప్రకటించి రైతాంగం పట్ల తన వైఖరిని మరోమారు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతాంగం క్వింటాలుకు వరి పైన రూ.712, కందులకు రూ.2,206, మినుములకు రూ.2,344, వేరుశనగకు రూ.1,713, పత్తికి రూ.2,224 నష్ట పోతున్నారు. వ్యవసాయ ఖర్చులు 18 శాతం నుండి 35 శాతం వరకు పెరుగుతుంటే మద్దతు ధరలు మాత్రం 5 నుండి 10 శాతం మాత్రమే పెంచారు. పెట్టుబడిపై 50 శాతం (సి2+50 శాతం) లాభం కలిపి పంటలకు మద్దతు ధర నిర్ణయించాలన్న డా॥స్వామినాథన్ కమిటీ సిఫారసులను ఏ మాత్రం అమలు చేయకుండా పక్కన పెట్టిన ఘనత నరేంద్రమోడీ సర్కార్‌దే.

రూ.20వేల వ్యవసాయ పెట్టుబడి సాయం, రూ.2 లక్షల వరకు పంట రుణాలు రద్దు, సున్నా వడ్డీ, పావలా వడ్డీ బకాయిల విడుదల వంటి ఎన్నికల హామీలను ఏపీలో టీడీపీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయాలి. కేరళ తరహాలో రాష్ట్రంలో రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలి. పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించి అమలు చేయాలి. కేంద్రం ప్రకటించని పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయాలి. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి మార్కెట్ ఒడిదుడుకులలో రైతుకు అండగా నిలవాలి.


(జులై 1 కొరటాల వర్ధంతి)

కార్పొరేట్ అనుకూల సాగు విధానాలు

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2019లో తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ నిర్బంధాలను లెక్క చేయకుండా రైతాంగం పెద్ద ఎత్తున చారిత్రాత్మక ఉద్యమం నిర్వహించింది. దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ఆ సందర్భంగా నరేంద్ర మోడీ స్వయంగా పార్లమెంటులో రైతులకు క్షమాపణలు చెప్పి మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని ప్రకటించారు. రైతుల ప్రతినిధులతో చర్చించి మద్దతు ధరలిచ్చేలా పార్లమెంటులో చట్టం తెస్తామని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించు కుంటామని హామీనిచ్చారు. కాని ఆ చట్టాలను మరో రూపంలో అమలు చేస్తూ రైతు కేంద్రంగా ఉన్న మన వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన ఎఫ్‌సిఐ గిడ్డంగులను ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలకు ఇస్తున్నది. విద్యుత్ రంగంలో తెస్తున్న సంస్కరణలతో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రశ్నార్థకం కానుంది. వ్యవసాయ రంగంపైనే కాక, గృహ విద్యుత్ వినియోగ దారులపైనా విపరీతంగా భారం పడే అవకాశం ఉంది.

వెంటాడుతున్న సమస్యలు

తెలంగాణలో తొలకరిలో కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. కానీ ఓవైపు అతివృష్టి, మరో వైపు అనావృష్టి అన్నట్టుగా వర్షపాతం నమోదవడంతో చాలా జిల్లాల్లో వేసిన విత్తనాలు మగ్గి పోయాయి. దీంతో మళ్లీ నాటాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. పైగా నకిలీ విత్తనాల బెడద రైతులను వెంటాడుతోంది. మేలో వచ్చిన తుఫాన్‌తో కొన్ని జిల్లాల్లో పండ్ల తోటలకు అపారనష్టం వాటిల్లింది. కంటితుడుపు చర్యగా ప్రభుత్వం పరిహారమిచ్చి చేతులు దులుపుకుంది. కానీ గతేడాది వర్షాల వల్ల యాసంగి ఐదు లక్షల ఎకరాలు దెబ్బతిన్నా ఇప్పటివరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో రైతుబంధుతో కొంత ప్రయోజనం జరిగినప్పటికీ భూమికి పరిమితి లేకపోవడంతో భూస్వాములు, ధనిక రైతులు లబ్ధిపొందారు. కౌలురైతులకు కూడా రైతుబంధు ఇవ్వాలనే డిమాండ్‌తో వ్యకాస, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టారు.

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సన్నవడ్లతో పాటు ఏడు పంటలకు బోనస్ ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకు "పంట రుణ ప్రణాళిక"ను ప్రకటించ లేదు. మేనిఫెస్టో ప్రకారం ఆగస్టు 15 నాటికి 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. రుణమాఫీ అవుతుందనే ఆశతో రైతులు బాకీలను చెల్లించలేదు. దీంతో బ్యాంకులు కొత్త పంట రుణాలివ్వకపోవడంతో మళ్లీ అధిక వడ్డీలకు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.

2021వ సంవత్సరం నుండి గత ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక రూపకల్పన ఆపేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ ప్రణాళికపై రైతు సంఘాలతో చర్చించింది. రైతు సంఘాలు అనేక సూచనలు చేశాయి. ప్రణాళిక లేకపోవడం వల్ల చాలామంది రైతులు వరి, పత్తి వైపు వెళ్తు న్నారు. మిగిలిన పంటలు వేయడానికి ముందుకు రావడం లేదు. వెంటనే వ్యవసాయ ప్రణాళికను రూపొందించి బహుళ పంటల విధానాన్ని అమలు చేయాలి.

దేశానికి అన్నం పెట్టే రైతులు ఇలా అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతుంటే ఆదుకోవాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేష్టలూడిగి చూస్తున్నాయి. కార్పొరేట్లకు అనుకూల మూడు నల్ల చట్టాల రద్దు విషయంలో రైతులు ఏవిధంగా ఉద్యమించారో అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు అండగా ఎన్నో పోరాటాలు నిర్వహించి రైతుల పక్షాన నిలిచిన కొరటాల స్ఫూర్తి నేటితరానికి ఆదర్శనీయం.

- కె.ప్రభాకరరెడ్డి

దేశానికి అన్నం పెట్టే రైతులు ఇలా అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతుంటే ఆదుకోవాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేష్టలూడిగి చూస్తున్నాయి. కార్పొరేట్లకు అనుకూల మూడు నల్ల చట్టాల రద్దు విషయంలో రైతులు ఏవిధంగా ఉద్యమించారో అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు అండగా ఎన్నో పోరాటాలు నిర్వహించి రైతుల పక్షాన నిలిచిన కొరటాల స్ఫూర్తి నేటితరానికి ఆదర్శనీయం. వెన్నుచూపని పోరాటాల ద్వారానే పాలకుల మెడలు వంచి హక్కులు సాధించుకో గలుగుతాం. ఆ ఉద్యమ చైతన్యమే కావాలిప్పుడు. అదే కామ్రేడ్ కొరటాలకు మనమిచ్చే నిజమైన నివాళి.

రిపోర్టర్స్ డైరీ

సీఎం సాబ్...మీకిది తగునా?

"ఊర్లో ఎవడో చేతబడి చేసేటోడుం టాడు. ఆడు జనాల్ని సంపుతుంటే సూస్తూ ఊరుకుంటమా? చెట్టుకు కట్టేయమా? తాళ్లతో బంధించమా?" బీఆర్ఎస్ ఎమ్మెల్యే లను కాంగ్రెస్‌పార్టీలో చేర్చుకునే అంశంపై ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. యాధృ చ్ఛికమో... అంతకు మించిన ఉదాహరణ దొరకలేదో... లేక మనసులోని మాటో... సొసైటీకి జరుగుతున్న చేటో....'చేతబడి' పేరుతో కొందరు మూర్ఖులు చేసే దాడుల్ని ముఖ్యమంత్రి హోదాలో ఢిల్లీ వేదికగా సమర్థించడం ఏంటి? ఈ చేతబడులు, బాణామతుల పేరుతో ఇటీవల మళ్లీ తెలుగు రాష్ట్రాల్లో మూఢవిశ్వాసాలు పెరిగి, వరుస హత్యలు జరుగుతున్నాయి. వాటిని నివారించా ల్సిన ప్రభుత్వ అధినేత, దాన్ని ఉదాహరణగా తీసుకొని, దాడులు తప్పు కాదని సమర్థించే పద్ధతిలో మాట్లాడటమే తప్పు. పదేండ్లు తెలంగాణలో ముఖ్యమంత్రి కుర్చీ తనదేనని చెబుతున్న రేవంత్‌రెడ్డి స్వరం ఇటీవలి కాలంలో మారుతున్నది. నిన్న మొన్నటి వరకు ప్రజాపాలన అంటూ సామా న్యులకు దగ్గరైన ఆయన ఇప్పుడు, మూఢవిశ్వాసాల ప్రస్తా వనలు తేవడం, పాతబస్తీ కరెంటును అదానీకి అప్పగించే నిర్ణయాలు తీసు కోవడంపై జనంలో చర్చ జరుగుతున్నది. ఎలాగూ 200 యూనిట్ల వరకు గృహవిద్యుత్ ఉచితంగానే సరఫరా చేస్తున్నారు. ఆ సొమ్మును ప్రభుత్వం డిస్కంలకు చెల్లించా ల్సిందే. అలాంటప్పుడు ఇక నష్టాలు ఎక్కడ అని విద్యుత్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కష్టమో నిష్టూరమో మాజీ సీఎం కేసీఆర్ విద్యుత్ సంస్కరణలు అమలు చేసేది లేదని తేల్చిచెప్పారని గుర్తు చేసుకుంటున్నారు. సీఎం సాబ్...జర సోంచాయించుర్రి!!

- ఎస్ఎస్ఆర్ శాస్త్రి

చట్టాలను తుంగలో తొక్కుతున్న యాజమాన్యాలు

- ప్రమాదాలు జరిగితే తప్ప పట్టించుకోని అధికార యంత్రాంగం
- సౌత్ గ్లాస్ కంపెనీ యజమానిని అరెస్టు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- సౌత్ గ్లాస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమ సందర్శన, బాధితులకు పరామర్శ

నవతెలంగాణ-షాద్‌నగర్

పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను నీరు గారుస్తూ, కార్మికులతో పన్నెండు గంటల పని చేయించు కుంటూ చాలీచాలని వేతనాలిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమను సీఐటీయూ బృందం శనివారం సందర్శించింది. ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే తప్పా అధికార యంత్రాంగం ఆ వైపు చూడటం లేదన్నారు. పరిశ్రమలకు అనుమతి ఇచ్చినప్పుడే అన్నీ చూసుకుని ఇవ్వాలని, నామమాత్రంగా అధికార యంత్రాంగం తనిఖీలు చేయడం సరైంది కాదని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు నిమిత్తం వచ్చిన వారితో 12 గంటలు రూ.300, రూ.400 రోజువారీ కూలికి పని చేయించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.





సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారు ఐదుగురు కార్మికులే అంటున్నారు కానీ.. ఇంకా లోపల మృతదేహాలు న్నాయని తోటి కార్మికులు చెబుతున్నారని అన్నారు. ఈ విషయంపై నిజనిర్ధారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కార్మిక చట్టాలను కఠినంగా అమలు పరచాలని కోరారు. కంపెనీ యజమాని శైలేష్‌కుమార్ గుప్తాని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. అంగ వైకల్యం పొందిన కార్మికులకు రూ.25 లక్షలు, చికిత్స పొందుతున్న కార్మికులకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అన్నారు. అందరూ అంతర్రాష్ట్ర వలస కార్మికులే కాబట్టి 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు సరైన తనిఖీలు చేయడం లేదని, యాజమాన్యాల ప్రలోభాలకు లొంగి చూసీచూడనట్టు ఉండటం వల్లే ఇలాంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లేదంటే సీఐటీయూ దశలవారీ ఉద్యమ కార్యా చరణ చేపడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎన్.రాజు, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షు లు బీసా సాయిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, జిల్లా కోశాధికారి కవిత,నాట్కో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు మల్లేష్, కార్యదర్శి కిరియా నాయక్, నాయకులు శ్రీకాంత్, అశోక్, ఈశ్వర్‌నాయక్, చంద్రమౌళి, కావలి రాజు, బేరి శ్రీనివాస్, మైలారం జంగయ్య ఉన్నారు.

విద్యార్థి నాయకులపై బీజేపీ దాడికి ఎస్ఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్‌లో విద్యార్థి నాయకులపై బీజేపీ గూండాల దాడిని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తీవ్రంగా ఖండించింది. ప్రవేశ పరీక్షల నిర్వహణలో వైఫల్యం, అవినీతికి పాల్పడుతున్న మోడీ ప్రభుత్వం, ప్రశ్నాపత్రాల లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఎంపీల క్యాంపు కార్యాలయాలను శనివారం ముట్టడించారు.

ఈ పిలుపులో భాగంగా మహబూబ్‌నగర్ ఎంపీ డికె అరుణ క్యాంపు కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులపై బీజేపీ నాయకులు కర్రలతో దాడికి పాల్పడ్డారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. విద్యార్థి నాయకులను పిడిగుద్దులు గుద్దుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని విమర్శించారు.బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భౌతిక దాడులకు పాల్పడకుండా నీట్, యూజీసీ నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రధాని మోడీని నిలదీయాలని కోరారు. కానీ పోరాడే విద్యార్థి నాయకులపై భౌతిక దాడులకు పాల్పడడం సమంజసం కాదని తెలిపారు.

దాడులకు పాల్పడితే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

'హస్తం' ఖాతాలో మరో కార్పొరేషన్

- బోడుప్పల్‌లో నెగ్గిన అవిశ్వాసం
- మేడ్చల్ జిల్లాలో మల్లారెడ్డికి షాక్

నవతెలంగాణ-బోడుప్పల్

కాంగ్రెస్ ఖాతాలోకి మరో కార్పొరేషన్ చేరింది. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి తన సొంత నియోజకవర్గంలో భారీ షాక్ తగిలింది. శనివారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిగౌడ్‌పై కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన బోడుప్పల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మొత్తం 28 మంది సభ్యులకుగాను 22 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. అనంతరం ఎజెండా ప్రకారం 11 గంటలకు మేయర్ బుచ్చిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. అందుకు అనుకూలంగా హాజరైన సభ్యులందరూ ఆమోదం తెలపడంతో అవిశ్వాసం నెగ్గినట్టుగా అధికారులు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం కూడా నెగ్గడంతో కాంగ్రెస్ కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు.



త్వరలో కొత్త మేయర్ ఎన్నిక

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా బోడుప్పల్ 6వ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ పేరును కాంగ్రెస్ ప్రకటించింది. కలెక్టర్ ఆదేశాల మరకు తేదీ నిర్ణయం కాగానే మేయర్‌గా అజయ్ యాదవ్‌ను ఎన్నుకుంటారని కాంగ్రెస్ నేతలు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. రెండ్రోజుల్లో డిప్యూటి మేయర్ పేరును ప్రకటిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ విషయంలో పోటీ అధికంగా ఉందని చెప్పారు. కాగా, డిప్యూటీ మేయర్ కోసం కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బొమ్మక్ కళ్యాణ్ పోటీ పడుతున్నట్టు సమాచారం.

మీ విచారణలో నిష్పాక్షికత లేదు

- ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిన వారందరినీ విచారించండి
- అప్పుడే సమగ్ర దర్యాప్తు జరిపినట్టు...
- కరెంటు కొనుగోళ్లు, ప్రాజెక్టుల విషయంలో మేం ఎలాంటి తప్పులు చేయలేదు :జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"మా రాజకీయ ప్రత్యర్థులు చేసిన వాదనలతో మీరు ఏకీభవిస్తున్నట్టు మీ మాటల్లో స్పష్టమైంది. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు" ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపై విచారణ కోసం ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్‌కు మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి రాసిన లేఖలోని సారాంశం ఇది. విచారణ పూర్తికాకముందే విలేకరుల సమావేశం నిర్వహించడం సంప్రదాయాలకు విరుద్ధం అంటూ ఆ లేఖలో కమిషన్‌పై విరుచుకుపడ్డారు. ఇప్పటి వరకు జరిపిన విచారణలో వచ్చిన అంశాలకు వివరణ ఇవ్వాలని రెండోసారి కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి ఆయన శనివారం 8 పేజీల సుదీర్ఘ వివరణను కమిషన్‌కు పంపారు. గతంలో కేసీఆర్ కమిషన్‌కు రాసిన అంశాలు, అభ్యంతరాలనే మాజీ మంత్రి కూడా లేఖలో ప్రస్తావించారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందం రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిందనీ, విచారణ కమిషన్ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌తో పాటు అక్కడి అధికారుల్ని కూడా విచారించాలని లేఖలో కోరారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర సంస్థల ఉన్నతాధికారుల్ని కూడా విచారణ జరపాలనీ, అప్పుడు సమగ్ర విచారణ జరిగనట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు. ఏదో నష్టంజరిగిపోయింది... ఇక లెక్కగట్టడమే తరువాయి అన్నట్టు ఉన్న కమిషన్ వ్యాఖ్యలతో పత్రికల్లో రూ.6 వేల కోట్ల నష్టం అంటూ వార్తలు రావడాన్ని ఆయన తప్పు పట్టారు. రాష్ట్ర విభజన, ఆనాటి విద్యుత్‌రంగ పరిస్థితులు, ఆంధ్రప్రదేశ్‌తో కరెంటు పంచాయతీ, కరెంటు కోతలు, రైతుల ఇక్కట్లు, పారిశ్రామికవేత్తల అవస్థలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నామని ఆ లేఖలో వివరణ ఇచ్చారు. తామెక్కడా ఉద్దేశ్యపూర్వకంగా ఎలాంటి తప్పులు చేయలేదనీ, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేశామన్నారు. కమిషన్ ఎదుట ఇప్పుడు ఎవరైతే అభ్యంతరాలు లేవనెత్తారో...వారంతా విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ముందు కూడా ఇవే అభ్యంతరాలు లేవనెత్తారనీ, అసెంబ్లీలోనూ ఇవే అంశాలను ప్రస్తావిస్తే, వాటికి అక్కడే పూర్తిస్థాయి వివరణలు ఇచ్చామని స్పష్టం చేశారు. ఇదే తరహాలో మాజీ సీఎం కేసీఆర్‌కు కూడా కమిషన్ రెండోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వాటిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తీర్పు సోమవారం వెల్లడికానుంది.



దివాళా దిశగా రాష్ట్రం

- వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం ఆర్థికంగా దివాళ దిశలో వెళుతున్నదని అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీఎం రేవంత్ ఢిల్లీ చుట్టూ తిరగడం, పదవుల కోసం పాకులాడటం, పైరవీలు చేయడం, గత ప్రభుత్వంపై నిందలు వేయడం తప్ప పాలనపై దృష్టి పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.38 వేల కోట్ల అప్పులు తెచ్చి ఒక్క పథకాన్ని అమలు చేయలేదని తెలిపారు.

రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతు భీమా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రతి నెలా ఆదాయం రూ.13 వేల కోట్లు రావాల్సి ఉండగా, గత నెలలో రూ.10 వేల కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందనీ, ఆంధ్రప్రదేశ్‌లో పుంజుకుందని చెప్పారు.

బీటీపీఎస్‌లో ఎగిసిపడిన మంటలు

- వెంటనే అప్రమత్తమైన అధికారులు

నవతెలంగాణ-మణుగూరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని భద్రాద్రి పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ స్టేజ్ 1లో ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయి.

ఏం జరిగిందో తెలియక యంత్రాంగం భయాందోళనకు గురైంది. వెంటనే అప్రమత్తమైన అధికారులు సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలో విద్యుత్ ఉత్పత్తి నిర్వహించే యూనిట్ 1, 2ను ట్రిప్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన అగ్నిమాపక దళం మంటల్ని అదుపులోకి తీసుకొచ్చింది.



ట్రాన్స్‌ఫారమ్ పూర్తిగా దగ్ధమైంది. సాయంత్రం వర్షం కురవడంతోపాటు పిడుగు పడిందని, దాంతో మంటలు చెలరేగినట్టు అనుమానం వ్యక్తమవుతున్నాయి. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో రూ.67లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత

- ప్రయాణికుడి అరెస్ట్

నవతెలంగాణ-శంషాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సుమారు రూ.67లక్షల విదేశీ కరెన్సీని అధికారులు శనివారం పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి విదేశీ కరెన్సీతో వెళ్తున్న ప్రయాణికుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక ప్రయాణికుడు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్నాడు. అతని వెంట తెచ్చుకున్న బ్యాగును డీఆర్ఐ అధికారులు ఎయిర్‌పోర్టులో తనిఖీ చేశారు. పాలిథిన్ కవర్లు చుట్టి తరలిస్తున్న విదేశీ కరెన్సీని అధికారులు గుర్తించారు. దాన్ని బయటకు తీసి లెక్కిస్తే రూ.67, 11,250 విలువైన యూఎస్ డాలర్లు ఉన్నాయి. వెంటనే కరెన్సీని స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసి ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నియాన్ని ఫర్నీచర్ షోరూంలు ప్రారంభం



నవతెలంగాణ - హైదరాబాద్

ఫర్నీచర్ ఉత్పత్తుల నూతన రిటైల్ చెయిన్ నియాన్ని హైదరాబాద్‌లో ఏకకాలంలో మూడు కొత్త షోరూంలను ప్రారంభించినట్టు తెలిపింది. కొంపల్లిలో ఏర్పాటు చేసిన తన తొలి స్టోర్‌ను శనివారం డిప్యూటీ సీఎం మల్లూ భట్టి విక్రమార్క, ఎంఎల్ఏ మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి లాంచనంగా ప్రారంభించారు. మరో రెండు అవుట్‌లెట్‌లను అత్తాపూర్, నాగారంలో ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ ఫౌండర్, సీఈఓ ఆకాశ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని షోరూంలను అందుబాటులోకి తేనున్నట్టు ఆయన తెలిపారు. అల్వాల్‌లోని స్టోర్‌ను 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశామన్నారు. తమ వద్ద 300పైగా విస్తృత శ్రేణీ ఉత్పత్తులు లభిస్తాయన్నారు. రూ.99.998 విలువ చేసే కొనుగోళ్లపై జంటకు గోవా ట్రిప్‌ను, 49,998 కొనుగోళ్లపై 43 అంగుళాల టివిని, ఉచిత వెండి నాణెలను అందిస్తున్నట్టు ఆ సంస్థ తెలిపింది.

4 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

- 8 వరకు నిర్వహణ : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వచ్చేనెల నాలుగో తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. అదేనెల ఎనిమిదో తేదీ వరకు ఆ ప్రక్రియ కొనసాగనుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీజీపీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. వచ్చేనెల మూడో తేదీన అభ్యర్థులకు వెబ్‌ఆప్షన్ల సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. 185 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 22న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

బొగ్గు గనుల వేలంపై నిరసనలు

- శ్రావణపల్లి బ్లాకును సింగరేణికి కేటాయించాలని డిమాండ్
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నాలు

నవతెలంగాణ- విలేకరులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాకుల వేలం పాటను వెంటనే ఆపేయాలని, రాష్ట్రంలోని గనులను సింగరేణి సంస్థకే నేరుగా కేటాయించాలని రెండో రోజూ నిరసనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో శనివారం సీపీఐ(ఎం) శ్రేణులు ధర్నాలు చేశారు. మంచిర్యాలలోని శ్రావణపల్లి బ్లాకును సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతాభవన్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తున్నదని, అందులో సింగరేణి సంస్థ కూడా ప్రయివేటు సంస్థలతోపాటు పోటీ పడాలనడం సరైంది కాదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి సంస్థనే బొగ్గు తవ్వాలన్నారు. కానీ కేంద్రం వేలంపాట ద్వారా



ప్రయివేటు సంస్థలకు అవకాశం ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రం నుంచే బొగ్గు గనుల శాఖామంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంపాట ప్రక్రియను ప్రారంభించటం అన్యాయమన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కదలాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, సింగరేణి ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు బొగ్గుబావుల వేలంపై పోరాటాలు చేయాలని కోరారు.

వేలం పాటకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు, విద్యార్థులు, యువత, మేధావులు అందరూ ఏకతాటిగా పోరాటాలకు సిద్ధం అవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆసిఫాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

సింగరేణికి బొగ్గు బావులు వచ్చేలా ఒత్తిడి చేయండి

- సీఎండీకి సీఐటీయూ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణికే బొగ్గు బావులు వచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సింగరేణి చైర్మెన్,మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు సీఐటీయూ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, యూనియన్ నాయకులు బాలాజీ, రాములు ఎమ్‌డీని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 21న దేశవ్యాప్తంగా 61 బొగ్గు బావులను వేలం వేసేందుకు ప్రక్రియను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇందులో సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కూడా వేలంలో పెట్టారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా కార్మికులు పోరాడుతున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి శ్రావణపల్లి బ్లాక్ కేటాయించే విధంగా ఒత్తిడి తీసుకొని రావాలని వారు విజ్ఞప్తి చేశారు. మినరల్ , మైన్స్ డెవలప్‌మేంట్ రెగ్యులేషన్ చట్టంలో సెక్షన్ 17 ఏ ప్రకారం కేంద్రం బొగ్గు బావులను రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించడానికి అవకాశం ఉందని గుర్తు చేశారు. రానున్న 10 ఏండ్లలో సగం సింగరేణి బొగ్గు బావులు మూతపడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి కొత్త బావులు సాధించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ప్రతి ఏడాది రూ.8వేల కోట్లను వివిధ రూపాల్లో చెల్లిస్తుందని తెలిపారు. ఇలాంటి సంస్థను ప్రయివేట్ వారికి అప్పగించొద్దని విజ్ఞప్తి చేశారు. సింగరేణికి జేన్ కో, ట్రాన్స్ కో నుంచి రూ. 30వేల కోట్లు బకాయిలున్నాయనీ, వాటిని రాబట్టాలని కోరారు. ఈ సందర్భంగా సీఎండీ (బలరాం మాట్లాడుతూ..కేంద్ర గనుల శాఖ మంత్రికి బొగ్గు బావులు సింగరేణికి కేటాయించాలని ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో బొగ్గు బ్లాకులను ప్రయివేట్ వారికి ఇవ్వటం వలన నష్టపోయమని గుర్తు చేశారు. కోయగూడెం, సత్తుపల్లి, బ్లాకులను పొందలేక పోయామని తెలిపారు. కేంద్రం సింగరేణికి కేటాయిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను కేటాయించేవరకు అన్ని సంఘాలతో కలిసి పోరాడతామని యూనియన్ నాయకులు తెలిపారు.

రేవంతన్నా.. ఆ ఉత్తర్వుల సంగతేంటి?

- తక్షణమే జీవో 5 ఉపసంహరించుకోవాలి
- కార్మిక హక్కులను హరించొద్దు..
- లేబర్ కోడ్‌లలో భాగమే ఆ జీవో
- గత ప్రభుత్వ తోవలో నడవొద్దు : ధర్నాలో కార్మిక సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

డిమాండ్

'రేవంతన్నా..తక్షణమే జీవో 5ను ఉపసంహరించుకుంటున్నామని ఆదేశాలు ఇవ్వండి.. దాని సంగతేందో పరిశీలించండి, కార్మిక హక్కులను హరించొద్దు..గత ప్రభుత్వ తోవలో నడవొద్దు..ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయండి. అధికారంలోకి రాగానే కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుగుణంగా జీవోలు విడుదల చేస్తే ఎలా? లేబర్ కోడ్‌ల విషయంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరినే అనుసరిస్తారా? ప్రజాపాలనలో ఐటీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు కూడా భాగమే.. అందుకే తక్షణం ఆ జీవోను రద్దు చేయాలి' అని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ (అంజయ్య భవన్) కార్యాలయం ముందు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. 'ఐటీ, ఐటీఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలను మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 5ను తక్షణమే ఉపసంహరించుకోవాలి. కార్మిక హక్కులను కాలరాస్తే ఖబడ్దార్, వుయ్ వాంట్ జస్టిస్' అంటూ కార్మికులు నినదించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బరామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కిషన్ ప్రసంగించారు.



ఎస్వీ రమ మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాలను సడలిస్తూ జీవోను విడుదల చేయటమంటే వారితో వెట్టి చాకిరీ చేయించాలని నిర్ణయించటమేనని చెప్పారు. ఆ జీవో ప్రకారం మహిళా ఉద్యోగులకు భద్రత ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రజాపాలనలో కార్మికుల సంక్షేమం, మెరుగైన జీవితం, కార్మిక హక్కులకు భంగం వాటిల్లకుండా కాపాడాలని ఆకాంక్షించారు. కానీ.. తిరోగమన ఆలోచనలతో గత ప్రభుత్వ తోవలో నడిస్తే ఎలా? అని ప్రశ్నించారు. పని ప్రదేశంలో భద్రత, పని వేళలు, రవాణా సౌకర్యం, వేతనాలకు సంబంధించిన కొన్ని షరతులను అమలు చేయాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వటం సరికాదన్నారు. అనేక సంవత్సరాలుగా ఐటీ పరిశ్రమలను, కంపెనీలను కార్మిక శాఖ తనిఖీలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి షిఫ్టుల కారణంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రయోజనాలను కార్పొరేట్లకు తాకట్టు పెట్టొద్దని సూచించారు. రామారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. బోస్ మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూర్యం మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ తోవలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నదని విమర్శించారు. లేబర్ కోడ్లలో అంతర్భాగమే జీవో 5 అని చెప్పారు. ధర్నా అనంతరం కార్మిక సంఘాల ప్రతినిధి బృందం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఎం పద్మశ్రీ, కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శ్రీకాంత్, పి సుధాకర్, వై సోమన్న, ఎ సునీత, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు అంజాద్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివి రత్నాకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రవీణ్, సీఐటీయూ నాయకులు అశోక్, శ్రీనివాస్, గణేశ్, ఎం శ్రావణ్‌కుమార్, మీనా తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టులో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

- స్వాగతం పలికిన ఆలయ అర్చకులు

ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మల్యాల

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత పవన్ డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి కొండగట్టుకు వచ్చిన సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. పెద్దఎత్తున పవన్ కళ్యాణ్ అభిమానులు గుట్టపైకి చేరుకోవడంతో పోలీసులకు, పవన్ అభిమానులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది.

దర్శనం అనంతరం కొండగట్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, గుట్టపై 100 గదుల నిర్మాణానికి టీటీడీ నిధులు ఇవ్వాలని ఈఓ చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన అభిమానులకు అభివాదం చేస్తూ నేరుగా హైదరాబాద్ వెళ్లిపోయారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పవన్ తన ప్రచార వాహనం వారాహికి కొండగట్టులోనే పూజ చేయించారు.

కేఆర్ఎంబీ చైర్మెన్‌గా అతుల్‌జైన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మెన్‌గా కేంద్ర జల సంఘం ఉన్నతాధికారి అతుల్‌జైన్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్ శర్మ ఆదేశాలు జారీ చేశారు. డీవోపీటీ ఆదేశాల మేరకు సెంట్రల్ వాటర్ ఇంజినీరింగ్(గ్రేడ్ ఏ) సర్వీసులో ఉన్న అతుల్‌జైన్‌ను ప్రస్తుతం పూర్తిస్థాయి చైర్మెన్‌గా నియమించారు. ఆయనకు గతంలో తాత్కాలిక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. సర్వీసు విషయంలో ఇటీవల ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన అనంతరం మరోసారి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. జులై ఒకటి నుంచి తాజా ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నది.

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మృతి

- జెడ్పీ చైర్మెన్, ఖానాపూర్ ఎమ్మెల్యేగానూ సేవలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర



నవతెలంగాణ- ఉట్నూర్

ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేష్(57) మృతి చెందారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఆదిలాబాద్ ఆస్పత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి విషమించింది. శనివారం ఆదిలాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రి నుంచి హైదరాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచారు. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రమేష్ 1966 అక్టోబర్ 20న జన్మించారు. టీడీపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన తొలుత నార్నూర్ జెడ్పీటీసీగా పని చేశారు. టీడీపీ హయాంలో పొలిట్‌బ్యూరో సభ్యుడిగానూ పనిచేశారు. 1999 నుంచి 2004 వరకు ఖానాపూర్ ఎమ్మెల్యేగా సేవలందించారు. 2006 నుంచి 2009 వరకు ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మెన్‌గా వ్యవహరించారు. 2009లో టీడీపీ తరపున ఎంపీగా గెలుపొందారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి 2018లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

2021 జూన్‌లో బీజేపీలో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున ఖానాపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో రాథోడ్ తనదైన ముద్ర వేశారు. ఆయన మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణ తదితరులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆదివారం ఉదయం 10.30గంటలకు ఉట్నూర్ మండలంలోని లింగోజీతండా(ఎక్స్‌రోడ్) వద్ద వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి మరిన్ని నిధులు

- సంక్షేమంపై జాతీయ గిరిజన కమిషన్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ మరింత పురోగతిలో ముందుకు సాగాలని జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాతోత్ హుస్సేన్ ఆకాంక్షించారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ ది ప్లాజాలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ. శరత్, ఆయా శాఖల అధికారులు తమ విభాగాల్లో చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల పురోగతిని కమిషన్‌కు వివరించారు. గిరిజన సంక్షేమ శాఖలోని విద్య, మౌలిక వసతుల కల్పన, ట్రైకార్, జీసీసీ, సంస్కృతి తదితర విభాగాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న ఆయా పథకాల పురోగతి గురించి హుస్సేన్ ఈ సందర్భంగా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత పట్టుదలతో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో గురుకులం కార్యదర్శి సీతాలక్ష్మి, గిరిజన శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్, జీసీసీ జీఎం సీతారాం, గిరిజన పరిశోధన సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ వి. సముజ్వల, డాక్టర్ డీ. సత్యనారాయణ తదితర ఉన్నతాధికారులు, పలు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఆర్ రోడ్డుకు నిరసన సెగ

- అడుగడుగునా రైతుల ఆందోళనలు
- భూమి కోల్పోతే బతుకెట్టా అని ఆవేదన
- రింగ్ రోడ్డు విషయంలో ముందుకు వెళ్లడం ఎలా?
- అధికారుల సమాలోచనలు

నవతెలంగాణ- గజ్వేల్

త్రిబుల్‌ఆర్ రోడ్డుకు భూములు ఇవ్వలేమని రైతులు తెగేసి చెబుతున్నారు. ఇప్పటికే పలు ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన పలువురు రైతులు.. మళ్లీ ఈ రోడ్డు కోసం ఉన్న కొద్దిపాటి భూములు పోతే బతికేదెట్టా అని ఆవేదన చెందుతున్నారు. మరోచోట నుంచి రోడ్డును మళ్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల రైతులు అడుగడుగునా ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు గజ్వేల్ పట్టణంలో రైతులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. తమ భూములను ఇవ్వలేమని అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. దీంతో త్రిబుల్ ఆర్ రోడ్డు విషయంలో ముందుకు వెళ్లడం ఎలా అని సంబంధిత శాఖల అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. రైతుల నిరసనలతో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉంది. ఇటీవల రైతులు మంత్రులను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు.





"కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టులు, కాలువల కోసం భూములు ఇచ్చాం.. ఇప్పుడు మళ్లీ రీజనల్ రింగ్ రోడ్ కోసం భూమి ఇచ్చి మేము బతికేదెలా?" అని కన్నీరు పెడుతున్నారు. ప్రభుత్వ భూములు, శిఖం భూములు ఉన్నచోట నుంచి రింగ్ రోడ్డు వేయాలని, అలైన్‌మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. భూమి కోల్పోతున్న చాలా మంది రైతులు ఇప్పటికే ప్రాజెక్టుల నిర్వాసితులు కావటంతో.. మరోమారు భూములు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని తమ భూములను మినహాయించటమో, మరోచోట భూమి లేదా మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వడమో చేయాలని కోరుతున్నారు.

మంత్రులకు విజ్ఞప్తి

భూ నిర్వాసితులు ఇటీవల రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం ఇప్పటివరకు 980 ఎకరాల భూ సేకరణ చేసినట్టు సమాచారం. ఉత్తర భాగంగా దాదాపు 158 కిలోమీటర్ల పొడవు రోడ్డు.. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే దాదాపు 100 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఇందుకోసం 4500 ఎకరాల భూమిని సేకరించనున్నారు. అందోల్-జోగిపేట్ పరిధిలోకి 8.5 కిలోమీటర్లగాను ఐదు గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. గజ్వేల్ పరిధిలో 32 కిలోమీటర్ల రోడ్డుకు 17 గ్రామాల్లో, తూప్రాన్ డివిజన్ పరిధిలోని 28 కిలోమీటర్లకు 14 గ్రామాల్లో, సంగారెడ్డి పరిధిలో దాదాపు పది గ్రామాలు మొత్తంగా 54 గ్రామాల పరిధిలో 4500 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఈ ప్రాంతంలోని చాలా భూములను రైతులు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌తోపాటు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగు రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంలో కోల్పోయారు.

డీఎస్ కన్నుమూత



(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు ఎంపీ ధర్మపురి అరవింద్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ నిజామాబాద్ నగర మేయర్‌గా పని చేశారు. చిన్న కుమారుడు అర్వింద్ బీజేపీ నిజామాబాద్ ఎంపీగా కొనసాగుతున్నారు. ఆయన భౌతికకాయంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు,, ఉపాధ్యక్షులు జి నిరంజన్ కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తీసుకొస్తారు. అక్కడ ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించి రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అంత్యక్రియల్లో పాల్గొంటారు.

నిజామాబాద్ జిల్లాకు చెందిన ధర్మపురి శ్రీనివాస్ 1948 సెప్టెంబర్ 25న జన్మించారు. తన విద్యార్థి దశలోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుడి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. నిజామాబాద్ జిల్లాపై పూర్తి పట్టు సాధించారు. ఉమ్మడి ఏపీలో పీసీసీ అధ్యక్షుడిగా ఆయన రెండుసార్లు పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, ఎంపీగా, రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పాటు పని చేశారు.1989, 99, 2004లో వరసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. కొద్ది రోజుల పాటు ప్రభుత్వ సలహాదారుగా కొనసాగారు. ఆపై రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. ఆ తర్వాత అనారోగ్య కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల కాలంలో ఆయన కేసీఆర్‌తో విభేదించి సొంత గూటికి చేరారు. తన భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా కప్పుకోవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ గూటికి చేరినట్టు చెప్పారు. అదే నా చివరి కోరిక అంటూ తన సన్నిహితులతో అనేవారు. ఈ క్రమంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్ జెండాను అవతనం చేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. డీఎస్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

రాష్ట్ర సాధనకు అవిశ్రాంత కృషి : గవర్నర్

ధర్మపురి శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అవిశ్రాంతంగా కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకష్ణన్ తెలిపారు. సీనియర్ రాజకీయ నేతగా రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారనీ, ఆయన మరణం తెలంగాణకు తీరని లోటు అని అన్నారు. అనంతరం నివాళులర్పించారు. తెలంగాణ శాసన మండలి తొలి ప్రతిపక్ష నాయకుడు డీఎస్ అని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి, అనుచరులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్, కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను వేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డీఎస్ మరణం బాధాకరం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డీఎస్ తనదైన ముద్రవేశారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించారని పేర్కొన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారని గుర్తు చేశారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పలువురు మంత్రుల సంతాపం

డీ శ్రీనివాస మృతి పట్ల పలువురు మంత్రులు సంతాపం వ్యక్తం చేశారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు సీనియర్ నేత మధుయాష్కీగౌడ్, వీ హనుమంతరావు తదితరులు సంతాపం తెలిపారు. ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని శ్రీనివాసరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి...డీఎస్ మృతి పట్ల సంతాపం, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామమందిరమే కాదు.. సమస్యలూ పరిష్కరించాలి

- బీజేపీపై ఓటర్లలో అసంతృప్తి
- ధరల పెరుగుదలపై అత్యధికంగా 29 శాతం మంది
- ఆ తర్వాత స్థానాల్లో నిరుద్యోగం, పేదరికం
- సీఎస్‌డీఎస్-పోస్ట్‌పోల్ డేటా

న్యూఢిల్లీ : యూపీలోని అయోధ్యలో ఈ ఏడాది జనవరి 22న రామమందిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ కార్యక్రమం కాదంటూనే.. అంతకు మించి హడావుడిని మోడీ సర్కారు ప్రదర్శించింది. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రారంభానికి కేవలం మూడు నెలల ముందు వ్యూహాత్మకంగా దీనిని ప్లాన్ చేసింది. రామమందిర అంశం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. అందరి దృష్టిని ఆకర్షించేలా మోడీ సర్కారు ప్రణాళికలు రచించింది. లోక్‌సభలో ఓట్లు రాల్చటమే లక్ష్యంగా అన్ని ప్రయత్నాలనూ చేసింది. రామ మందిర ప్రారంభోత్సవానికి దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులను ఆహ్వానించి..కార్యక్రమం సందర్భంగా మోడీ ప్రసంగించారు. హిందువుల ఓట్లను గంపగుత్తగా రాబట్టుకోవచ్చని కాషాయపార్టీ భావించింది. అయితే, బీజేపీ వ్యూహం లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఫలించలేదు. అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్ పార్లమెంటు స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి.. ఎస్పీ క్యాండిడేట్ చేతిలో ఓటమిని చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, అయోధ్యలో రామ మందిరం గురించి భారత ఓటర్లు ఏం భావిస్తున్నారు? ఇది ఇటీవల ముగిసిన ఎన్నికల్లో ఏ విధంగా ప్రభావం చూపించిందన్న విషయంపై సీఎస్‌డీఎస్-పోస్ట్ పోల్ సమాచారం ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ప్రజలు రామ మందిరం మాత్రమే కాకుండా సమస్యలపైనా మంచి అవగాహనను కలిగి ఉన్నారు. పలు సమస్యల విషయంలో మోడీ సర్కారుపై వారు అసంతృప్తిలో ఉన్నారు. సీఎస్‌డీఎస్ సమాచారం ప్రకారం.. బీజేపీ నేతత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ 'అత్యంత ఆమోదిత పని' అనే బహిరంగ ప్రశ్నకు సమాధానంగా 22 శాతం మంది రామ మందిర నిర్మాణాన్ని ప్రస్తావించారు. పేదరికాన్ని తగ్గించటం, ఉపాధి అవకాశాలను సృష్టించటం వంటివాటిని బీజేపీ ప్రభుత్వ రెండో, మూడో అత్యంత ఇష్టపడే పనులుగా వివరించారు.బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ 'అత్యంత ఆమోదయోగ్యం లేని పని' గురించిన బహిరంగ ప్రశ్నకు సమాధానంగా.. 'ధరల పెరుగుదల'పై 29 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, 27 శాతం మంది నిరుద్యోగాన్ని పరిష్కరించటంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న పేదరికం కూడా ప్రభుత్వ అత్యంత ఇష్టపడని పనులలో ఒకటిగా ఉద్భవించిందని ప్రజలు భావిస్తున్నారు. 11 శాతం మంది ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. రామమందిర నిర్మాణానికి ప్రజలు మద్దతు ఇస్తూనే.. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పేదరికం వంటి ఇతర సమస్యలతో సహా దేశంలో నెలకొన్న ఆర్థిక సవాళ్లను కూడా వారు పరిగణనలోకి తీసుకుంటుండటం గమనార్హం. ప్రజలకు ఓటు వేసే విషయంలో సామాజిక, రాజకీయ సమస్యల కంటే ఆర్థిక సమస్యలు ప్రాధాన్యతనిస్తాయని డేటా వెల్లడిస్తున్నది.

సీఎస్‌డీఎస్-లోక్‌నీతి ప్రీ-పోల్ అధ్యయనంలో ఒక బహిరంగ ప్రశ్నకు ప్రతిస్పందనగా.. 'రామమందిరాన్ని' ప్రభుత్వం అత్యంత ఇష్టపడే పనిగా పేర్కొన్న వారిలో నాలుగింట ఒక వంతు (25 శాతం మంది) నిరుద్యోగాన్ని అత్యంత ముఖ్యమైన ఓటింగ్ సమస్యగా గుర్తించారు. ప్రతి 10 మందిలో ఇద్దరు (22 శాతం మంది) ధరల పెరుగుదలను పేర్కొన్నారు. సాపేక్షంగా 19 శాతం మంది రామమందిర నిర్మాణాన్ని ముఖ్యమైన ఓటింగ్ సమస్యగా పరిగణించారు. బీజేపీ పలు స్థిరమైన ప్రయత్నాలు చేసినప్పటికీ.. అయోధ్య అంశాన్నే ప్రజలు ఆధారంగా చేసుకోలేదన్నది స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఒకవేళ రామ మందిర అంశమే కీలకమైతే, ఫైజాబాద్ వంటి కీలక స్థానంలో బీజేపీ విజయం సాధించేదని వారు అంటున్నారు.

శ్రామికులతోనే అభివృద్ధి

నగరాలంటే ధనికులకే కాదు..

- పేదలు నివసించే ప్రాంతాల్లోనూ సౌకర్యాలపై దృష్టి పెట్టాలి
- తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలి : ప్రొఫెసర్ కె.నాగేశ్వర్
- తెలంగాణలో నగరీకరణ-ప్రభుత్వ విధానాలపై సెమినార్



నవతెలంగాణ-ముషీరాబాద్

నగరాలు ధనికులకే కాదు శ్రామికులకు కూడా అని.. వారు లేకుండా అభివృద్ధి లేదని.. పేదలు నివసించే ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో 'నగరీకరణ-ప్రభుత్వ విధానాలు -ప్రత్యామ్నాయాలు' అంశంపై శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సెమి నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ. అభివృద్ధి చెందిన నగరాలు అంటే ధనికులు మాత్రమే నివసించే విధంగా తయారయ్యాయన్నారు. ఒక నగరం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే విధంగా అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉండాలని, పేద , ధనిక తేడా లేకుండా అభివద్ధి చేయాలని అన్నారు. శ్రామికులు లేకుండా నగరాల అభివృద్ధి లేదని.. శ్రామికులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి వారు కూడా ఆనందంగా జీవించేలా చర్యలు చేపట్టాలని పాలకులకు సూచించారు. పట్టణ కార్మికులకు ఉపాధి గ్యారంటీ చట్టం తీసుకురావాలని, నగరాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే ఆదాయ పన్నులో 10 శాతం కేటాయించాలని కోరారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునే విధానాలు చేపట్టాలన్నారు. భూ వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా నగరాల అభివృద్ధి వ్యూహం ఉండకూడదన్నారు. ప్రకృతిని నాశనం చేయడం ఆపి దానితో కలిసి జీవించాలన్నారు. పర్యావరణ కాలుష్యం నివారణకు 70శాతానికిపైగా ప్రజలు ప్రజా రవాణా వినియోగించాలని సూచించారు. ప్రస్తు తం 30 శాతం ప్రజలు మాత్రమే ప్రజా రవా ణాను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురా వాలన్నారు.పట్టణ విధానాల నిపుణులు డా. డి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నగరాల అభివృద్ధి సహజంగా జరగడం లేదని, ప్రభుత్వాలు బలవంతంగా గ్రామాలను విలీనం చేస్తున్నాయని తెలిపారు. సంస్కరణల పేరుతో ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నాయని, పట్టణ విధానాలు ఎక్కడ నిర్ణయిస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకమైన విధానాలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. మెట్రో రైలుపై సమీక్ష చేసిన ముఖ్యమంత్రి సామాన్యులకు అందుబాటులో ఉండే ఎంఎంటీఎస్ రైళ్లపై కూడా సమీక్షించాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రాంతాల్లో తక్షణమే సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల జారీ వెంటనే ప్రారంభించాలని, నగరంలో మురికివాడల్లో సదుపాయాలు పెంచే చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ప్రొఫెసర్ ఇండీ వర్ మాట్లాడుతూ.. నగరంలో పేదల ప్రాంతాలపై నిర్లక్ష్యం కొనసాగుతున్నదన్నారు. సంపన్నులు.. పేదల ప్రాంతాల పట్ల ద్వంద్వ విధానాలు విడనాడాలని, పేదల ఇండ్లకు హక్కులు కల్పిం చాలని కోరారు. ఈ సెమినార్‌లో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్, ఎం.మహేందర్, కేఎన్ రాజన్న, కె.నాగలక్ష్మి, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బీజేపీ రాష్ట్ర ఆఫీసు ముట్టడికి ఆప్ యత్నం

- అరెస్ట్ చేసిన పోలీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆప్ శ్రేణులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ, జెండాలు చేతబూని బీజేపీ ఆఫీసు వైపునకు మెరుపువేగంతో దూసుకొచ్చారు. ప్రధాని మోడీ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసేసి కార్యాలయం వైపు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆప్ శ్రేణులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వ్యక్తి దారుణ హత్య

- గొంతు కోసి చంపిన దుండగులు
- రంగారెడ్డి జిల్లా నార్సింగి పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-గండిపేట

రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని దుండగులు కత్తితో అతని గొంతు కోసి హతమార్చారు. ఈ ఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండలోని చోటాబజార్ ఏరి యాకి చెందిన ఇజాయత్ అలీ(31) సౌదీలో ఇంజినీర్‌గా పని చేశాడు. కొన్నేండ్ల కిందట అతను ఇండియాకు వచ్చాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అతన్ని క్వాలీస్ వ్యాన్‌లో మంచిరేవుల (గ్రీన్‌ల్యాండ్స్) వెంచర్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకొచ్చారు. అక్కడ కత్తితో ఇజాయత్ అలీ గొంతు కోసి హత్య చేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందాలను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలంలో క్వాలీస్ వ్యాన్‌తోపాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్యలో ఇద్దరు యువకులతోపాటు ఓ మహిళ కూడా పాల్గొన్నట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

మత విద్వేషానికి పరాకాష్ట

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఒక టీమ్‌లో ఎక్కువమంది ముస్లింలే వున్నారని, మరో దాంట్లో ఇద్దరు ముగ్గురు ముస్లింలు వున్నారని ఆయన తెలిపారు. తమకు భద్రత వుందని భావించడం లేదంటూ ముస్లిం ఆటగాళ్ళలో కూడా చాలామంది చెప్పారని, తాము ఆడుతుంటే కొంతమంది జనం జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారని, ముస్లిం ఆటగాళ్లు బాగా ఆడడాన్ని వారు సహించలేకపోతున్నారని స్పష్టమైందని వారు చెప్పారన్నారు.

వివాదం రేగిందిలా !

23ఏండ్ల సల్మాన్ వోహ్రా ఈ నెల 22న చికోద్రాలో క్రికెట్ టోర్నమెంట్‌కు వెళ్లారు. గుజరాత్‌లోని ఆనంద్‌లో పోల్సన్ కాంపౌండ్ వాసి అయిన సల్మాన్ వస్త్ర వ్యాపారంలో పనిచేస్తున్నారు. పార్కింగ్ వివాదంతో హింస ప్రారంభమైంది. కొంతమంది గ్రూపుగా మోటార్‌సైకిళ్ళపై వచ్చి సల్మాన్ బైక్‌ను స్టాండ్ నుంచి తీసేయాలంటూ గొడవ పెట్టుకున్నారు. ఆ బృందంలో కొంతమంది బాగా తాగేసి వున్నారు. మేం చెప్పింది చేయాలంటూ వారు సల్మాన్‌ను హెచ్చరించారు. కొద్దిసేపు అయిన తర్వాత మరో నలుగురైదుగురిని తీసుకుని అక్కడకు వచ్చారు. బాగా తాగి వున్న వ్యక్తి మరో ముస్లిం యువకుడు సుహైల్‌ను సల్మాన్ అనుకుని పొరబడి ఆ వ్యక్తిపై దాడి ప్రారంభించాడు. వారినుండి సుహైల్‌ను రక్షించేందుకు సల్మాన్ రంగంలోకి దిగాడు. దాంతో ఆ అల్లరి మూక సల్మాన్‌పై బ్యాట్‌లు, కత్తులతో దాడికి పాల్పడింది.

ఒక చెవిని కొరికేశారు !

ఆ వ్యక్తులు నిర్దాక్షిణ్యంగా సల్మాన్‌ను కొట్టడం ఆరంభించారు. ఈ గలాభాకు అక్కడకు చేరిన జనం చోద్యం చూస్తున్నట్లుగా వుండగా మరికొంతమంది దాడి చేస్తున్న వారికి మద్దతిచ్చేలా వ్యవహరించారు. అంతేగాని ఎవరూ కూడా అతడిని కాపాడేందుకు రాలేదు. 'అతడిని చంపేయండి, చంపేయండి అంటూ కొంతమంది అరవడం ది క్వింట్ సంపాదించిన వీడియోలో వినిపిస్తోంది. సల్మాన్ నిస్సత్తువుగా పడిపోవడంతో వారు కొట్టడం ఆపారు. ఈలోగా కొంతమంది అతడిని లేపి, మంచినీరు తాగించి అంబులెన్సుని పిలిపించారు. సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్ళగా వారు పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. రెండో ఆస్పత్రికి వెళ్ళేసరికే సల్మాన్ చనిపోయాడు. 'సల్మాన్ మృతదేహాన్ని చూశాను. కుడి చేతిపై గాయాలు వున్నాయి. కళ్ళకింద కత్తిగాట్లు వున్నాయి. చెవి ఒకటి దారుణంగా దెబ్బతింది. నిజానికి దాడి చేసిన వారు దాదాపుగా సల్మాన్ చెవిని కొరికేశారు. కత్తితో జరిపిన దాడితో ,చాలా పెద్ద గాయమవడంతో అతడి కిడ్నీ తీవ్రంగా దెబ్బతింది. నడుం కింది బాగంలో,, మెడపై కూడా తీవ్రంగా చావబాదారు. మొత్తంగా శరీరం రక్తమోడుతూ వుంది.' అని కార్యకర్త ఆసిమ్ తెలిపారు. కత్తి నేరుగా సల్మాన్ కిడ్నీలోకి దిగబడిపోయిందని పోస్టు మార్టం నివేదికలో వెల్లడైంది. బహుశా మరణానికి ఇదే ప్రధాన కారణమై వుంటుందని సల్మాన్ మామ నార్మన్ అన్వర్ పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్ చూసేందుకు వెళ్లాడు. ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. రెండు మాసాల క్రితమే వోహ్రాకు పెళ్ళి అయింది, భార్య ఇప్పుడు గర్భవతి." అని ఆయన తెలిపారు. సల్మాన్‌తో పాటు మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. వారిలో ఒకరికి 17కుట్లు పడ్డాయి. రెండో వ్యక్తికి ఏడు కుట్లు పడ్డాయి.

ఎఫ్ఐఆర్ నమోదు

మరునాడు తెల్లవారు జామున 4గంటలకు సల్మాన్ కుటుంబం ఆనంద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు 9మందిని అరెస్టు చేసినట్లు దర్యాప్తు అధికారి ఎ.జె.అసారి తెలిపారు. వారిని ఏడు రోజుల రిమాండ్‌కు పంపారు. దాడి వీడియో బాగా వైరల్ అవడంతో నిందితులను మరింతమందిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ప్రధాన నిందితులు విశాల్, శక్తిలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కత్తులతో క్రికెట్ గ్రౌండ్‌కు వచ్చారంటే వారు దాడులకు ముందస్తు ప్రణాళికలతోనే వచ్చారని అర్థమవుతోందని అసీమ్ ఖెద్వాలా వ్యాఖ్యానించారు. కాగా, మ్యాచ్ చూసేందుకు వచ్చిన జనం దాదాపుగా 5వేల మంది వరకు వుంటే, వారిలో ముస్లింలు 500మంది కన్నా ఎక్కువమంది వుండరని ప్రేక్షకుల్లో కొంతమంది తెలిపారు.

నవతెలంగాణ
ఎల్బీనగర్ - మహేశ్వరం
ఆదివారం జూన్ 30, 2024 www.navatelangana.com

డివిజన్ ప్రజలకు అండగా ఉంటా : కార్పొరేటర్



నవతెలంగాణ - సంతోష్ నగర్

డివిజన్ ప్రజలకు అండగా ఉంటానని ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని శ్రీ నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ దేవాలయం, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నిర్మల్ నగర్ కాలనీ కర్మన్ ఘాట్ వద్ద హైమాస్ లైట్స్‌ను శనివారం నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఏ.ఈ. జగన్నాథ్, సూపర్వైజర్ హనుమంత్, భిక్షం, బీజేపీ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు లింగాల దశరథ్ గౌడ్, గూడూరు అవినాష్ రెడ్డి, శ్రీనివాస్ రాంపురం, గాజుల శేఖర్, పాశం శ్రీశైలం, అనిల్ పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని టీపీ సీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీని వాస్ గుప్త అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో చైతన్యపురిలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగిన అనుగ్రష్టమి అనుఘా దేవి దత్తవ్రతంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్య క్రమాలు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. మహిళలు అందరూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. రైతులు అందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు పసునూరి శ్రీనివాసు, నటుడు టార్జాన్, ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్త, అడిషనల్ డీసీపీ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అల్మాస్‌గూడ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..!



- అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

గుర్రంగూడ నుండి అల్మాస్ గూడ వరకు ఉన్న రోడ్డుకు మోక్షం ఎప్పుడో అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్, రోడ్లు, వివిధ అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి కోసం గత ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ రూ.250 కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మంజూరైన ప్రత్యేక నిధులను రద్దు చేయకుండా, పెరుగుతున్న జనాభాను కాలనీలను దృష్టిలో పెట్టుకొని విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల కంటే ముందు ఎక్కడైతే అసంపూర్తిగా రోడ్ల పనులు మిగిలి ఉన్నాయో ఆ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. అందులో ముఖ్యంగా గుర్రం గూడ నుండి అల్మాస్ గూడ రోడ్డు వెడల్పు పనులను త్వరితగతిన ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ పనులన్నీ నిలిచిపోవడం జరిగిందని తెలిపారు. గడ్డం ఎంక్లేవ్, అరవింద్ నగర్, శ్రీకృష్ణ నగర్, మారుతీ నగర్, ఆదిత్య నగర్‌లలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, నూతనంగా విస్తరిస్తున్న కాలనీలను దృష్టిలో పెట్టుకొని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ పునరుద్ధరణకు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.250 కోట్లు మంజూరు చేయగా.. రాజకీయ దురుద్దేశంతోనే నేడు ఆ నిధులను అడ్డుకుంటున్నారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కమిషనర్ రఘు, డీఈఈ యాదయ్య, జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్, కార్పొరేటర్లు, నాయకులు గుర్రం సాయి కిరణ్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, బీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ, వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'బతికే అర్హత ఉన్న ఏ ఒక్క ప్రాణం పోకూడదు'



నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

అల్కాపురి నక్షత్ర హాస్పిటల్స్ (సూట్స్ కేర్ నెట్వర్క్), శ్రేయస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, బండ్లగూడ ఆధ్వర్యంలో శనివారం బతికే అర్హత ఉన్న ఏ ఒక్క ప్రాణం పోకూడదనే నినాదంతో కంప్రెషన్స్ ఓన్లీ లైఫ్ సపోర్ట్, గోల్డెన్ అవర్ ట్రామా కేర్ మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్.కె.సాగర్ (ప్రిన్సిపల్) మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఇంకా చాలా నిర్వహించాలని సూచించారు. ఇలాంటివి ఫ్యాకల్టీ, స్టూడెంట్స్‌కు చాలా ఉపయోగకరమన్నారు.

అనంతరం నక్షత్ర హాస్పిటల్స్ (సూట్స్ కేర్ నెట్వర్క్) సీఈఓ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.సోమశేఖర్ రెడ్డి, యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 100మందికి పైగా విద్యార్థులు, శ్రేయస్ వైస్ చైర్మన్ హృదయ రెడ్డి, డాక్టర్.కె.సాగర్ (ప్రిన్సిపల్), ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.రాగలతా, నక్షత్ర హాస్పిటల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మహబూబ్ బాషా, మేనేజర్ హర్ష, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడ్డం సులోచన పదవీ విరమణ



నవతెలంగాణ-సంతోష్‌నగర్

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కవయిత్రి గడ్డం సులోచన పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం సులోచన..పాఠశాలకు, తనకు ఉన్న సుదీర్ఘ బంధాన్ని, ఎదుర్కొన్న అనుభవాల్ని వివరించారు. అందరి సహకారంతోనే పాఠశాలలో సంస్కరణల్ని తీసుకురాగలిగానన్నారు. ప్రతి ఒక్కరూ పాఠశాలను అగ్రస్థానంలో నిలబెట్టడానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. చదువును ఎప్పటికి ఎవరూ దోచుకోలేనిదని, విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సులోచన దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో జీహెచ్ఎం లావణ్య, మాజీ ఎంఈఓ బీఎస్‌రెడ్డి, టిపిపిఎస్ నాయకులు రమేష్, పి టి ఆర్ యు నాయకులు పరమేష్, ఉపాధ్యాయ బృందం, పలు విభాగాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలని వినతి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ నుండి నాదర్‌గుల్ గ్రామంలోని ప్రధాన రహదారి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్‌లు కోరారు. ఈ మేరకు శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి.. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు0 గురవుతున్నారని తెలిపారు. నాదర్‌గుల్ గ్రామంలోని ప్రధాన రహదారి పూర్తిగా గుంతలుగా ఏర్పడి వాహనదారులు ,ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

'పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలి'

- దశాబ్దాలుగా న్యాయం జరగలేదు
- నకిలీదారుల సర్టిఫికెట్లు రద్దు చేయాలి
- తహసీల్దార్‌కు సీలింగ్ భూ బాధితుల వినతి
- ఆర్డీఓ, సీసీఎల్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

తమకు కేటాయించిన సీలింగ్ భూమిలో పట్టాలిచ్చి న్యాయం చేయాలని అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తుకు మజీద్ పూర్ గ్రామానికి చెందిన సీలింగ్ ల్యాండ్ భూ బాధితులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూ బాధితులు మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో 1969 లో 243.31 ఎకరాల భూమిని 1)పెన్మత్స ప్రభావతి భర్త రాజన్ రాజు, 2)వెంకట్ రాజు తండ్రి పిఎస్ రాజు, 3)బుచ్చి వెంకాయమ్మ భర్త రామకృష్ణ రాజులు కొనుగోలు చేసిన భూమి 1973 సీలింగ్ యాక్ట్ ప్రకారం భూ సంస్కరణలు ద్వారా 1993లో తమ గ్రామానికి చెందిన సుమారు 143 మందికి రెవెన్యూ సర్వేనెం. 161 ,162 ,163, 74 76 ,77, 83, 84, 87,88,89 లలో సుమారుగా 132 ఎకరాలలోని పంట భూములకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నాటి నుంచి భూమిని అనుభవిస్తూ వస్తున్నామని తెలిపారు. ఆ భూమికి పట్టా పాసు బుక్కులు ఇచ్చి భూ రెవెన్యూ రికార్డుల్లోని పహాణిలలో నమోదు చేయాలని అనేక దఫాలుగా రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నామని తెలిపారు. 1993 నుంచి దశాబ్దాల కాలంగా కోరుతున్నా తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయిన న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. కొందరు తమకు సంబంధించిన సర్వే.161, 162,163,74,87, 88, 89 లో నకిలీ సర్టిఫకెట్లు ద్వారా అమ్మకాలు/ కొనుగోలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ సర్వే నెం. లోని నకిలీ సర్టిఫికెట్లు రద్దు చేసి తమకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరినట్లు చెప్పారు.

వినతి పత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాంటెకర్ రమేష్, నాయకులు మేడిపల్లి నరసింహ గౌడ్, భూ బాధితులు గోపుకొని దర్శన్, కావలి చిన్న యాదయ్య, కావలి నరసింహ, కావాలి యాదయ్య, ఎడ్ల వీరయ్య ఎడ్ల రమేష్, గోపాగోని రామస్వామి, పల్లె బాలరాజ్, శివరాల శంకర్, చెరుకూరి అంజయ్య ,చెరుకూరి సాలయ్య, బొడిగే మల్లేష్ బొడిగే బాల్ శెట్టి, అంజయ్య, మేడిపల్లి శ్రీశైలం, బర్రె కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను : తహసీల్దార్

మజీద్ పూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలు తమ దృష్టికి వచ్చింది. వెంటనే దానికి సంబంధించిన భూ రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ఆర్డీవో ద్వారా సీసీఎల్ లోని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తాను.

వెంకటేశ్ గౌడ్‌కు సబితమ్మ పరామర్శ



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ నివాసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండు వెంకటేశ్ గౌడ్‌ను శనివారం ఆయన నివాసంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. తర్వాత ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైై దిండు వెంకటేశ్ గౌడ్ చికిత్స పొందాడు. అనంతరం వెంకటేశ్ కుటుంబానికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సబితమ్మ భరోసా ఇచ్చారు. వెంకటేశ్‌ను పరామర్శించిన వారిలో కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, రామిడి రాంరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ, భీమిడి జంగారెడ్డి, పార్టీ నాయకులు. కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం సాగర్ రింగ్ రోడ్ వద్ద ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ సష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ డీసీపీ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఏసీపీ ఆదేశం మేరకు ఆర్ఐసిఐ సర్వర్ అహ్మద్, ఆర్ఎస్ ఐ సంతోష్ గౌడ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ డ్రైవ్లో ట్రాఫిక్ రద్దీకి ఇబ్బందులు కలిగిస్తున్న లోడ్ బండ్లు, గుడ్స్ ఆటోలపై కేసులను నమోదు చేసి జరిమానాలను విధించినట్లు తెలిపారు. రోడ్డుపైనే ఇరువైపులా వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సృష్టిస్తున్నారని, అదే విధంగా పండ్ల బండ్లతో ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీనిపై కూడా ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్టయితే వాహన యజమానికి మోటర్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ.2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, యజమానులు ఎట్టి పరిస్థితులలో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



టెస్కాబ్ వైస్ చైర్మెన్ సత్తయ్య

నవతెలంగాణ-తుర్కయంజాల్

రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టెస్కాబ్ వైస్ చైర్మెన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో తుర్కయంజాల్‌లోని ఎఫ్ఎస్‌సీఎస్‌లో శనివారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న రైతు భరోసా పథకంపై సభ్యుల సూచనలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సూచనలను తీర్మానించి, ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. రైతును లాభసాటిగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని, వారి అభ్యున్నతికే ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి ధాత్రిదేవి, సంఘ ఉపాధ్యక్షులు కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ జక్క కృష్ణారెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సంఘ సెక్రెటరీ వై.రాందాస్, సీనియర్ నాయకులు, సంఘ సభ్యులు కందాడ లక్ష్మారెడ్డి, జి.వి. స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో

అధికారులు జాగ్రత్తగా ఉండాలి

- డిప్యూటీ కమిషనర్ యాదయ్య



నవతెలంగాణ - ఎల్బీనగర్

వర్షాకాలంలో అధికారులు జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ కమిషనర్ యాదయ్య అన్నారు. హయత్ నగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో సర్కిల్ కార్పొరేటర్లు, ఉన్నతాధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడ కూడా వాటర్ స్టాగ్నేషన్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా ప్రతి ఆలయం వద్ద లైటింగ్ అరేంజ్మెంట్స్, ఆలయాల వద్ద మొరం మట్టి, మరమ్మత్తులు, శానిటేషన్ చేపట్టాలన్నారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు కొట్టివేసిన చెట్ల కొమ్మలను వెంటవెంటనే తీసివేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమలను అరికట్టేందుకు ప్రతి కాలనీలో ఫాగింగ్ చేపట్టాలని చెప్పారు. అనంతరం ప్రతి డివిజన్ కు కొత్త వీధిలైట్లు మంజూరు చేయాలని కార్పొరేటర్లు అధికారులను కోరారు.

ఈ సమావేశంలో నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ లచ్చి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావని, ఎస్ డబ్ల్యూ ఎం డిప్యూటీ ఇంజనీర్ లావణ్య, వెటర్నరీ అధికారి యాదగిరి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దామోదర్, అసిస్టెంట్ ఇంజనీర్లు రాకేష్, చంద్రశేఖర్ రెడ్డి, నరేంద్ర తేజ, సానిటరీ సూపర్వైజర్లు చంద్రశేఖర్ రెడ్డి, అజీముద్దీన్, ఎంటమాలజీ ఏఈ రవీంద్రనాథ్ రెడ్డి, సర్కిల్ రాంకీ టీం ఇంచార్జి పాల్గొన్నారు.

యువ జూనియర్ కళాశాలలో ట్రెడిషనల్ డే వేడుకలు



నవతెలంగాణ-సిటీ బ్యూరో

వనస్థలిపురంలోని యువ జూనియర్ కళాశాలలో ట్రెడిషనల్ డే వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ నంది కంటి భాస్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ కాలేజీలో నిర్వహించినటువంటి ట్రెడిషనల్ వేడుకలను విద్యార్థుల ఆనంద ఉత్సవాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయమైన వస్త్రాలంకరణలో పలు రాష్ట్రాల సాంప్రదాయాలను ప్రదర్శించారని చెప్పారు. విద్యార్థులు ప్రదర్శింపబడిన సాంప్రదాయ నృత్యాలు అందర్నీ అలరించాయని అన్నారు. ప్రపంచంలో వస్తున్నటువంటి మార్పులకు అంతరించిపోతున్న సాంప్రదాయాలకు ఈ తరుణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మన సాంప్రదాయాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు వారిని నిలబెట్టిన వారం అవుతామని అన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మేనేజర్ ఎమ్మెల్ శారద, ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్మశాన వాటిక, కాలనీ సమస్యలు పరిష్కరించండి'

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో ఉన్న మాలల స్మశాన వాటిక, కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డికి ఆయన నివాసంలో బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ నర్సింహారెడ్డి శనివారం ఎస్‌సిఆర్‌పి ఎస్ సంఘం అధ్యక్షులు గుండె నాగార్జున బాబు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా మా కాలనీలో ప్రజలు కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నా రని అవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రోడ్డు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దాదాపు 2017వ సంవత్సరం నుండి ప్రజా ప్రతినిధులకు, అధికా రులకు కార్పొరేషన్ కమిషనర్ల కు, మేయర్ చిగురింత పారి జాత నర్సింహారెడ్డికి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్, 17వ డివిజన్ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డిలకు అనేక సార్లు వినతి పత్రాలను అందజేసిన ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఆర్‌పి ఎస్ సంఘం ప్రధాన కార్యదర్శి గుండె రాఘవేంద్ర బాబు, రాష్ట్ర ఎస్సీ ఉపాధ్యక్షులు బాల్ లింగని జంగయ్య, మాజీ వ్యవస్థాపక అధ్యక్షులు దార్ల దయానంద, మాజీ అధ్యక్షులు నాలుక సూర్య ప్రకాష్, కోశాధికారి దార్ల పవన్ కుమార్, జాయింట్ సెక్రటరీలు నాలిక శివకుమార్, మర్రి మహేష్ కుమార్, సంఘం సభ్యులు మాజీ ఉపాధ్యక్షులు గుండె గణేష్ బాబు, మర్రి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రంలో పలు మౌలిక వసతులు కల్పించాలని, జిల్లా ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఫైళ్ల ప్రవీణ్, నేమూరి మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పద్మకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ మున్సిపాలిటీలో 27 ఏండ్లు ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన పద్మను అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. ఆమె శేష జీవితం ఆయురారోగ్యాలు, సుఖ శాంతులతో నలుగురికి ఉపయోగపడేలా ఉండాలని కోరారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ నరసింహారెడ్డి, సాంబ శివరావు, లలిత్ కుమార్, డాక్టర్ మంజుల, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీలో 36 గంటల జాతీయస్థాయి హ్యాకథాన్



నవతెలంగాణ-ఘట్కేసర్

మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో గల అనురాగ్ యూనివర్సిటీలో సీఎస్‌సీ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి హ్యాకథాన్ టెక్ హ్యాక్ టెక్ హ్యాక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మనీష్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగమైన, ఎంటర్ప్రె న్యూర్ షిప్ అయినా ప్రణాళిక బద్ధంగా నియమ నిబద్ధతతో కూడిన కఠోర పరిశ్రమ ఉంటేనే విజయం సాధిస్తారని, ఇలాంటి హ్యాకథాన్‌లలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, మెలుకువలు నేర్చుకోవడంతోపాటు నాయకత్వ లక్షణాలు వ్యక్తిత్వ వికాసం పెంపొందించు కోవడానికి తోడ్పడతాయని తెలిపారు. 36 గంటల హ్యాకథాన్‌లో దేశవ్యాప్తంగా వివిధ విద్యాలయాల నుంచి సుమారు 500 పైచిలుకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ విష్ణుమూర్తి, విజయ్ కుమార్, సమన్వయకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురి శ్రీనివాస్‌కు రామ్మోహన్ నివాళి



నవతెలంగాణ-కాప్రా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌లు శనివారం నివాళు లర్పించారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డి. శ్రీనివాస్ మంత్రిగా, ఎంపీగా తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని రామ్మోహన్ పేర్కొన్నారు. డి. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడకు చెందిన అమర్నాథ్‌గౌడ్ ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్‌లోని మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో మెడిసిన్ చదివే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పెడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన ట్రస్ట్ ద్వారా కేసీఆర్ చేతుల మీదుగా ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ సీటు సాధించిన వారికి ఐదేండ్లకు అయ్యే ఫీజు మొత్తం చెల్లిస్తున్న బండారి లక్ష్మారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నేమూరి మహేష్ గౌడ్, శివ గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

నాచారం ఓల్డ్ విలేజ్, కుమ్మరి బస్తీలలో జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను డీజీఎం సతీష్ కుమార్, మేనేజర్ వేణుగోపాల్‌తో కలిసి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, రమణారెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, భరత్, రాంజీ సాయిజెన్ శేఖర్, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలను చట్టసభలో విన్నవించాలని ఈటలకు వినతి



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలు చట్టసభలో విన్నవించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాధ్యులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు శనివారం పూడూరులోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ పరిశ్రమల్లోనూ, ప్రయివేటు సంస్థల్లోనూ, ప్రభుత్వ కార్పొరేషన్లలోను దశాబ్దాలుగా కష్టపడిన రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కనిష్టంగా రూ. 400, గరిష్టంగా రూ. 3వేల పెన్షన్‌తో అనేక కష్టాలు పడుతున్నారని ఈటలకు వివరించారు. ప్రస్తుత ధరకులకు అనుగుణంగా నెలకు కనీస పెన్షన్ రూ. 9వేలు, కరువు భత్యం, ఆరోగ్య భరోసా కల్పించాలని కోరారు. ఈ విషయంపై ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ అధికారులకు వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. ఈపీ ఎస్ పెన్షనర్ల జాతీయ సమన్వయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఆయా ప్రాంత పెన్షనర్ల సంఘాల సభ్యులు ఆయా ప్రాంత పార్లమెంట్ సభ్యుడిని కలిసి వారికి వినతి పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 6,7,8 తేదీల్లో ఢిల్లీలో ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ.. తనకు మరింత స్పష్టమైన గణాంకాలతో కూడిన వివరాలు కావాలని, అప్పుడే చట్టసభలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో "టాప్రా" రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి ఎల్. డీ. ప్రసాద్, మేడ్చల్-మల్కాజిగిరి శాఖ ప్రధాన కార్యదర్శి టి. బాలగంగాధరరావు, మల్కాజిగిరి ప్రాంత శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. అశోక్, జి. ఆర్. విజయ్ కుమార్, కూకట్ పల్లి ప్రాంత శాఖ కార్యదర్శి కే. శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, రఘురాం, సత్తయ్యలు పాల్గొన్నారు.

సీఎంఆర్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాణ- మేడ్చల్

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యా దోపిడికి పాల్పడుతున్న సీఎంఆర్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం సీఎంఆర్ పాఠశాలలోని పుస్తకాలు, యూనిఫామ్స్, టై బెల్టులు అమ్ముతున్న తరగతి గదిని విద్యాశాఖ సిబ్బందితో కలిసి సీజ్ చేయించారు. అంతకుముందు పాఠశాల ఎదుట బైఠాయించి అధిక ఫీజులు వసూలు చేస్తూ యూనిఫామ్స్, పుస్తకాలు అమ్ముతున్న సీఎంఆర్ స్కూల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్మొద్దని డీఈవో సర్క్యులర్ జారీ చేసినా వారి ఆదేశాలు బేఖాతర్ చేస్తూ పాఠశాలలనే బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన సర్క్యులర్ పేపర్ ప్రకటనకే పరిమితమైందని, ఏ ఒక్క ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ నిబంధనలు పాటించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలో చేసే దోపిడీకి విద్యశాఖ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. అలాగే ఓపెన్ పర్మిషన్ తీసుకొని ఇంటర్నేషనల్ స్కూల్‌గా చలామణి అవుతున్న సదాశివ ఇంటర్నేషనల్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల కార్యదర్శి బాలకిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్లు స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యాదర్శి ఎండీ అన్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్ మెంట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కళాశాల యాజమాన్యాలు కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఈ పరిస్థితి మరింతగా ఇబ్బంది కరంగా మారిందన్నారు. కావున ఇట్టి విషయంలో స్థానిక ఎమ్మెల్యేగా జోక్యం చేసుకుని విద్యార్థులకు న్యాయం చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షు డు చిన్న బాబు, జిల్లా ఉపాధ్యక్షులు టి. హరీష్, ఘట్కేసర్ మండల కార్యదర్శి, మహేష్, జిల్లా కర్నాకర్, నరసింహ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్వోకు అఖిలపక్షం ఆధ్వర్యంలో వినతి



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములను, గ్రామకంఠ భూములను, బఫర్ జోన్లను కబ్జాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఘట్కేసర్ తహశీల్దార్‌కు అఖిలపక్ష నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఘనపూర్ గ్రామపంచాయతీలో సర్వే నెంబర్ 1186,1187,1188,1189,1190సర్వే నెంబర్లకు తూర్పు దిక్కున ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు సుమారుగా ఐదెకరాల్లో మట్టిని పూడ్చి ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకొని హద్దురాళ్లు నాటాలని డిమాండ్ చేశారు. చౌదరిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాద్రి టౌన్షిప్‌కు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 867/1 ఆ సెండ్ భూమిలో భూ కబ్జాదారులు లే అవుట్ చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశామని అయినా కొంతమంది కబ్జాదారులు భుమిని ఆక్రమిస్తున్నారని పేర్కొన్నారు. చౌదరిగూడ పరిధిలోని జీడిమెట్ల డాక్టర్ కాలనీలో సర్వే నెంబర్ 774, 775 పార్కు స్థలాన్ని నాలుగువేల చదరపు గజాల కబ్జా చేస్తున్నారని, ఈ భూమిని ప్రభుత్వం ఆధీనం చేసుకోవాలని కోరారు. వెంకటాపురంలోని సర్వే నెంబర్ 830, (అ,)(ఆ) ఒక ఎకరా 26 గుంటల భూమిని, నారాయణరావు కాలువను ఆక్రమించి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సర్వే నెంబరు 835 ఆక్రమించి ప్రజలకు అమ్ముకుంటున్నారని వివరించారు. ఘట్కేసర్ మున్సిపల్ గురుకుల కళాశాల చుట్టూ పహరీ నిర్మాణం చేయాలని కోరారు. కాచవోని సింగారంలోని ముత్తువెల్లిగూడెం గ్రామకంఠ భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని తెలిపారు. సర్వే నెంబరు2/2లో 25 గుంటల భూమి, సర్వేనెంబర్ 3 / 3 నాలుగు ఎకరాల 29 గుంటల సీలింగ్ భూమికి హద్దురాలు ఏర్పాటు చేయాలని కోరారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ పీహెచ్‌సీ కాలనీ ప్రభుత్వ భూమి రెండు ఎకరాలు సర్వే నెంబర్ 14 ఇతరులు ఆక్రమించారని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లారు. నారపల్లి పరిధిలో సర్వే నెంబర్ 27, 28లో పార్కు స్కూలు స్థలాన్ని ఒక ఎకరా 10 గుంటల భూమిని ఆక్రమించి అపార్ట్మెంట్ నిర్మాణం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఘట్కేసర్ మున్సిపల్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, టీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారం లక్ష్మారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సంజీవ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, సీపీఐ జిల్లా నాయకులు జయచంద్ర, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్ సబిత, బీఆర్ఎస్ నాయకులు బర్ల హరిశంకర్, పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి

- కక్ష పూరిత రాజకీయాలు తగవు
- ఎంపీ ఈటల రాజేందర్
- పీర్జాదిగూడ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించిన మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నగర పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ఎంపీకి వివరించారు. పీర్జాదిగూడ నుంచి పర్వతాపూర్ వరకు సుమారు రూ.26కోట్ల హెచ్ఎండీఏ నిధులతో నిర్మిస్తున్న 4 లైన్ రోడ్డు విస్తరణ పనులను గత ప్రభుత్వంలో ప్రారంభమై కొంత వరకు పనులు జరిగినప్పటికీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిధులు విడుదల చేయక పోవడం, పనుల్లో జాప్యం జరుగుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గతంలో భారీ వర్షాల కారణంగా నగరాన్ని వరదలు ముంచెత్తడంతో శాశ్వత పరిష్కారంలో భాగంగా ఎస్ఎన్డీపీ నిధులు సుమారు రూ.110 కోట్లను పీర్జాదిగూడ, బోడుప్పల్ జంట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్ట్రాం వాటర్ డ్రైన్ కొరకు నిధులు మంజూరు చేసినప్పటికీ నిధులు కొరత, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయని సదరు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ ఫేజ్-2లో భాగంగా గతంలో ఉన్న 40 లక్షల లీటర్ల నీటి నిల్వకు అదనంగా 90 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించి వినియోగంలోకి తీసుకురాలేక పోవడంతో ప్రజలు నీటి ఇబ్బందులకు ఎదురుకోవాల్సి వస్తుందని వివరించారు. హెచ్ఎండబ్ల్యూఎస్, సివరేజి బోర్డు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించి పెండింగ్ పనులు ప్రారంభించాలని ఈటల ఆదేశించారు. ఉప్పల్-నారాపల్లి ఎలివెటెడ్ కారిడార్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సంప్రదించి పనుల పురోగతిని వివరించినట్టు పేర్కొన్నారు. ఫ్లైఓవర్ పనులతో పాటు జాతీయ రహదారిపై 6లైన్ల రోడ్ల విస్తరణ పనులను యుద్ధప్రతిపదికన చేపట్టాలని ఈ.ఐ.సి (ఆర్అండ్‌బీ) గణపతి రెడ్డికి సూచించారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై త్వరలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. పర్వాతపూర్ సలార్జాంగ్ కంచెలో ప్రభుత్వ స్థలంలో (సీలింగ్ ల్యాండ్) జాగాకొని మోసపోయిన పేద, మధ్యతరగతి ప్రజలు అభ్యర్థన మేరకు గత ప్రభుత్వం జీవో నెం.118 విడుదల చేసి వారి స్థలాలను రెగ్యులరైజ్ చేసుకోవడానికి వీలు కల్పించిందని, ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ జీవో పై నీలి నీడలు కమ్ముకోవడం, కాంగ్రెస్ నాయకుల కక్షపూరిత రాజకీయాలకు అధికారలపై ఒత్తిడి మేరకు ఎమ్మార్వో ఆధ్వర్యంలో అనేక నిర్మాణాలను కూల్చివేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళనలకు గురయ్యారని, తాజాగా సర్వే నెం. 1,10 లలో మున్సిపల్ నుండి పూర్తి అనుమతులు పొంది, గత ఎమ్మార్వో సీలింగ్ ల్యాండ్ కాదని ఎన్వోసీ జారిచేసిన స్థలంలో కూడా నిర్మాణాలను రాజకీయ కక్షలో భాగంగా కూల్చివేతలకు పాల్పడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

రాజకీయ వేధిపులు మానుకోవాలి

రాజకీయాలు అన్నకా గెలుపు ఓటములు సహజంగానే ఉంటాయని ఓడిన వారిపై రాజకీయ వేధింపులు, వ్యక్తిగత కక్షలతో కాకుండా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయడం ద్వారానే ప్రజల మన్నలను పొందుతారని హితవు పలికారు. అనంతరం పీర్జాదిగూడ నగర పాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశానికి రావాల్సిందిగా మేయర్ ఈటలను ఆహ్వానించారు. కార్యక్రమంలో నాగారం చైర్మెన్ చంద్రారెడ్డి, కార్పొరేటర్లు బచ్చరాజు, మద్ది యుగేందర్ రెడ్డి, కౌడే పోచయ్య, మధుసూధన్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, నాయకులు బండారి రవీందర్, లేతాకుల రఘుపతి రెడ్డి, అలవాల దేవేందర్ గౌడ్, జావీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గౌరినాథపురంలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని గౌరినాథపురం కాలనీలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి శనివారం పర్యటించారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ అవుట్ లెట్ లేక నిలిచిన మురుగు నీరును పరిశీలించారు. మురుగు నీరు బోర్లలో ఇంకి, దోమలు, కీటకాలు ప్రబలి కాలనీవాసులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ జనరల్ మేనేజర్ సంతోష్‌ను, డీజీఎం సతీష్‌ను, ఏఈ రోహిత్‌ను, ఇతర సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గౌరినాథ పురం కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాసులనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, కందిగూడ బాబన్న, సంతోష్ చారి, సత్యనారాయణ, అలీ, సిద్దిఖ్, సురేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-కీసర

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో ఎస్సీ కార్పొరేషన్, ప్రో ఫ్యాషన్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70మంది మహిళాలకు మూడు నెలలు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లను అందజేశారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, ఎన్‌జీవో అధికారి సుచిత్ర, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, అభయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లవి స్కూల్లో విద్యార్థులకు వంటల పోటీలు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో "ఫైర్ లెస్ కుకింగ్" అనే పోటీలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా చెఫ్ దీపక్ ప్రదాన్, చెఫ్ విశ్వతేజ, పాఠశాల డైరెక్టర్ సుశీల్ కుమార్, ప్రిన్సిపాల్ తనుజా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలు తన తండ్రితో కలిసి మంటను ఉపయోగించకుండా వంటకాన్ని పూర్తి చేశారు. న్యాయ నిర్ణేతలు నిర్ణయించిన పద్ధతి ప్రకారం రుచికరమైన, ఆకర్షణీయమైన, ఆరోగ్యవంతమైన వంటకాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేసిన వారిలో విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తనూజ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తల్లిదండ్రులు, పిల్లల మధ్య సంబంధ బాంధవ్యాలు బలపడతాయని, వంటల్లో నైపుణ్యాన్ని పురుషులు కూడా సాధించగలరని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినందుకు తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించిన బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

ఇటీవల కురిసిన వర్షాలకు డివిజన్‌లో పలు రోడ్లు గుంతలుగా ఏర్పడడంతో బీటీ కాంక్రిట్‌తో రోడ్డుకు మరమ్మతు, ప్యాచ్ వర్క్ పనులను కార్పొరేటర్ బన్నాల గీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాన్సూన్ సిబ్బంది ఎక్కడ వర్షం పడినా వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఏఈ రాజ్‌కుమార్‌ను, వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, సోషల్ మీడియా అధ్యక్షులు బింగి శ్రీనివాస్, శ్యామ్, బాలు తదితరులున్నారు.

చర్లపల్లిలో జైల్ అదాలత్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి కేంద్రకారగారంలో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి కోర్టు ఆరో ఏఎంఎం మెజిస్ట్రేట్ బి.ఉషా క్రాంతి, నాలుగో ఏఎంఎం ఎల్బీనగర్ మెజిస్ట్రేట్ గోపిక నాగ శ్రావ్య 38 ఖైదీలకు లకు సంబంధించిన 33 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, ఇతర సిబ్బంది కాకుండా జైలు పర్యవేక్షణ అధికారి సంతోష్ కుమార్ రాయ్, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు శశికాంత్, కాళిదాస్, రత్నం , జైలర్లు పరశురాం, సత్తయ్య, సాయి సురేష్ బాబు, గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ధ్యేయం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో మారిన పరిస్థితుల దృష్ట్యా బోడుప్పల్ కార్పొరేషన్‌లో కుంటుపడిన అభివృద్ధిని పరుగులు పెట్టించాలంటే ప్రస్తుతం ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్ దిగిపోవాలనే ఉద్దేశంతో ఇక్కడ అవిశ్వాస తీర్మానం పెట్టినట్టు టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలు తెలిపారు. శనివారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి ,డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి గౌడ్‌పై కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు బోడుప్పల్‌ను అభివృద్ధి దిశగా తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, పోగుల నర్సింహారెడ్డి, రాపోలు రాములు, పీఎంసీ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అటంకాలను ఎదుర్కొని..

ఎప్పటి నుంచో విశ్వ ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తమ ఖాతాలోకి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంది. బోడుప్పల్‌లో మొత్తం 28 కార్పొరేటర్లకుగాను కాంగ్రెస్ వైపు 22 మంది కార్పొరేటర్లు మద్దతుగా ఉండగా బీఆర్ఎస్‌కు ఆరుగురు కార్పొరేటర్లు ఉన్నారు. జూన్ 6న అవిశ్వాస తీర్మాన సమావేశం ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. దాంతో కాంగ్రెస్ నేతలు కోర్టును ఆశ్రయించి బీఆర్ఎస్ నాయకులు తెచ్చిన స్టేను క్లియర్ చేయించడంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ తేదీని నిర్ణయించారు. అదే విధంగా మరో కారణం చూపి బీఆర్ఎస్ నేతలు కోర్టును ఆశ్రయించగా కోర్టు బీఆర్ఎస్ నేతల పిటిషన్‌ను స్వీకరించలేదు. ఇలా అనేక ఆటంకాల మధ్య అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతుండడంతో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పేరుతో పార్టీ మారిన కార్పొరేటర్లకు విప్ జారీ చేసి భయభ్రాంతులకు గురి చేయగా వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా అవిశ్వాస తీర్మానికి వారు మెగ్గు చూపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
ఆదివారం | జూన్ 30, 2024 | www.navatelangana.com

ఆర్థిక సహాయం అందజేసిన రంగా నగర్ వాసులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శుక్రవారం చింతల్ మెయిన్ రోడ్డులో రాయల్ ఎన్ఫిల్డ్ షోరూం ముందు చెత్త సేకరిస్తున్న జీహెచ్ఎంసీకర్మికుడు శాంతారావుని అతివేగంగా వచ్చిన ఉబర్ క్యాబ్ ఢీ కొట్టడంతో అతడి కాలుకి తీవ్ర గాయాలు అయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.. అతడు 128 డివిజన్‌లోని రంగా నగర్ కాలనీలో కూడా విధులు నిర్వహిస్తున్నాడు. మానవతా దృక్పథంతో రంగానగర్ కాలనీ వాసుల తరపున రూ.30,000 ను శనివారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. తమకు ఆర్థిక సాయం అందజేసిన రంగానగర్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్ మృతి బాధాకరం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి, ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. నగరంలోని బంజారాహిల్స్‌లో గల డీఎస్ నివాసానికి బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రులు జి.జగదీశ్వర్ రెడ్డి, వి.ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, బి.గణేష్ గుప్తా, జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్‌లు డీఎస్ భౌతికఖాయంపై పుష్పగుచ్చాన్ని పెట్టి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయన మాట్లాడుతూ డీఎస్ నాలుగు దశాబ్దాల పాటు రాజకీయంగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతి తెలిపారు.

సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణను వ్యతిరేకించిన ఐఎన్‌టీయూసీ..

- బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించేందుకు కార్మికులందరూ కలిసిరావాలని పిలుపునిచ్చిన ఐఎన్‌టీయూసీ నాయకులు
- ప్రత్యామ్నాయ పరిష్కారాలకు ట్రేడ్ యూనియన్లతో చర్చలు జరపాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సింగరేణి బొగ్గు గనుల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.జనక్ ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శులు వి.భాస్కర్ రెడ్డి, ఆర్.డి.చంద్ర శేఖర్, వై.నాగన్న గౌడ్, కే.జగన్ మోహన్ రెడ్డి, ఎంబి.విజయ్ యాదవ్, తెలంగాణ ఐఎన్‌టీయూసీ యూనియన్ ఉపాధ్యక్షుడి ఆధ్వర్యంలో సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఐఎన్‌టీయూసీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులను ప్రయివేటీకరించాలని బీజేపీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ చర్య వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాల జీవనోపాధికి ముప్పు కలిగిస్తుందని ఆరోపించారు. కార్మిక హక్కులలో దశాబ్దాల పురోగతిని బలహీనపరుస్తుందన్నారు. మన దేశం, దాని సంపద యొక్క వ్యూహాత్మక ప్రయోజనాలను ప్రమాదంలో పడేస్తుందని పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రయివేటీకరణ భారీ నిరుద్యోగం, పర్యావరణ విధ్వంసానికి దారితీస్తుందని స్థానిక, గిరిజన ప్రజలకు స్థానభ్రంశం చెందుతుందని.. అలాగే ఇది భద్రతా ప్రమాణాలు, పర్యావరణ నిబంధనలు, బొగ్గు మైనింగ్ కార్యకలాపాల యొక్క దీర్ఘకాలిక స్థిరత్వంపై రాజీ పడుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు చారిత్రాత్మకంగా కఠినమైన భద్రత, పర్యావరణ ప్రోటోకాల్‌లకు కట్టుబడి ఉన్నాయి. కార్యకలాపాలు బాధ్యతాయుతంగా నైతికంగా నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ప్రత్యామ్నాయ పరిష్కారాలను అన్వేషించడానికి ట్రేడ్ యూనియన్‌లతో సహా వాటాదారులతో అర్థవంతమైన చర్చలు జరపాలని బీజేపీ ప్రభుత్వాన్ని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. కార్మికుల సంక్షేమం, జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా, సంఘీభావంగా నిలవడానికి మా సింగరేణి కోల్ మైన్స్ లిమిటెడ్ భారీ లాభాలను సాధించే, ఉపాధిని కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలకు రక్షణ కల్పించడానికి ఐఎన్‌టీయూసీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి దారుణ హత్య

- మృతుడి భార్య పై అనుమానాలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అక్రమ సంబంధం కారణంగా ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సంచలనం సృష్టించింది. సిఐ.కే.క్రాంతి కుమార్, స్థానికులు స్నేహితుడు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్‌లో అనిల్ అతని భార్య భాగ్యలక్ష్మితో కలిసి నివాసముంటున్నారు. అనిల్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతని వద్ద శిరిడీ హిల్స్ ప్రాంతానికి చెందిన కందుల సురేష్ ఐదారు సంవత్సరాలుగా డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. ఈయనతోపాటు నాని, నవీన్ చందులు కూడా అంబులెన్స్ డ్రైవర్లుగా అనిల్ వద్ద పనిచేసేవారు. అనిల్ దగ్గర మానేసి తాను కూడా ఒక అంబులెన్స్ వాహనాన్ని కొన్నట్లు పోలీసులకు సురేష్ తెలిపాడు. గతంలో అనిల్ కుటుంబం కూకట్‌పల్లి సమీపంలోని జయనగర్ ఉండేవారని భార్య భాగ్యలక్ష్మి బ్యూటీ పార్లర్ నడిపి ఆపేసింది. ఇదిలా ఉండగా గత మూడు నెలల క్రితం అనిల్ కుటుంబం జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్‌కు అద్దె ఇంట్లో మకాం మార్చి, సమీపంలోనే ఒక టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. టిఫిన్ సెంటర్లో కృష్ణవేణి పనిచేస్తుండేది. ముగ్గురు కలిసి టిఫిన్ సెంటర్ నడిపే వారు. కృష్ణవేణితో అనిల్ చనువుగా ఉంటూ రహస్యంగా అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్నట్లు విచారణలో తేలింది. కృష్ణవేణితో పాటు ఆమె పిల్లలను అనిల్ తన సొంత నివాసమైన జగద్గిరిగుట్ట సమీపంలోని శ్రీనివాస్ నగర్‌లో గత కొంతకాలంగా పెట్టి అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉండే వాడని తెలిపారు. ఈమధ్య అనిల్ తన భార్య భాగ్యలక్ష్మి ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. టిఫిన్ సెంటర్లో పనిచేసే మల్లేష్‌తో తరచూ భాగ్యలక్ష్మి చనువుగా ఉండేదని తెలిసి తరచూ అనిల్ భార్య భాగ్యలక్ష్మి వారిద్దరి మధ్య గొడవలు కూడా జరుగుతుండేవని తెలిసింది. శనివారం ఉదయం సురేష్, అనిల్ ఇంటికి వచ్చి చూసినప్పటికి అనిల్ ఛాతిపై మెడపై కత్తి పొడవడంతో బలమైన ఘాట్లతో రక్తపుమడుగులో ఉండడంతో ఆందోళన చెందాడు. వెంటనే పలువురి సహాయంతో సమీపంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ సమాచారాన్ని జగద్గిరి గుట్ట పోలీసులతోపాటు తోటి (డ్రైవర్ల) అందించాడు. వెంటనే సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయాడని నిర్ధారిం చారు. పోలీసులు, సురేష్ భాగ్యల క్ష్మిని నిలదీయగా పొంత నలేని సమాధానం చెబుతుండ డంతో పాటు టిఫిన్ సెంటర్లో పని చేసే మల్లేష్‌ను గట్టిగా అడిగిన సమాధానం లేకపోవడంతో అనుమానంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నీట్ పేపర్ లీకేజ్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ



- విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నీట్ పేపర్ లీకేజ్ పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో, శనివారం ఉదయం కూకట్‌పల్లిలో నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా ప్రశ్నాపత్రం లీకేజ్ పై ,కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయవలసిందిగా డిమాండ్ చేశారు. అదేవిధంగా దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ యొక్క కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు గొట్టుముక్కల వెంకట్, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ, కూకట్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ రమేష్, మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి రాహుల్ సింగ్, కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరి ,మూసాపేట్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సచిన్ పాల్గొన్నారు.

వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా క్యాచ్ పిట్స్ ఏర్పాటు చేయాలి..



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడలో స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందిస్తూ.. శనివారం స్టాండింగ్ కమిటీ సభ్యులు బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి పర్యటించారు. తరచూ వర్షపు నీరు రోడ్ల మీద నిలుస్తున్న నేపథ్యంలో క్యాచ్ పిట్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఫిరోజ్ గూడలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని తక్షణమే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తిరెడ్డి కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, సభాపతి రెడ్డి, సుధాకర్, ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను వేగవంతం చేయాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



పెండింగ్‌లో ఉన్నటువంటి రోడ్, డ్రయినేజీ పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రమేష్, అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలనీ, బస్తీ వాసులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేపీహెచ్‌బీ కాలనీలోని ఫేస్ 1 ఫేస్ 2 పార్కుల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ప్రగతి నగర్ రిటర్నింగ్ నాలా పనులు కూడా పూర్తి చేయాలన్నారు. బాలాజీనగర్, వివేక్ నగర్, ఆంజనేయనగర్, కైత్లాపూర్, కేపీహెచ్‌బీ కాలనీలలో స్థానికంగా నివసిస్తున్న ప్రజలు భూగర్భ డ్రయినేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో దోమలు ప్రబలి ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వర్షాకాల దృశ్య నాలా పనులను, డ్రయినేజీ, రోడ్లు, వీధి దీపాలు, శానిటేషన్, ఫాగింగ్ పనులు పై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. స్థానికులు, పలు అసోసియేషన్ వారు ఇచ్చిన పిర్యాదులపై తక్షణమే స్పందించి, పనులు వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, జీహెచ్ఎంసీ అన్ని విభాగాల అధికారులు, జలమండలి అధికారులు, అసోసియేషన్స్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి కనకరత్నం జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ సంఘ సేవకులు, ఇంజనీర్ ఇన్ చీఫ్(పంచాయతీరాజ్ శాఖ) అధికారి వీరవల్లి కనకరత్నం 60 వ జన్మదిన వేడుకలు శనివారం కేపీహెచ్‌బీ 9 పేస్‌లోని ఆయన నివాసంలో వై.ఎఫ్.సి.ఏ.బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వీరవల్లి కనకరత్నం ను వై.ఎఫ్.సి.ఏ. బృందం, సభ్యులు శాలువాలతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వై.ఎఫ్.సి.ఎ సభ్యులు మాట్లాడుతూ వీరవల్లి కనకరత్నం ఇంజనీర్ ఇన్ చీఫ్ (పంచాయతీ రాజ్)లో చాలా కాలంగా ప్రభుత్వ శాఖలో భాద్యతలు సమర్థవంతంగా నిర్వహించా రన్నారు. పుట్టినరోజు సందర్భంగా తన నివాసంలో హెూమం, పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జంట నగరాల శెట్టిబలిజ సంఘ వై.ఎఫ్.సి.ఏ. అధ్యక్షులు దంపంబోయిన శ్రీనివాసు, కార్యనిర్వాహక కార్యదర్శి పితాని శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి యంత్ర లోకేష్, పూర్వపు అధ్యక్షులు దొమ్మేటి సత్యనారాయణ, టీ.ఎస్.డబ్ల్యూ. ఏ.అధ్యక్షులు పంపన శ్రీనివాస్, పూర్వపు అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్, కార్యదర్శి చెల్లుబోయిన రమేష్, కోశాధికారి చింతపల్లి శ్రీనివాసరావు,మోతినగర్ శెట్టిబలిజ సంఘ అధ్యక్షులు కుడుపూడి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు దొంగ శ్రీనివాస్,మల్లుల శ్రీనివాస రావు,కుడుపూడి భాస్కర్,రాయుడు గణపతి, వివిఈ ట్రాన్స్‌ఫర్మర్స్ అధినేత ఇళ్ల వినోద్,కొప్పిశెట్టి త్రినాధ్,బొక్కా యుగంధర్ తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్/కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం డివిజన్ పరిధిలోని బస్తీల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన సమస్యలపై విస్తృతంగా పర్యటించారు. ఈ మేరకు ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లోని మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రధానంగా ఇక్కడ జాతీయ రహదారి నుండి కాలనీలోకి వెళ్లే రహదారి వరకు మొత్తం తోపుడు బండ్లు, డబ్బాలతో నిండిపోయిందని దీంతో తమకు రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని కాలనీ వాసులు బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు కాలనీలో నెలకొన్న అనేక ఇతర సమస్యలను కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్న పలు ప్రాంతాల్లో బండి రమేష్ పర్యటించారు. దీనిపై స్పందించిన రమేష్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, చున్ను పాషా, కేబుల్ శ్రీను, నయీమ్, రమణ మూర్తి, చక్రధర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ మునీందర్ రాజు పదవీ విరమణ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

టి.జి.ఎస్.ఆర్.టి.సి.లో వివిధ డిపోలతో పాటు, జీడిమెట్ల డిపోలో కార్మిక నాయకునిగా, డ్రైవర్‌గా 26 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన గాజులరామారం డివిజన్ ఉమాదేవి నగర్‌కు చెందిన చెన్నమాధవుని మునీందర్ రాజు పదవి విరమణ పొందిన సందర్భంగా శనివారం సాయంత్రం జీడిమెట్ల డిపోలో మేనేజర్ కార్యాలయ ఆవరణలో వీడ్కోలు సభ నిర్వహించారు. ముందుగా డిపో మేనేజర్ విజయ్ కుమార్‌తోపాటు అధికారులు డిపో డ్రైవర్లు, కండక్టర్లు ఘనంగా వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎం.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో సౌమ్యుడిగా, చిరునవ్వుతో నిబద్ధతతో డ్రైవర్‌గా విధులు నిర్వహించి మునీందర్ రాజు దంపతులను శాలువాతో సన్మానిస్తూ మేమెంటోతో అభినందించారు. ఈ కార్యక్రమంలో మునీందర్ రాజు సతీమణి స్వరూప, కుటుంబ సభ్యులతోపాటు ఉమాదేవినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.సమ్మయ యాదవ్, ప్రధాన కార్యదర్శి కూరపాటి కరుణాకర్ రాజు, సీఐ.నీలమణి, ఎమ్మెస్ సందీప్ కుమార్, కార్మిక నాయకులు ఆర్.గోవర్ధన్, పి.జ్ఞానేశ్వర్ చంద్రయ్య, వెంకటేష్, యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించి గ్రేటర్‌లోనే ఆదర్శ డివిజన్‌గా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.శనివారం డివిజన్ పరిధి సోమయ్య నగర్ లో సుమారు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను స్థానిక బస్తీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల సహకారాలతో అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీ,సిసి రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేస్తున్నామన్నారు. అనంతరం సోమయ్యనగర్ మాగ్దుమ్ నగర్ లింక్ రోడ్డు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మెన్ వేణుయాదవ్ సోమయ్యనగర్ కమిటీ అధ్యక్షులు యాదగిరి, బస్తీ నాయకులు నరసింహారెడ్డి, విట్టల్ ముదిరాజ్, సతీష్, మనోజ్, మహేష్, మాగ్దుమ్ నగర్ కమిటీ సభ్యులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనునిత్యం ప్రజా సేవలోనే..ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అనునిత్యం ప్రజా సేవలోనే ఉంటానని.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానందని కలిసి పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం చేపడుదామన్నారు.

నిరుపేదలకు వరం...ముఖ్యమంత్రి సహాయ నిధి..

ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఆపదలో ఉన్న నిరుపేదలకు ఒక వరమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద130- సుభాష్ నగర్ డివిజన్ సూరారంకి చెందిన ఇందుకూరి పూర్ణచందర్ రాజు కుమార్తె అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్‌లో అడ్మిట్ అవ్వగా.. ఆపరేషన్ చెయ్యాలని డాక్టర్స్ సూచించారు. ఆపరేషన్ చేయడానికి డబ్బులు లేవకపోవడంతో ఆస్పత్రిలో తమ కుమార్తె ఆపరేషన్‌పై కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు కేపీ.వివేకానంద్‌ని కలిసి సమస్య వివరించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,50,000 లు ఎల్ఓసినీ తెప్పించి శనివారం పూర్ణచందర్ రాజుకి ఇప్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మీపతి రాజు, సత్తిబాబు, గిరిబాబు, నరసింహ, వేంకటపతి రాజు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ బాలమురుగన్ టెంపుల్ మండలాభిషేక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ..

130 – సుభాష్ నగర్ డివిజన్ ఫాక్స్ సాగర్ వద్ద గల శ్రీ బాలమురుగన్ టెంపుల్ మండలాభిషేక కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద శనివారం ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవారాధనతో మానసిక ప్రశాంతత లభించడమే కాక చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బాల లక్ష్మీనారాయణ, బలరాం రెడ్డి, శ్రీనివాసరాజు, అడప శేషు, పద్మజా రెడ్డి, దుర్గారావు, రవికాంత్, మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది..

- శ్రీ హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మెన్ కన్నేకంటి లక్ష్మణ్,
- విజయవంతంగా అన్నప్రసాద కార్యక్రమం





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అన్ని దానాల కన్నా ఆకలితో ఉన్న మనిషి కడుపు నింపే అన్నదానం గొప్పదని శ్రీ హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మెన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కళ్యాణ్ రావు పాటిల్ తెలిపారు. పది మందికి ఎల్లప్పుడూ అన్నం పెట్టడమే ప్రధాన లక్ష్యంగా అన్నప్రసాద కార్యక్రమం చింతల్ శ్రీసాయి కాలనీలోని అభయ అంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రారంభించామని, ప్రారంభించిన అన్నప్రసాద కార్యక్రమం ప్రతీ శనివారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారంతో 60 వారాలు పూర్తి అయ్యాయని, ప్రతీ శనివారం మధ్యాహ్నం 1 గంటకు అన్న దాన కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రతివారం సుమారు 350 మంది భక్తులు హాజరౌతారని తెలిపారు. సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు అభయ ఆంజనేయ స్వామి గుడిలో భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు టీ/టిఫిన్ ఏర్పాట్లు చేస్తున్నామని, తమ సొంత ఖర్చుతో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి నేడు అనేక భక్తులు విరాళాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇంత విజయవంతం కావడానికి ముఖ్య కారణం స్థల దాత, శ్రీసాయి కాలనీ ఫౌండర్ కన్నెకంటి పండరి అని తెలిపారు. తమకు అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం ఎల్లప్పుడూ కొనసాగించాలనే ఉద్దేశ్యంతో ముందుకు వెలుతున్నమని కన్నెకంటి లక్ష్మణ్ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

నవతెలంగాణ-జూబ్లీ హిల్స్

బస్తీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తీలో నైట్ దోమలు విపరీతంగా పెరుగుతున్నయని అన్నారు. సానిటైజేషన్ సరిగ్గా చేయకపోవడం వల్ల మలేరియా టైఫ్యాడ్ వచ్చే ప్రమాదం ఉంది అని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా అధికారులు సానిటైజేషన్ దోమల ఫొగింగ్ చేయాలని డిమాండ్ చేశారు. బోరబండ డివిజన్ సైట్ 3 లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, హైద్రాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హష్మిబాబు, జావెద్ నాయకులు క్రిష్ణ, శ్రీను పాల్గొన్నారు.

జలమండలి ఎండీకి కార్పొరేటర్ వినతిపత్రం



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ జలమండలి ఎండీ శ్రీనివాస్ రెడ్డిని శనివారం వారి కార్యాలయంలో కలిసి డివిజన్‌లోని పలు సమస్యలపై వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ డివిజన్‌లో పెండింగ్ పనులు ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఎండీని కోరారు. అందుకు ఎండీ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అన్ని పెండింగ్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

డీఎస్ మృతి తీరని లోటు

- మాజీ మేయర్ కార్తీక రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర రాజకీయాల్లో డి శ్రీనివాస్ చెరగని ముద్ర వేసుకున్నారని, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి అన్నారు. శనివారం మాజీ పిసిసి అధ్యక్షుడు డి. శ్రీనివాస్ మృతదేహానికి బంజారా హిల్స్ లోని ఆయన నివాసంలో నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి ప్రకటించారు. మాజీ మేయర్ వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న, కొనే సంపత్, కిరణ్ గౌడ్, చింటూ ఉన్నారు.



ఆర్థిక స్థితిగతులను మార్చుకోవడానికి కల్యాణ లక్ష్మి చెక్కులు సహకరిస్తాయి

- ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎన్నికల కోడ్ జాప్యం వల్ల ఆగిపోయి నిరాశలో ఉన్నవారికి ఉత్సాహాన్ని అందించడానికి లేదా వారి ఆర్థిక స్థితిగతులను మార్చుకోవడానికి కల్యాణ లక్ష్మి చెక్కులు సహకరిస్తాయని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంచిని ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని ప్రజల పాలనకు కట్టుబడి గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజా మేలుకోరే కార్యకలాపాలను సైతం ప్రోత్సహిస్తూ ప్రజలకు అందజేస్తున్నట్టు.. అందులో భాగంగానే శనివారం షేక్‌పేట్ తాసిల్దార్ అనిత రెడ్డితో కలిసి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.

అనంతరం బంజరాస్ డివిజన్‌లోని ఎన్బిటీ నగర్‌లో ఎన్నో ఏండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న మురుగునీటి సమస్యకు సమయం ఆసన్నమైందని.. ఆ దిశగా ఆగిపోయిన రోడ్డు పనులు పున్న ప్రారంభం కావడంతో ఆ పనులను మేయర్ పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మేయర్ జీహెచ్ఎంసీ అన్ని శాఖల అధికారులతో సమావేశమై రాబోయే వర్షాకాలంలో ఎదుర్కొనే సవాళ్లను ముందస్తుగా ప్లాన్ చేసుకొని సజావుగా పనులు కొనసాగేలా చూడాలన్నారు.



ఘనంగా సంతోష్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, రైల్వే కార్మిక నాయకుడు అదం సంతోష్ కుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే , గణేష్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదం సంతోష్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కంకణ బద్దులై కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలువురు నేతలు కార్యకర్తలు మాట్లాడుతూ గొప్ప కార్మిక ప్రజానేత అని, భోళా శంకరుడు అన్నారు. సంతోష్ జీవితం అంత గొప్ప కాంగ్రెస్ వాదిగా ఉంటు నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడుతున్న వ్యక్తి అన్నారు. పలువురు ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



చిత్రపురి కాలనీ అభివృద్ధికి కృషి చేశా

- అనిల్ కుమార్

నవతెలంగాణ - బంజారాహిల్స్

ఆర్థిక లోటు ఉన్న చిత్రపురి కాలనీ సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని చిత్రపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ వల్లభనేని అన్నారు. శనివారం చిత్రపురి కాలనీ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ యాదవ్ ఇతర సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. కావాలనే తనపై అవినీతి ఆరోపణలు చేశారని, నిజం నిరూపించడానికి బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. చిత్రపురి కాలనీ అభివృద్ధి చెందడానికి కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు తాను రాజీనామకైనా సిద్ధమని ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా చిత్రపురి కాలనీ నిర్మాణాలను ఆపలేదని తెలిపారు. చిత్రపురి కాలనీ సభ్యులకు తప్ప బయట వ్యక్తులకు ఎక్కడ ఇండ్ల కేటాయింపు జరగలేదన్నారు. తనపై వచ్చినవన్నీ అసత్య ఆరోపణలేనని, కోర్టులో తాను నిర్దోషిగా వైట్ పేపర్ల బయటపెడతానన్నారు. కొందరు కావాలని తనపై నిందలు మోపుతున్నారని తెలిపారు. అవసరమైతే వారితో చర్చలకు సిద్ధం అన్నారు. చిత్రపురి కాలనీ మొత్తం బడ్జెట్ వర్త్ రూ. 750 కోట్లు, అవినీతి 300 కోట్లు జరిగిందని ఆరోపిస్తున్నారన్నారు. ఎలా సాధ్యమో వారే చర్చకు



ప్రతీ ఉద్యోగికి రిటైర్మెంట్ సహజం

- అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీల లో పనిచేసిన 38 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం వారికి రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (అడ్మిన్) నళిని పద్మావతి మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ సహజమని, రిటైర్మెంట్ తర్వాత కూడా మరో కొత్త జీవితం ఉంటుందని దానిని సరికొత్తగా మలుచుకోవడం మన చేతిలోనే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరినీ జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పద్మజ రాణి, జాయింట్ కమిషనర్ (అడ్మిన్) జయంత్ రావు, సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ, పర్సనల్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి లు ఘనంగా సన్మానించారు. వారి భవిష్యత్ జీవితం బాగుండాలని, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొం దిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సహ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రి

భవన నిర్మాణ పనులను వేగవంతం చేయండి

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పట్టణంలో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇంజినీర్లు, డీసీహెచ్ఎస్, డీఎంఅండ్ హెచ్ఓలతో నిర్వహించిన వంద పడకల ఆస్పత్రి భవన, ఆస్పత్రిలో ఓపిడి, కొత్త బ్లాక్ నిర్మాణ పనులు,సీతాఫల్మండిలో 30 పడగల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కామాటి పుర లో 100 పడకల ఆస్పత్రి, చార్మినార్ ప్రభుత్వ నిజామీయ టిబ్బి కాలేజ్, నిజామియా జనరల్ హాస్పిటల్ లో పునర్నిర్మాణ పునరుద్ధరణ పనుల పురోగతిపై సమీక్షించారు. అలాగే కొత్త బ్లాక్‌ల నిర్మాణం, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో సానిటేషన్, టాయిలెట్స్ బ్లాక్స్, యాకూత్ పుర ఎస్ ఆర్‌టీ కాలనీలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడ ఏరియా ఆస్పత్రిలో 50 పడగల ఆస్పత్రి, దబీర్ పుర ఏరియా ఆస్పత్రిలో 100 పడకల, బర్కాస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ పనులు, లాలాపేట్ 30 పడకల అర్బన్ హెల్త్ కేర్ సెంటర్, అడ్డగుట్ట 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు,నల్లకుంట ఓ పి డి బ్లాక్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్,ఎర్రమాంజిల్ ఎమ్‌సీహెచ్ లో 200 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్టీ కోఠి హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్,తదితర పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ మొదలుకాని వాటిని వెంటనే టెండర్లను పిలవాలని, నిర్మాణం మొదలైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్ రెడ్డి, ఈఈ చలపతిరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ సునీత, టీజీ ఎమ్ఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. నాయుడు, డిఈ పి జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.



మార్కెట్లోకి కొత్త పల్సర్ ఎన్ఎస్ 400 జెడ్

నవతెలంగాణ-బేగంపేట్

బజాజ్ ఆటో భారతదేశ నెం.1 మోటారైకిల్ కంపెనీ, అంతర్జాతీయంగా అత్యుత్తమ తరగతి డిజైన్, సాంకేతికతను కలిగి ఉన్న ఉత్పత్తులను తయారు చేస్తోంది. గత 75 సంవత్సరాలుగా రాజీపడని నాణ్యతతో 90 దేశాలకు పైగా ఎగుమతులు చేస్తోంది ఈ సందర్భంగా బజాజ్ ఆటో తెలంగాణ రీజినల్ మేనేజర్ కళ్యాణ్ రెడ్డి బైక్ ఔత్సాహికులకు ఉత్తేజ పరిచేవిధముగా పల్సర్ ఎన్ఎస్ 400 జెడ్ లాంఛనంగా మార్కెట్ లోకి విడుదల చేశారు. బైక్ ఎక్స్ షోరూం హైదరాబాద్ ధర రూ. 1,85,000గా నిర్ణయించారు . బైక్ మార్కెట్లోకి విడుదల చేసిన మొదటి రోజే 100కుపైగా కస్టమర్స్ కు విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్సర్ ఎన్ఎస్400 జెడ యువతను ఆకట్టుకునే విధంగా ఉంటుందన్నారు. ఈ స్పోర్ట్స్ సెగ్మెంట్ విభాగంలో అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో ముందు వరుసలో ఉండేలా రూపొందించామని తెలియజేశారు. పల్సర్ ఎన్ఎస్400 జెడ్‌తో, బైకింగ్ ఔత్సాహికులు 'థ్రిల్' అనుభూతిని, రక్షణను ఇవ్వగలగడంలో అగ్రగామిగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆధునీకరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి సరస్సు ఆధునికరణలో భాగంగా శనివారం సరస్సులో నీరు చేరకుండా ఉండేందుకు గాను అవుట్ లెట్ నిర్మాణ పనులకు మొదలుపెట్టారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ పనులను ప్రారంభించారు . మురుగు నీరు సరస్సులోకి ప్రవేశించకుండా, ఇంకా చిన్నకమెల వద్ద మురుగు నీటి నిల్వను పరిష్కరించడానికి. చిన్నకమెల పక్కనే పంప్ హౌస్ కూడా నిర్మించారు. తద్వారా అందించిన అవుట్‌లెట్‌కు మురుగు నీటిని ఎత్తివేసేందుకు పంప్ చేయడానికి ఏర్పాటు చేసిన విభాగాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు కార్యక్రమంలో అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ అధికారులు పాల్గొన్నారు

అందరినీ సమానంగా చూడాలి

- జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యురాలు పులి కల్పన



నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ ఎస్టీ ల పట్ల కులం పేరుతో వివక్షతను పాటించకుండా మనుషులందరూ సమానమని భారత రాజ్యాంగం చాటిందని హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యురాలు పులి కల్పన అన్నారు. అందరినీ సమానంగా చూడాలని కోరారు. మారేడు పల్లి తహసీల్దారు కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం ఇస్కబావి కమ్యూనిటి హల్ లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పులి కల్పన మాట్లాడుతూ సమాజంలో కుల,మత వైషమ్యాలు పెంచు కోకుండా అందరూ సోదరభావంతో కలిసి మెలసి జీవించాలని కోరారు. భారత రాజ్యాంగం, చట్టాలు,హక్కులు పథకాల పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దళిత అభివృద్ధి శాఖ అధికారి జహిరొద్దీన్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పాలన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను చదువుకునేందుకు అంబేద్కర్ విద్యానిధి పథకం కింద. 20. లక్షల ఆర్థిక సహాయం అందజెస్తున్నదన్నారు. తమ బస్తీ లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వినోభనగర్‌కు తరలించారని తిరిగి తమ బస్తీ లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హల్ కు మంచినీటి కనెక్షన్ ఇవ్వాలని కోరారు. హౌసింగ్ పథకం కింద ఇండ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించాలని కోరారు. పెన్షన్‌లు రాని వారికి పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సర్వేశ్వర్,మల్లేశ్వర్ రెడ్డి,బస్తీ నాయకులు మాణెమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెసర్ అర్జునరావు పదవి విరమణ

- ఆత్మీయతకు మారుపేరు, సమయ పాలనకు మార్గదర్శి ప్రొ.అర్జున్ రావు



నవతెలంగాణ-ఓయూ

ఆత్మీయ అనురాగానికి మారుపేరు, సమయ పాలన లో మార్గదర్శి ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి అని పలువురు ప్రొఫెసర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళశాల ప్రిన్సిపాల్ , సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కూతాడి అర్జున్ రావు పదవి విరమణ కార్యక్రమాన్ని చరిత్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ , ఓయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, యూజీసీ డీన్ ప్రొ. మల్లేశం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ , డైరెక్టర్స్ , డీన్స్ , హెడ్స్ , అధికారులు పాల్గొని పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వేంసూరు గ్రామం నుంచి వచ్చి ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా అనేక పదవులు అధిరోహించి విద్యార్థులకు 27 సంవత్సరాల సుదీర్ఘ సేవలను క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ ఖచ్చితత్వంతో కూడిన సేవను అందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ప్రణాళిక బద్దంగా మరింత ఉత్సాహంతో సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. పలువురు ఆయనతో ఉన్న సంబంధాన్ని తెలియజేశారు. అనంతరం అర్జునరావును ఆత్మీయంగా సత్కరించారు. ప్రొ. అర్జునరావు మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో సహకరించిన వివిధ విభాగాల టీచింగ్,నాన్ టీచింగ్, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి యూనివర్సిటీతో తనకున్న అనుభ వాలను పంచుకున్నారు.ఔట ప్రతినిధులు , చరిత్ర శాఖ హెడ్ ప్రొ.లావణ్య,ప్రొ.ఇందిరా, డా.రమేష్ ఓయూ లోని వివిధ విభాగాల ప్రొఫెసర్లు,విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు,నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సైనికులు రోడ్డు భద్రతను పాటించాలి

- ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

సైనికులు కూడా రోడ్డు భద్రతలను పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్ నాయక్ అన్నారు. శనివారం బొల్లారం బైసన్ డివిజన్ లోని 554 ఏ ఎస్ సి యూనిట్ సిబ్బందిని కలిసి ఆర్మీ అధికారుల సహకారంతో ఆయన సైనికులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సైనికులు దేశ రక్షణ కోసం ఎంతో చాకచక్యంగా పనిచేస్తారు గానీ రోడ్లపై రోడ్ల భద్రతలను పాటించడంలో ఎందుకో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తరచూ సైనికులు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం మనం చూస్తున్నామన్నారు. అందుకనే సైనికుల కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు గాను బొల్లారం డివిజన్‌లో ఈ సదస్సు నిర్వహించినట్టు ఆయన చెప్పారు ప్రతి సైనికుడు రోడ్డు భద్రతను పాటించి వారి ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. 300 కి పైగా సైనికులకు ట్రాఫిక్ పై ఆయన అవగాహన కల్పించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంపై కూడా ఆయన ప్రస్తావించారు. ఇంకా మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అలాగే పిల్లలకు స్కూల్ దశ నుంచే రోడ్డు నిబంధనలను చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బందితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

షేక్ పెట మండల కార్యాలయంలో షేక్ పెట్ డివిజన్, యూసఫ్ గూడ డివిజన్‌కు సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 59 మంది లబ్దిదారులకు మొత్తం 5,90,6844/- (ఒక్కొక్కరికి 1,00116/-) జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ పెట్ మండల్ రెవిన్యూ ఆఫీసర్ అనిత రెడ్డి, యూసఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమారు పటేల్, బీఆర్ఎస్ షేక్ పెట్ డివిజన్ ప్రెసిడెంట్ ప్రదీప్ కుమార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

ఖైరతాబాద్ మండల రెవిన్యూ కార్యలయంలో బొరబండ డివిజన్, రహ్మత్ నగర్ డివిజన్లకు సంబందించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ మొహమ్మద్ బాబా ఫసియుద్దీన్ సతిమని హబీబా సుల్తాన, కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి శనివారం పంపిణీ చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిషనల్ ఆఫీసర్ అదేశాలతో, లబ్దిదారులకుదాదాపు రూ. 3,36,38,976 విలువగల చెక్కులు పంపిణి చేశారు. ఖైరతాబాద్ మండల రెవిన్యూ ఆఫీసర్ నయీముద్దీన్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రిన్సిపాల్ ప్రో.శ్రీరాములు

నవతెలంగాణ-ఓయూ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా క్రమశిక్షణ కలిగిన జీవితం ఉంటుందని, ఫిట్‌గా ఉంటామని ప్రిన్సిపాల్ ప్రో.డి.శ్రీరాములు అన్నారు. శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా క్లాస్ లో అయిన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇక ప్రతి శనివారం కళాశాలలో యోగా క్లాసులు నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థులకు ఒత్తిడికి దూరంగా ఉండాలని.. దానికి ఈ తరగతులు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, డీన్, ప్రొఫెసర్స్ ,ఉద్యోగులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం, యూసఫ్ గూడా డివిజన్ సవేరా ఫంక్షన్ హాల్‌లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ తెలంగాణ అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జూబ్లీహిల్స్ అసెంబ్లీ సీనియర్ నాయకులు బరిగేల జ్ఞానేశ్వర్, పులి రామ్, బడుగు సతీష్, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

బరువుకు గురువు పీటర్ హిగ్స్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సైన్స్ క్లబ్ తరగతి "బరువుకి గురువు పీటర్ హిగ్స్" అనే అంశం మీద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్రబాబు అధ్యక్షత వహించారు.ముఖ్య ఉపన్యాసకులు జనవిజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఏ రామచంద్రయ్య మాట్లాడుతూ అసలు వస్తువులకు ద్రవ్యరాశి ఎందుకు ఉంటుంది అనే ప్రశ్నకు 1965 వరకు సమాధానాలు ఎవరు చెప్పలేకపోయారని, దీనికి సమాధానం 1964లో బ్రిటిష్ శాస్త్రవేత్త పీటర్ హిగ్స్ తన 35 వయసులో ప్రాథమిక కణాల్లో ద్రవ్యరాశి ఉన్న కణాలకు కారణంగా మరొక ప్రాథమిక కణం ఉండి తీరాలని, మొత్తం 61 ప్రాథమిక కణాలు స్టాండర్డ్ మోడల్‌గా ఉండాలని సైద్ధాంతికంగా పేర్కొన్నారన్నారు. వాదనకు చాలా ఆమోదయోగంగా ఉన్న రుజువులు దొరకలేదని.. కానీ 2012లో సీఈఆర్ఎన్ చేసిన ఎల్‌హెచ్‌సీ ప్రయోగంలో రుజువులు దొరికాయన్నారు. సుమారు 50 సంవత్సరాలు పాటు శాస్త్రవేత్తలు అందరూ ఫిక్స్ ప్రతిపాదించిన 61వ కణాన్ని ఆమోదించిన దాని ఆనవాళ్లు దొరకపోవడంతో ఆ కణాన్ని దైవకణం అంటూ సముదాయించుకున్నారని తెలిపారు. నిజానికి వైజ్ఞానిక శాస్త్ర పరిభాషలో దానిని హిగ్స్ బోసాన్ అనాలని.. ఎల్‌హెచ్‌సీ ప్రయోగ ఫలితంగా రుజువు లభించగానే 2013లో భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి పీటర్ హిగ్స్ ఆయన 84వ సంవత్సరం వయసులో వరించిందని తెలియజేశారు. సాపేక్షిత సిద్ధాంతం, క్వాంటి సిద్ధాంతం, న్యూటన్ సూత్రాలు స్థాయిలో భౌతిక శాస్త్రాన్ని ప్రభావితం చేసిన ఆవిష్కరణ హిగ్స్ బోసాన్ ఆవిష్కరణ అని వివరించారు. సైన్స్ మన జీవన గమనానికి గమ్యం కు దోహద పడుతుంది అంటూ సైన్స్ ఆవశ్యకతను వివరిస్తూ శాస్త్రీయ దక్పథాన్ని అందరూ అలవర్చుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులు చెబుతూ సైన్స్ అనేది ప్రపంచ వ్యాప్తంగా ఒకే రకంగా ఉంటుందని ఒక్కొక్క దశంలో ఒక్కొక్కరికి నచ్చినట్టు ఉండదు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు సి .హెచ్ చంద్రశేఖర్ , ఉపాధ్యాయులు హేమలత, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



11
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | జూన్ 30, 2024 | www.navatelangana.com

రెండు ఎస్టీపీల ట్రయల్ రన్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫతే నగర్, ఖాజాకుంట ఎస్టీపీలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఎస్టీపీ ప్రాజెక్టుల్లో భాగంగా ప్యాకేజీ-3 లో నిర్మిస్తున్న ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీలను శనివారం ఆయన సందర్శించారు. ముందుగా ఫతేనగర్ ఎస్టీపీ వెళ్లిన ఆయన.. అక్కడ వెట్ వెల్, ఎస్బీఆర్, బ్లోయర్ రూమ్ పరిశీలించారు. అనంతరం.. వెట్ వెల్ దగ్గర ఇన్ లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. తర్వాత ఖాజాకుంట ఎస్టీపీకి వెళ్లారు. ఎస్టీపీ ప్రాంగణంలో పర్యటించి సీసీ రోడ్లు, లైటింగ్ పనుల్ని పరిశీలించారు. ముగింపు దశలో ఉన్న పనుల్ని పూర్తి చేసి.. ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం . వెట్ వెల్ దగ్గర ఇన్ లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. ఖాజాకుంట ఎస్టీపీని ఆనుకుని ఉన్న మిగిలిన ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్, పూల మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ రఘు, సీజీఎం, జీఎం, ఎస్టీపీ ఇతర



అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి!

నవతెలంగాణ-సిటీబ్యూరో

వినియోగదారుల ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి.. సాధ్యమైనంత తొందరగా వాటిని పరిష్కరించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఎండీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వినియోగదారులతో మాట్లాడారు. ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్ని ఒకే ప్లాట్ ఫాం పైకి తీసుకురావాలన్నారు. అలా చేస్తే.. వాటి కేటగిరీని బట్టి విశ్లేషించి చాలా వరకు సులభంగా పరిష్కారం చూపవచ్చన్నారు. సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు జరిగిన డయల్ యువర్ ఎండీ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 13 మంది వినియోగదారులు ఫోన్ చేశారు. తాగు



నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, నల్లా కనెక్షన్‌లో ప్రెజర్ తదితర వాటిపై ఫిర్యాదు చేశారు. వాటిని నమోదు చేసుకున్న ఎండీ అశోక్ రెడ్డి.. పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులతో సంబంధిత జనరల్ మేనేజర్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్
- జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఎన్ని పరిష్కరించారని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తహశీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికా బద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్,



పెండింగ్, మ్యుటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేసి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు.

నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ రియలైజేషన్ టూర్'



- కాచిగూడ నుంచి నిజం కాలేజీ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ
- పాల్గొన్న ప్రముఖ యోగ గురువులు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణలో ఉన్న ప్రతి మనిషికి సహజ యోగ ద్వారా వచ్చే ప్రశాంతతను, ఆనందాన్ని అందించటానికి గత మూడు రోజులుగా 'హైదరాబాద్ రియలైజేషన్ టూర్‌'ను పెద్ద ఎత్తున నిర్వహించారు. శనివారం కాచిగూడ నుండి నిజాం కాలేజ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సహజ యోగ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గౌరు కృష్ణ మాట్లాడుతూ సహజ యోగ ద్వారా వచ్చే అన్ని రకాల ప్రయోజనాలను వివరించారు. యోగ అనేది ఒక రకమైన వ్యాయామం కాదని, రాజ యోగాన్ని అన్ని ఆధ్యాత్మిక మార్గాల్లోనూ గొప్పదని యోగాన్ని శాస్త్రీయంగా సాధన చేసే యోగి ఏ ఇతర ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించే వారి కన్నా కూడా శ్రేష్ఠుడని పేర్కొన్న శ్రీకృష్ణుడి వాక్కును పరమ హంస యోగానంద కూడా పునరుద్ఘాటించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిజమైన యోగి తాను భగవంతుడితో అంతరిక అనుశ్రుతి సాధించే వరకు ధ్యానం చేస్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.సుబ్బిరెడ్డి, రామ్మోహన్ రావు, మల్లారెడ్డి, సుప్రజ, సునీల్ అగర్వాల్, ప్రముఖ యోగ గురువులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు మృతి

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్ నగర్ స్ట్రీట్ నెంబర్ 2 లో నివాసం ఉంటున్న రోహిత్ అగర్వాల్ అనే వ్యక్తి ప్లంబర్ గా పని చేస్తున్నాడు. తనకు తెలిసిన వ్యక్తి వద్ద నుంచి ప్లంబింగ్ పని కాంట్రాక్ట్ రావడంతో బోరబండ లేబర్ అడ్డాకు వెళ్లి సుమారు 40 సంవత్సరాలు ఉన్న అడ్డ కార్మికుని లేబర్ పని చేయడానికి పెట్టుకున్నాడు. రోహిత్ అగర్వాల్ కాంట్రాక్ట్ తీసుకున్న బిల్డింగ్‌లో రెండవ అంతస్తు నుంచి వర్షపు నీరు లీకేజీ అవడంతో నీరు లీకేజీ అవుతున్న ఇనుపకడ్డీ స్థానంలో పివిసి ప్లాస్టిక్ పైపు అమర్చాలని కార్మికునికి వివరించాడు. పనిని ప్రారంభించిన కార్మికుడు మొదటి అంతస్తు నుంచి ఇనుప పైపును తొలగించాలని రెండు ముక్కలుగా కోసి తన భుజాన పెట్టుకున్నాడు. ఆ సమయంలో పైప్ విద్యుత్ తీగలకు తగలడంతో గుర్తు తెలియని కార్మికుడు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే అతడిని ప్రథమ చికిత్స నిమిత్తం హైదరా బాద్ బషీర్ బాగ్‌లోని ఐద్వా నర్సింగ్ హోమ్ కు తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెంది ఉన్నాడని తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పని నిమిత్తం తీసుకువచ్చిన కూలీకి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రోహిత్ అగర్వాల్ ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.



విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ

నవతెలంగాణ-ధూల్‌పేట్

గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కమిటీ అధ్యక్షులు జే.మహేష్ అన్నారు. ఫలక్నామా గురుకుల బాలికల పాఠశాలలో పేరెంట్స్ కమిటీ పూనం ప్రారంభం సందర్భంగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ జరిగింది. కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్లో ఉన్న సమస్యలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పిల్లలు త్రాగడానికి ఆర్వో ప్లాంట్, రెస్ట్ తీసుకోవడానికి మంచాలు లేవన్నారు. చదువుకోవడానికి టేబుల్స్, డైనింగ్ టేబుల్స్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. గత ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా పిల్లల సమస్యలు తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవాలని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి నోముల జంగయ్య, కోశాధికారి సి హెచ్. స్వామి కృష్ణ, రేణుక, నీలిమ, రాజశేఖర్,



మధు, రాజలింగం, వర కుమారి, రవి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనసూయ టీచర్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సైదాబాద్ మండలం 1 సరళాదేవి హట్స్ పాఠశాలలో పనిచేస్తున్న అనసూయ టీచర్‌ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదాబాద్ మండలం 1 డిప్యూటీ ఐఓఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ అనసూయ టీచరు చాలా ఉత్తమ టీచర్ అని, పిల్లల స్థాయిలో చక్కగా బోధిస్తారని తెలిపారు. టీచర్ తన సర్వీసులో ఎంతోమంది పిల్లలను మంచి వృద్ధిలోకి తీసుకొచ్చారని అభినందించారు. ఈ



కార్యక్రమంలో పీఆర్‌టీయు టీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బి.మధుసూదన్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మందడి వెంకట్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి సాంబశివరావు అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భగవాన్ దాస్ ,రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కమిషనరేట్‌లో 84మంది పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాదు సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదవి విరమణ పొందుతున్న 84 మంది అధికారులు, సిబ్బంది కి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈకార్యక్రమానికి ఐపీఎస్ కమిషనర్ ఆఫ్ పోలీసు కొత్తకోట శ్రీనివాస రెడ్డి, హైదరాబాదు, యస్. రాజేంద్ర ఐఎఎస్(రిటైర్డ్ డీజీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నన్స్ టీజీ) పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. మీరందరు తమకు ఇచ్చిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందారని, పోలీసు శాఖకు మంచి పేరు రావడానికి కారణం మన అందరి శ్రమ వలనే అని తెలిపారు. మీరు పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. రిటైర్‌మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావాల్సిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం మీ కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నానన్నారు. పోలీస్ శాఖ తరపున మీకు, మీ కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.పరిమళ హానా నూతన్ ఐపిఎస్ జాయింట్ సీపీ అడ్మిన్, హైదరాబాదు, ఇతర అధికారులు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యస్.శంకర్ రెడ్డి, సంఘం సభ్యులు పాల్గోన్నారు.



సాయి చందు మొదటి వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల సంక్షేమానికి, వైద్యానికి నిరంతరం కృషి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణఅంబర్‌పేట

పేదల సంక్షేమానికి వారి వైద్య,విద్యకు నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని తులసి నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబర్‌పేట డివిజన్ పరిధికి చెందిన నిమ్స్‌లో చికిత్స పొందుతున్న అలోక్ కుటుంబానికి ఒక లక్ష రూపాయల ఎల్‌ఓసిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంజూరు చేయించి స్థానిక కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ తో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వ నిధులతో పటు తన సొంత నిధులు కేటాయిస్తూ నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మహారాజ్‌గంజ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.వి.రామ్ చందర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని మహారాజ్ గంజ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రామ్ చందర్ అన్నారు. వర్షాకాలం మొదలు కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కూలర్లు,ఫ్లవర్ కుండీలు ఇంటి బయట ఉన్న కొబ్బరి చిప్పలు, పాత టైర్ల వంటి వాటిలో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలు దరి చేరకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు దోమతెరలు వాడాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మంచినీటిని వేడి చేసి చల్లార్చినా నీరు తీసుకోవాలన్నారు. బయట దొరికే తినుబండారాలను తినవద్దని సూచించారు. వేడివేడిగా ఉండేబలమైన ఆహారం తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎక్కువగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. దగ్గు, చలి జ్వరం, నీల విరేచనాలు ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. తమ ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్, థైరాయిడ్, వివిధ రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేసి అవ సరమైన వారికి మందులను అందిస్తున్నామన్నారు. చిన్న పిల్లలకు వ్యాక్సిన్లు ఇస్తున్నామని తెలిపారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య..

- పిల్లలను సర్కార్ బడులకు పంపాలి..
- సుల్తాన్ బజార్ ప్రభుత్వ బాలుర పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందిస్తామని, పిల్లలను సర్కార్ బడికి పంపించాలని సుల్తాన్ బజార్ (క్లాక్ టవర్)బాలుర పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం సుల్తాన్ బజార్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, భోజనం, ఉచిత బస్‌పాస్, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని అన్నారు.విద్యార్థులు విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు బోధించేందుకు పదిమంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈమధ్య విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 9.8 పాయింట్లు తరుణ్, 9.5 పాయింట్లు ఆనంద్ లు టాపర్లు గా నిలిచారని తెలిపారు. ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉంటుందని రానున్న రోజుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



- అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు అవగాహన
- ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ షాకీర్ హుస్సేన్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ట్రాఫిక్ కమిషనర్ శ్రీ విశ్వ ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులను తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను ఎక్కించుకున్న ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్క డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. నిబంధనలను పాటించకుంటే చాలన్ విధిస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్ . రవికుమార్, ఎస్‌ఐలు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన

- కార్పొరేటర్ ఇ. విజయకుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని లకోటియా ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యల పట్ల విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ హాజరై కార్పొరేటర్ విద్యార్థినీ , విద్యార్థులతో మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి దోమల నివారణ చర్యల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఇంటి పరిసర ప్రాంతాలని ఇంట్లో ఎక్కడ కూడా నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే దోమల ద్వారా మలేరియా డెంగ్యూ లాంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని, పరిశుభ్రతనే దోమల నివారణ మార్గమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎంటోమొలజీ సీనియర్ అధికారి దుర్గాప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ సుశీల, జీహెచ్‌ఎంసీ సిబ్బంది రాఘవేందర్, భాస్కర్, ప్రణయ్, అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బఫర్ జోన్ పేరుతో భయబ్రాంతులకు గురిచేయరాదు

- అధికారుల ఆకస్మిక పర్యటనతో పద్మా నగర్, రాందేవ్ గూడ బస్తీ వాసుల ఆందోళన..



నవతెలంగాణ-ధూల్‌పేట్

బఫర్ జోన్ పేరుతో ప్రజల్ని భయ బ్రాంతులకు గురిచేయరాదని సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా నాయకులు జి.విఠల్ అన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ఎంతో కష్టపడి పేద ప్రజలు కట్టుకున్న ఇండ్లను తొలగించే చర్యల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు స్థానిక ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గోల్కొండ మండలంలోని మూసీ పరీవాహక ప్రాంతాలు పద్మానగర్, రాందేవుగూడ బస్తీలలో అధికారులు పర్యటించారు. అధికారులు స్థానికులకు పూర్వాపరాలు చెప్పకుండా ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పద్మా నగర్ బస్తీ అధ్యక్షులు నరసింహా చారి, రాందేవ్ గూడ బస్తీ కమిటి అడ్వైజర్, సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా నాయకులు జి.విఠల్ అక్కడకు వచ్చిన జిల్లా డిప్యూటీ కలెక్టర్ రిశీ కుమార్, గోల్కొండ తహసీల్దార్, ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్, పోలీసు అధికారుల బృందమ్ తో మాట్లాడుతున్నారు. మాట్లాడుతుండగానే ఇతర అధికారులు ఇంటింటికీ వెళ్లి వారి పేరు, ఇంటి నంబర్, వృత్తి, ఎంతమంది ఉంటున్నారని తెలుసుకున్నట్లు. కరెంట్ బిల్లు, ఫోన్ నంబర్ నెంబర్లను సేకరించినట్లు తెల్సింది. దీనితో స్థానిక ప్రజలు ముందస్తు సమాచారం ఇచ్చి బస్తీ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆలోచనలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. అధికారుల నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో సీపీఐ (ఎం) సౌత్ జిల్లా నాయకులు, పద్మా నగర్ బస్తీ అధ్యక్షులు నరసింహాచారి తదితరులు అధికారులతో వాదనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను ద్దేసించి మాట్లాడుతూ.. ఎంతో కాలంగా నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నా ప్రజల నివాసాలను తొలగించే ప్రయత్నం సరికాదన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా బస్తిలి ఇండ్ల వద్దకు వచ్చి అధికారుల, సిబ్బంది తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులను కల్గించొద్దన్నారు. అధికారులు అలాగే వ్యవహరిస్తే బస్తీ వాసులతో మమేకమై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన ఆందోళనలు చేపడతామన్నారు.

పోరాడటానికి ప్రజలు సిద్ధం..

సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.డి.అబ్బాస్

సమీప భవిష్యత్‌లో మూసీ పరీవాహక బస్తీల్లో ఇదే పద్ధతిలో అధికారులు ఆకస్మిక పర్యటిస్తే ఎక్కడికక్కడ అడ్డుకొని ప్రతిఘటించాలని ప్రజలకు సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. బడా వ్యాపారుల ప్రయోజనాలకు గాను మూసీ పరిసర బస్తీల్లోనీ ప్రజల నివాసాలను ఆక్రమిస్తమంటే, కూల్చి వేస్తానంటే ప్రభుత్వం తో పోరాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.డి.అబ్బాస్ ప్రకటనలో తెలిపారు.

'వీధి వ్యాపారులకు వెండింగ్ లైసెన్స్ జారీ చేయాలి'



హాకర్స్ జేఏసీ జాతీయ అధ్యక్షులు ధర్మేంద్ర కుమార్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణలోని ఆరు లక్షల మంది వీధి వ్యాపారులకు వెండింగ్ లైసెన్స్, ఈఎస్‌ఐ, పీఎఫ్, మాన్ ధన్ నగదు బదిలీ చేయాలని హాకర్స్ జేఏసీ జాతీయ అధ్యక్షులు ధర్మేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కదన్, తెలంగాణ హాకర్స్ జేఏసీ, తెలంగాణ స్టేట్ స్ట్రీట్ వెండర్స్, హాకర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.వెంకట మోహన్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు వీధి వ్యాపారులు భారతదేశంలోని అనధికారిక ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అన్నారు. ఎస్‌ఎంఈలు, వినియోగదారులు ఎక్కువగా కనిపించే పట్టణాలు, కార్మికులు ఇప్పటికీ గుర్తించబడలేదన్నారు. తెలంగాణలోని అన్ని నగరాల్లో వీధి వ్యాపారులకు పాత కాలం నాటి దోపిడీ, వేధింపులు, తొలగింపులు, అద్దె కోరడం ఇంకా ప్రబలంగానే ఉందన్నారు. తెలంగాణ లో 146 పట్టణ స్థానిక సంస్థలున్నా యని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 6,08,277 వీధి వ్యాపారులను సర్వే చేయగా వందల సంఖ్యలో మాత్రమే వెండింగ్ జోన్లు ఏర్పడ్డాయన్నారు.వీధి వ్యాపారుల చట్టాన్ని సక్రమంగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వానికి థార్ హాకర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఐదు నెలల సమయం ఇస్తున్నట్లు ప్రకటించారు. వీధి వ్యాపారుల చట్టాన్ని అమలు చేస్తే హాకర్స్ ఉమ్మడి చర్య తెలంగాణ ప్రభుత్వం విఫలమైతే కమిటీ 2024 నవంబర్ 29న వీధుల్లో కవాతు చేస్తుందన్నారు. అసంఘటిత వీధి వ్యాపారులందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్‌లను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ మాన్ ధన్‌కు అనుగుణంగా వీధి వ్యాపారులందరికీ శ్రామిక్ మాన్ ధన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 28 కోట్ల మంది రైతులు ఒక్కొక్కరికి 2,000 చొప్పున 18 వాయిదాలుగా అందజేశారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ఇదే విధంగా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్. వెంకట్ మోహన్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల చట్టం 2014 అమలులోకి వచ్చి 10 ఏండ్లు గడిచినా, సర్వే చేయడం మొదటి పని అని, ఇప్పటికే ఉన్న వ్యాపారులందరిని సర్వే పూర్తి కాలేదన్నారు. చేసిన సర్వే లోపభూయిష్టంగా ఉందని, లక్షలాది మంది వీధి వ్యాపారులను చేర్చడంలో విఫలమైందన్నారు. తెలంగాణలోని నగరాల్లో సిటి కింద ఏర్పాటైన టౌన్ వెండింగ్ కమిటీలు చట్టానికి అనుగుణంగా లేవని, ఈ టౌన్ వెండింగ్ కమిటీల్లో వీధి వ్యాపారుల ప్రతినిధులను ప్రభుత్వం ఏకపక్షంగా నామినేట్ చేసిం దన్నారు. ప్రభుత్వం తప్పనిసరిగా టౌన్ వెండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. చట్టంలో పేర్కొన్న విధంగా టీవీసీలో వీధి వ్యాపారుల ప్రతినిధిని ఎన్నుకోవాల న్నారు. సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కదషన్ మాట్లాడుతూ సర్వే తర్వాత వెండింగ్ సర్టిఫికేట్ (సీఓసీ)ని వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. సర్వే చేసిన చాలా మంది వీధి వ్యాపారులు ఇప్పటికీ వెండింగ్ సర్టిఫికేట్ కోసం ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హాకర్స్ జేఏసీ జాతీయ కో-ఆర్డినేటర్ మంజూ గోయల్, కార్య దర్శి మన్సూర్ రజాక్, ఢిల్లీ కో-ఆర్డి నేటర్ నితేష్ దాస్, తెలంగాణ స్టేట్ స్ట్రీట్ వెండర్స్, హకర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు డి.శివరాజు, వి.శ్రీశైలం, కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్, సి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 1న ఛలో రాజ్ భవన్



- నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి
- విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

నవతెలంగాణ-ముషీరాబాద్

నీట్ యూజీ పరీక్ష ఫలితాలను తక్షణమే రద్దు చేసి పరీక్షను మళ్ళీ నిర్వహించాలని వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యాలయం పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ అధ్యక్షతన విద్యార్థి యువజన సంఘాల నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్, వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.ఆజాద్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జావీద్, ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఇందూరు సాగర్, ప్రదీప్, వై.జె.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సలీం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల దేశంలో సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందనీ మండిపడ్డారు. నీట్ పేపర్స్ లీకేజీ వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయ మంటే కేంద్ర ప్రభుత్వం తమ తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం "ది నోటిఫికేషన్ ఆఫ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్" చట్టాన్ని తీసుకొస్తున్నట్టు ప్రకటించడం సిగ్గుచేటు చర్య అన్నారు. సమస్య గురించి చర్చించేందుకు నిన్న గవర్నర్ అపాయింట్మెంట్ కోరినా కూడా ఇంతవరకు స్పందించలేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే జులై 1న ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధిత నీట్ విద్యార్థులు పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ) రద్దు చేసి నీట్ ప్రవేశ పరీక్షను తిరిగి నిర్వహించాలనీ అదేవిధంగా నీట్ పేపర్ లీకేజి కేసు పై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్రమైన దర్యాప్తు జరిపించి దోషులను శిక్షించాలన్నారు. ఎన్.టీ.ఏ నిర్వాకం వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు గడ్డం శ్యామ్, అశోక్ రెడ్డి, కంచనపల్లి శ్రీనివాస్, గౌతమ్ ఆసిఫ్ గణేష్ , లెనిన్, హస్మి కృష్ణ, బాబు, కొత్త రవి, డప్పు గోపి, సుశీల్, కె.కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వైస్-చాన్స్‌లర్ పోస్టులు బీసీలకు నియమించాలి



- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నియమించబోయే యూని వర్సిటీల వైస్-ఛాన్సలర్ పోస్టులను బీసీలకు 50 శాతం కేటాయించాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఓయూ, జేఎన్టీయూ, పాలమూరు, శాతవాహన విశ్వవిద్యాలయాలకు బీసీలను వైస్-ఛాన్సులర్ గా నియమించాలని, అదే విధంగా ఉన్నత విద్యా శాఖ కౌన్సిల్ చైర్మెన్‌గా బీసీ అభ్యర్థినే నియమించాలని ఆయన కోరారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు జి.అనంతయ్య అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల్లో 2,400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫె. సర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని వెంటనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని, అలాగే రీసెర్చ్ పోస్టులు భర్తీ చేయాలని, ఈ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యా ప్రమాణాలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పోరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, డైరెక్టర్ పోస్టులలో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని, ప్రతి బీసీ కులానికి ఒక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం బీసీలు ఎంతో కృషి చేశారని, అసెంబ్లీ, లోక్ సభ సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. కనీసం ఈ పదవులోనైనా న్యాయం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 8 నెలలు కావస్తున్న ఇంతా వరకు బీసీల కోసం ప్రత్యేకంగా ఒక చిన్న పథకాన్ని చేపట్టకపోవడం దారుణమన్నారు. ఈ ఏడాది 100 బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, 50 ఇంజనీరింగ్ కళాశా లలు, రెండు విశ్వ విద్యాలయాలు నెలకోల్పాలని, బీసీ కులాల జనాభా లెక్కలు వెంటనే ప్రారంభించాలని, పంచాయతీరాజ్ రిజర్వే షన్లు 42 శాతానికి పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోట్ల శ్రీనివాస్, గొరిగె మల్లేష్, రాజ్ కుమార్, రాందేవ్, శివ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం అమలు పరచాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యా హక్కు చట్టం అమలు పరచాలని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం విద్యా హక్కు చట్టం అమలు పరచాలని బహుజన ప్రజాశక్తి ఆధ్వర్యంలో ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బీఎస్ రమేష్, వీజీ ఆర్ నారగోని, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా బహుజన ప్రజాశక్తి కన్వీనర్ నల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కుల వివక్షత నిర్మూలనకై పోరాడి సమ సమాజ స్థాపనకు కృషిచేసిన మన సాంఘిక విప్లవత సారధులైన మహనీయుల ఆశయాలు సాధించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత స్కీంల స్థానంలో అన్ని వర్గాలలోని పేదవర్గాలు చదువుతున్న ప్రభుత్వ స్కూల్ నుండి పీజీ పీహెచ్డీ వరకు విద్యను ఉచితంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కమిటీ సభ్యులు చింతకింద రమేష్, మధు, భారత భూషణ్, ప్రేమ్ లాల్, నరసింహ, మధు, స్వామి ,నల్ల నాగేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'స్టార్స్‌గా ఎదిగిన వారిని ఒకే వేదిక పైకి తీసుకురావడమే లక్ష్యం'

- ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాచమళ్ళ అనిల్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

సామాజిక మాధ్యమాల్లో స్టార్స్‌గా ఎదిగిన వారిని, సమాజాన్ని ప్రభావితం చేసే వారిని ఒకే వేదిక పైకి తీసుకు రావడమే తమ సోషియావుడ్ ముఖ్య లక్ష్యమని ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాచమళ్ళ అనిల్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోషియావుడ్ జాతీయ స్థాయి సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నేడు (ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరంలోని ది మార్వెల్, టీ-హబ్ లో సోషి యావుడ్ జాతీయ స్థాయి సదస్సు-2024, సీజన్-2ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ రంగాల మాదిరిగానే సోషియావుడ్ కూడా ఒకటన్నారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన సోషల్ మీడియా ప్రభావితం చేసే వారికి వివిధ అంశాలపై అవార్డులు, అవగాహన కార్యక్రమాలు, అదే విధంగా సోషల్ మీడియా సమాజ శ్రేయస్సు, సుస్థిర అభివృద్ధి కోసం సోషల్ మీడియా సంఘటితం కావాలనే అంశాలపై ఈ సదస్సు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ప్రముఖులు, ముఖ్య కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారు లు పాల్గొంటారని, ఈ జాతీయ స్థాయి సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, డిక్లరేషన్లను ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, డీజీపీలు, ఐక్య రాజ్య సమితి, సామాజిక అభివృద్ధి విభాగం యునెస్కో, సమాచార ప్రభుత్వ శాఖలకు ఈ డిక్లరేషన్లను పంపించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ భాస్కర్, ఫౌండేషన్ సభ్యులు లిఖిత్ గౌడ్, భార్గవ్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీహెచ్‌ఓ అద్దె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ డిఎం అండ్ హెచ్‌ఓ పరిధిలో ఎస్‌పిహెచ్‌ఓ కోసం అద్దెకు తీసుకున్న వాహనాల బిల్లులను చెల్లించాలని వాహనాల యజమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శనివారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు వారు మాట్లాడుతూ.. ఏడాదికాలంగా తమ వాహనాలకు అద్దె బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్, మెయింటెనెన్స్ చార్జీలు పెరిగిపోవడంతో కుటుంబం గడవక మనోవేదన గురవుతున్నామన్నారు. వెంటనే కమిషనర్ ఈ సమస్యపై స్పందించి తమకు రావలసిన వాహనాల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. గత 10 ఏండ్ల నుంచి రూ.34 వేలు చెల్లిస్తున్నారని, ఇప్పుడున్న రేట్లకు అనుగుణంగా రూ.45 వేలు పెంచి ఇవ్వాలని కమిషనర్ కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కమిషనర్ తమ పెండింగ్ బిల్లు చెల్లించాలని కోరారు.

వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని రోడ్లపైన వర్షపు నీరు నిలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం బీజేపీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్‌తో కలిసి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికుమార్ ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కచ్చనాల డిసిల్టింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వర్షపు నీరు రోడ్లపై ఎక్కడ నిలిచిపోకుండా కచ్చనాల లోని మట్టి, చెత్తాచెదారం తొలగించేందుకు డిసిల్టింగ్ పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న బోనాల పండుగ నేపథ్యంలో ఏవిధంగానైతే నగరంలో అమ్మవారి దేవాలయాల వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయో, అదేవిధంగా తమ డివిజన్ లో పనులు జరిపించాలని, దేవాలయలవద్ద వున్న మట్టి, చెత్త తొలగించేందుకు ప్రత్యేకంగా వెహికల్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలో డివిజన్ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వాటితో పాటు పండుగకు చేసే ప్రత్యేక ఏర్పాట్లను మొదలు చేస్తామని హామీ ఇచ్చారు.

పద్మావతి పదవీ విరమణ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి మండలలోని జీపీఎస్ ధూల్ పెట్ నెం.1 పాఠశాల ఎల్.ఎఫ్.ఎల్‌బీ హెచ్.ఎం. పద్మావతి పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయురాలుగా ప్రభుత్వ పాఠశాలలో 41 సంవత్సరాల పాటు విధి నిర్వహణ, అంకిత భావంతో విద్యార్థులకు విద్యను అందించారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓఎస్ విశ్వనాథం గుప్తా, కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాలొన్నారు.

నర్గేస్ మొహమ్మది... ఇరాన్ మహిళల హక్కుల సాధన ఆమె లక్ష్యం. ఇరాన్‌లో ప్రజాస్వామ్యానికి ఊపిరి పోయాలన్నది ఆమె కోరిక. స్త్రీల స్వేచ్ఛా సమానత్వాల సాధన ఆమె ఉద్యమ గీతం. వాటి సాధనకు యాక్టివిజాన్ని ఆయుధంగా మలుచుకున్నారు. ఆ ప్రయాణంలో నిర్బంధాలు భయపెట్టలేదు. జైలు గోడలు సైతం ఆమె స్వేచ్ఛను నిర్బంధించలేకపోయాయి. పోరాటాన్ని నీరుగార్చలేకపోయాయి. అందుకే జైల్లో ఉండగానే నోబుల్ బహుమతికి ఎంపికయ్యారు. ఇప్పటికే జైలు జీవితం అనుభవిస్తున్న ఆమె ఇక విడుదల అవుతారు అనుకుంటున్న సమయంలో ఇరాన్ ప్రభుత్వం ఆమె శిక్షణను మరో ఏడాది పొడిగించింది. ఆ హక్కుల కార్యకర్త పరిచయం నేటి మానవిలో...

ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేస్తే..!

ఖాళీ కడుపుతో వర్కవుట్స్ చేస్తే, కడుపు దగ్గర పేరుకునే మొండి కొవ్వు కరుగుతుందనీ, త్వరగా బరువు తగ్గవచ్చని కొందరు అనుకుంటూ ఉంటారు. కానీ ఇందులో నిజమెంత?

ఖాళీ కడుపుతో చేసే వ్యాయామాన్ని ఫాస్టెడ్ కార్డియో అంటారు. ఇలా వ్యాయామం చేయడం వల్ల, శరీరం మనం తీసుకున్న ఆహారం నుంచి కాకుండా శరీరంలో పేరుకుని ఉన్న కొవ్వు, కార్బొహైడ్రేట్ల నుంచి శక్తిని సంగ్రహిస్తుందని అనుకుంటాం. కానీ నిజానికి వ్యాయామానికి



ముందు సరిపడా పోషకాలు తీసుకోవడం వల్ల సమర్థంగా వ్యాయామం చేయగలగడంతో పాటు కండర నష్టాన్ని అరికట్టగలుగుతాం. అలాగే వ్యాయామం చేయడానికి సరిపడా శక్తి సమకూరి అలసిపోకుండా ఉంటాం. కాబట్టి వ్యాయామానికి 45 నిమిషాల ముందు ఒక పండు లేదా స్నాక్ తీసుకోవచ్చు. మరీ ముఖ్యంగా 50 ఏండ్లు పైబడిన వాళ్లు తప్పనిసరిగా వ్యాయామానికి ముందు స్నాక్ తినాలి.

ఎలాంటి ఆహారం?

బ్లాక్ కాఫీ లేదా ప్రి వర్కవుట్ కెఫిన్‌ను ప్రివర్కవుట్ డ్రింక్‌గా తీసుకోవచ్చు. కార్బ్స్ తినాలనుకుంటే యాపిల్ లేదా పాలతో పాటు ఒక అరటిపండు లేదంటే కొన్ని డ్రై ఫ్రూట్స్ తీసుకోవచ్చు. తినడానికి ఇష్టపడని వాళ్లు, గ్లూకోజ్, లేదా ఎలక్ట్రొలైట్స్ కలిగిన నీళ్లను వ్యాయామానికి ముందు, వ్యాయామం చేస్తున్నప్పుడు తాగుతూ ఉండాలి.



ఎంతగా నిర్బంధిస్తే అంతగా తిరగబడతారు..

ఇరాన్‌లో మహిళలు ఉద్యోగాలు చేస్తున్నా, ఉన్నతమైన అకడమిక్ స్థానాల్లో ఉంటున్నా, ప్రభుత్వ ఉద్యోగాల్లో పురుషులకు తీసిపోనివిధంగా ముందుంటున్నా, అక్కడి మహిళల జీవితాలు వారి చేతుల్లో లేవు. స్వేచ్ఛ వారికి ఒక అందమైన కల మాత్రమే. స్త్రీలపై ఊపిరితిప్పుకోలేనంత నియంత్రణ, పురుషాధిక్యం కొనసాగుతోంది. ప్రతి స్త్రీ హిజాబ్ లేదా స్కార్ఫ్ తప్పనిసరిగా ధరించాలన్న చట్టాల కబంధహస్తాలు ఇరాన్ స్త్రీలను తీవ్ర అసహనానికి, ఆందోళనలకు గురిచేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో నార్గిస్ చేబట్టిన మహిళా హక్కుల చైతన్య ఉద్యమం ఇరాన్ స్త్రీలలో లావాలా ఉప్పొంగింది. అదే ఆమెను టార్గెట్ చేసేలా చేసింది.

మహిళా హక్కులపై ఉద్యమం

నర్గేస్ 1972లో జాన్‌జాన్‌లో జన్మించారు. ఫిజిక్స్‌లో డిగ్రీ చేశారు. మహిళలపై ఆంక్షలు విధించే ఇరాన్‌లో మహిళా హక్కులపై నర్గేస్ చదువుకున్న రోజుల నుంచే గళం విప్పారు. ఇంజనీరింగ్ చదివి కొంతకాలం కాలమిస్ట్‌గా పలు వార్తాపత్రికల్లో చేశారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత షిరిన్ ఇబాది స్థాపించిన డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సెంటర్‌లో 2003లో చేరారు. ఆ తర్వాత ఆ సంస్థ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 1998లో ఇరాన్ ప్రభుత్వాన్ని విమర్శించినందుకు తొలిసారి అరెస్టయి జైలుకు వెళ్లారు. జైళ్లలో ఉంటూనే మహిళా హక్కులపై ఉద్యమం కొనసాగించారు. నిషేధిత యాక్టివిస్టులకు సహాయపడ్డారనే ఆరోపణలతో 2011లో మరోసారి జైలుకు వెళ్ళి 2013లో బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పుడే మరణశిక్షను ఎత్తివేయాలని ప్రచారాన్ని చేపట్టారు.

> **31 ఏండ్ల జైలు శిక్షతో...**
>
> 2022లో ఆమె రాసిన 'వైట్ టార్చర్ ' పుస్తకం పెద్ద సంచలనాన్ని సృష్టించింది. జైళ్లల్లో ఒంటరి ఖైదీగా తన అనుభవాలను ఆ పుస్తకంలో రాసారు. బీబీసీ 100 మంది స్ఫూర్తిదాయక మహిళల్లో ఆమె కూడా ఉన్నారు. హక్కుల కోసం ఆమె చేస్తున్న పోరాటంలో ఎన్నోసార్లు కఠిన సవాళ్లు ఎదురయ్యాయి. అయినా ఆమె వెనుకడుగు వేయలేదు. 13 సార్లు అరెస్టయ్యారు. ఐదుసార్లు దోషిగా నిర్ధారించి, మొత్తం 31 ఏండ్ల జైలు శిక్షతో పాటు కోర్టులు 154 కొరడా దెబ్బలు విధించాయి. టెహ్రాన్‌లోని ఎవిన్ జైలులో ఎన్నో ఏండ్లుగా బంధీగా ఉన్నారు. భర్త రహ్మనీ నార్గిస్‌ను చూసి పదకొం దేండ్లు దాటిపోయింది. ఆమె పిల్లలు తల్లిని ప్రత్య క్షంగా చూసి ఎన్నో ఏండ్లయి పోయింది. ఇలా ప్రజా స్వామ్యం, సమానత్వం, మహిళా హక్కులు, స్వేచ్ఛ కోసం వెన్నుచూపకుండా నర్గేస్ ముప్ఫై ఏండ్లకు పైగా అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారు.

టీవీలో ప్రసారం చేసేవారట. ఇవి రెండూ ఆమె మనసులో అలాగే నాటుకుపోయాయి. చదువుకునే రోజుల్లో రాజకీయ యాక్టివిస్టు అయిన తఘి రహ్మనీని ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. ఆయనా తీవ్ర జైలు శిక్షను అనుభవించారు. ప్రస్తుతం తమ ఇద్దరు బిడ్డలతో ఆయన ఫ్రాన్స్‌లో ప్రవాసంలో ఉన్నారు.

నోబెల్ శాంతి బహుమతి

తను కొనసాగిస్తున్న ఈ పోరు మరింత ఉత్తేజితంగా, ధైర్యంగా ముందుకు సాగించేలా మరింత బలాన్ని, నిబద్ధతను, ఆశను 2023లో ఆమెకు నోబెల్ శాంతి బహుమతి రూపంలో వచ్చి చేరింది. ఈమెకు ముందు 2003లో నోబెల్ శాంతి బహుమతి మానవహక్కుల యాక్టివిస్టు షిరాన్ ఇబాదికి వచ్చింది. 122 ఏండ్ల నోబెల్ శాంతి బహుమతి చరిత్రలో జైలు లేదా గృహ నిర్బంధంలో ఉన్న ఓ వ్యక్తికి ఈ అవార్డు రావడం ఇది ఐదవసారి. 2022లో స్కార్ఫ్ సరిగా కట్టుకోలేదని ఇరాన్ మొరాలిటీ పోలీసులు 22 ఏండ్ల మొహసా అమిని అనే యువతిని అరెస్టు చేశారు. తర్వాత పోలీసు కస్టడీలో ఆమె చనిపోయింది. ఆమె మరణంతో ఇరాన్ కల్లోలమైంది. జనసముద్రం ప్రభుత్వంపై విరుచుకుపడింది. హక్కుల గళాలు మారుమోగాయి. ఆ సమయంలో నిరసనల ప్రదర్శనలు దేశమంతా వెల్లువెత్తాయి. అప్పుడు 500 మంది ప్రాణాలు కోల్పోతే, 22 వేల మందికి పైగా నిర్బంధించబడ్డారు. ఆ సందర్భంలోనూ నర్గేస్‌ను ఇరాన్ పాలకులు నిర్బంధించారు. దీనిపై ప్రతిస్పందిస్తూ ప్రజలను ఎంతగా నిర్బంధిస్తే అంతగా తిరగబడతారని ప్రభుత్వం గ్రహించడం లేదని ఆమె అన్నారు. హిజాబ్‌ను తప్పనిసరి చేస్తూ అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాలపై ఆమె తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇది ఇరాన్ పాలకులకు మింగుడుపడలేదు. స్త్రీలపై వ్యవస్థాగతంగా కొనసాగుతున్న అణచివేత, వివక్షతలపై ఆమె పోరాటం, ఆమె నెరిపిన ఉద్యమం ఎందరో మహిళల్లో స్వేచ్ఛాకాంక్ష పెల్లుబుకేలా చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

జైలు శిక్షను ఎందుకు పొడిగించారు?

ప్రస్తుతం జైల్లో ఉన్న నర్గేస్ నోబుల్ బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా తనను విడుదల చేయాలని ఇరాన్ ప్రభుత్వాన్ని కోరింది. ఆమె న్యాయవాది మోస్తఫా నీలి అసోసియేటెడ్ మాటల ప్రకారం వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన ఆరోపణలపై ఆమె దోషిగా నిర్ధారించబడ్డారు. ఇరాన్‌లో ఇటీవల జరిగిన పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించాలని ఆమె ఓటర్లను కోరడం, యూరప్‌లోని చట్టసభ సభ్యులకు లేఖలు పంపడం కారణంగా చూపుతున్నారు. అలాగే ఇరాన్‌కు చెందిన మహిళా జర్నలిస్ట్, రాజకీయ కార్యకర్తపై జరిగిన లైంగిక వేధింపులకు వ్యతిరేంగా మాట్లాడడం కూడా మరో కారణంగా చూపి ఆమె జైలు జీవితాన్ని పొడిగించారు.

2015లో తిరిగి అరెస్టయి జైల్లో నిర్బంధమయ్యారు. అయినా తన హక్కుల గళాన్ని జైలు నాలుగ్గోడల నుంచి ప్రపంచమంతా వ్యాపించేలా చేసి ఇరాన్ పాలకులకు చెమటలు పట్టించారు.

రెండు కారణాలు...

ఆమె యాక్టివిజం బాట పట్టడానికి రెండు కారణాలున్నాయి. నర్గేస్ పసితనంలో ఆమె తల్లి జైలులో ఉన్న తన సోదరుడి దగ్గరకు తరచూ వెడుతుండేవారు. ఆమె వెంట నర్గేస్ కూడా వెళ్లేవారు. ఇంకొక ముఖ్య కారణం ఏమిటంటే నిత్యం ఉరివేసే ఖైదీల గురించిన ప్రకటనలు

తెలుగోడికి ఎస్‌బీఐ పగ్గాలు..!

(మొదటిపేజీ తరువాయి)

ఎగ్జిక్యూటివ్‌ల నియామాక సంస్థ అయినా ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ఎస్‌బీఐ తదుపరి చైర్మెన్‌గా శ్రీనివాసులు శెట్టిని ఎంపిక చేస్తూ సిఫారసు చేసింది. పనితీరు, మొత్తం అనుభవం, వివిధ కొలమానాలను దృష్టిలో పెట్టుకుని శ్రీనివాసులును చైర్మెన్ పదవికి సిఫారసు చేసినట్టు ఎఫ్ఎస్ఐబీ శనివారం తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. కాగా.. దీనికి కేంద్ర క్యాబినెట్ కమిటీ, ప్రధానిమోడీ తుది ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ చైర్మెన్ పదవీ కోసం ముగ్గురు మేనేజింగ్ డైరెక్టర్లను ఎఫ్ఎస్ఐబీ ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుత చైర్మెన్ దినేశ్ కుమార్ ఖరా 2020 అక్టోబర్‌లో నియమితులు కాగా.. ఆయన పదవీకాలం 2024 ఆగస్టు 28తో ముగియనుంది. శ్రీనివాసులు సెట్టి 2020లో ఎస్‌బీఐ బోర్డులో ఎండీగా చేరారు. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐ అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన శ్రీనివాసులు శెట్టి అగ్రికల్చర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన ఆయన 1988లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఎస్‌బీఐలో తన కేరీర్‌ను ప్రారంభించి.. అంచెలంచెలుగా ఎదిగారు. 36 ఏండ్లకు పైగా సాగిన కెరీర్‌లో కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్‌లలోని బ్యాంకింగ్‌లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. న్యూయార్క్‌లోని విభాగానికి వైస్ ప్రెసిడెంట్ వంటి కీలక బాధ్యతలను నిర్వహించారు. ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలకు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించడానికి సిఫారసులు చేయడానికి ఎఫ్ఎస్ఐబీ బాధ్యత వహించే స్వయంప్రతిపత్త సంస్థ. 2022లో ఏర్పాటైన ఈ బ్యూరోకి పర్సనల్, ట్రైనింగ్ శాఖ మాజీ కార్యదర్శి భాను ప్రతాప్ శర్మ చైర్మెన్‌గా ఉన్నారు, ఆర్థిక సేవల విభాగం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు.

జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనిపై ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా రక్షణశాఖ మంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఈ ఏడాది మార్చి 5వ తేదీన రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కూడా స్వయంగా కలిసి ఈ అంశంపై విజ్ఞప్తి చేశారు.

అయితే అంతకుముందే బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దు చేసి, మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇటీవలే కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈనెల 25 కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ ఈ విలీన ప్రక్రియపై ఆమె స్పష్టమైన వైఖరిని వినిపించారు. ఈ సమావేశం మినట్స్‌కు కేంద్ర రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. విధివిధానాలను ఖరారు చేసింది. దీనితో కంటోన్మెంట్‌లోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నింటినీ ఉచితంగా జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. అక్కడ ఇప్పటికే ఇచ్చిన లీజులు కూడా మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరిస్తుంది. పన్నులు విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఆయా ప్రాంతాలను విభజించేటప్పుడు సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యుల సందేహాలను నివృత్తి చేసి, తదుపరి కార్యాచరణ చేపట్టాలని సూచించింది.

జిల్లా, మండల పరిషత్‌కు ప్రత్యేక బాధ్యులు..?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు స్థానిక సంస్థల ద్వారా పరిపాలన అందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే పథకాలు, అభివృద్ధి పనులన్నీ కూడా జిల్లా, మండల పరిషత్‌ల ఆమోదంతో అమలు చేయబడతాయి. ఐదేండ్ల పదవి కాలం ముగియనుండడంతో జిల్లా, మండల పరిషత్‌లకు కూడా పాలక వర్గాల్లేకుండా పోతాయి.

ప్రత్యేక పాలనేనా..

ఇప్పటికే గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీకాలం ఫిబ్రవరి 2తో ముగిసింది.. గ్రామ పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు జరపడం వీలు కానందున ప్రభుత్వం ప్రత్యేక అధికారుల్ని నియమించింది. తాజాగా జిల్లా, మండల పరిషత్‌లకు కూడా పాలకవర్గాలు రద్దు కానున్నందున ప్రత్యేక పాలన వచ్చే అవకాశముంది. జాతీయ ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్స్ ఇలా అనేక పద్దుల ద్వారా వచ్చే నిధులతో చేపట్టే పనులకు జిల్లా, మండల పరిషత్ లోకల్ బాడీల తీర్మానాలు కావాల్సి ఉంటుంది. అందు కోసం విధిగా ప్రత్యేక అధికారుల్ని నియమించాల్సి ఉంటుందన్నారు. జిల్లా పరిషత్‌లకు జెడ్పీ సీఈఓలు, మండల పరిషత్‌లకు ఎంపీడీఓలు పరిపాలనా వ్యవహారాలు చూస్తారు. వారినే ప్రత్యేక అధికారులుగా పెడతారా..? లేక వివిధ శాఖల జిల్లా అధికారులకి ప్రత్యేక అధికారులుగా బాధ్యతలిస్తారా..? అనేది చూడాలి. మరో రెండు నెలలు గడిస్తే మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీ కాలం కూడా ముగియనుంది. వాటికి కూడా ఎన్నికలు జరిగే గ్యారంటీ ఏమీలేదు. రాష్ట్రంలో బీసీ కుల గణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల మార్పు వంటి కారణాలతో లోకల్‌బాడీ ఎన్నికలు జరగడం లేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాలు జరిగిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు జరపాలి: మంజుశ్రీజైపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, సంగారెడ్డి

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా స్థానిక సంస్థలకు ప్రతి ఐదేండ్లకోసారి విధిగా ఎన్నికలు జరపాలి. రాష్ట్రంలో పంచాయతీల పదవీకాలం ముగిసినా ఎన్నికలు జరపలేదు. ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్‌ల పదవీ కాలం కూడా ముగియవస్తుంది. లోకల్‌బాడీలకు ఎన్నికలు జరపకుండా వాయిదా వేయడం మంచి సాంప్రదాయం కాదు. ప్రభుత్వం ఎన్నికలు జరపలేని పరిస్థితి ఉంటే ప్రస్తుత ప్రజా ప్రతినిధులను కొంత కాలం కొనసాగించడం మంచిది.

మొన్న ఢిల్లీ..ఇపుడు రాజ్‌కోట్

(మొదటిపేజీ తరువాయి)

రాజ్‌కోట్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరసార్ గ్రామంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్మించింది. కాగా, విమానాశ్రయాల్లో ఇలాంటి ఘటన జరగడం వారం రోజుల్లోనే ఇది మూడోది. ఈ నెల 27న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ విమానాశ్రయంలోనూ ఫాబ్రిక్ కెనోపిలో కొంత భాగం కూలిపోయింది. దాని క్రింద పార్క్ చేసిన కారు నుజ్జునుజ్జు అయింద ని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. ఈ ప్రమాదంపై ప్రాజెక్టు అధికారిని విచారణకు ఆదేశించామని, ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని విమానాశ్రయ డైరెక్టర్ రాజీవ్ రత్న పాండే తెలిపారు.ఢిల్లీ విమానాశ్రయంలో శుక్రవారం టెర్మినల్1లో కొంత భాగం కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ. 3 లక్షల పరిహారాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించిన విషయం విదితమే. విమానాశ్రయాల్లో కూలుతున్న తీరుపై ప్రయాణీకులకు, వారి బంధువుల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

గుజరాత్‌లో భారీ వర్షాలు

వాయుగుండం కారణంగా గుజరాత్‌లో గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. దక్షిణ గుజరాత్‌కు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

హెరిటేజ్ సిటీగా ఓరుగల్లు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలన్నారు. మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కాళోజీ కళాక్షేత్రం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ మాస్టర్‌ప్లాన్ 2050 వరకు డిజైన్ చేయాలన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం భూ సేకరణ చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు లైన్స్‌ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. నాలాల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని చెప్పారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. రింగు రోడ్డు నిర్మాణంపై హన్మకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సీఎం మాట్లాడుతూ.. రెండు దశల్లో 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగు రోడ్డు నిర్మాణానికి మొదట సత్వరమే భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాతే నిర్మాణ పనులు చేయాలన్నారు.

నగరాభివృద్ధికి రూ.6,115 కోట్లు అవసరం..

వరంగల్ నగరాభివృద్ధికి రూ.6,115 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్టు సీఎం చెప్పారు. మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లను మహిళా సంఘాలే తయారు చేసేలా బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. వరంగల్ నగర ముంపునకు శాశ్వత పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. నాలాల్లో పూడికను ఎప్పటికప్పుడూ తొలగించాలని చెప్పారు. హైదరాబాద్‌లో చేపడుతున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ ప్రయోగించాలని సూచించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలుంటే వెంటనే తొలగించాలన్నారు. నీలోఫర్ ఆస్పత్రి లాగా ఇక్కడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్లు, వైద్యసేవలకు సంబంధించి 'నిమ్స్'లో ఎన్‌ఓసీలు ఇచ్చినట్టుగానే ఎంజీఎం ఆస్పత్రిలోనూ ఎన్‌ఓసీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా ఏర్పాటు చేయాలన్నారు.

రాజకీయ ప్రేరేపిత బదిలీలుండవు..

సమర్థత ఆధారంగానే బదిలీలు ఉంటాయని.. రాజకీయ ప్రేరేపిత బదిలీలుండవని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి పని వారు చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో త్వరలోనే మళ్లీ సమావేశం నిర్వహించుకొని వరంగల్ నగరాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ప్రస్తుతం సమీక్షను ప్రాథమికంగానే నిర్వహించానని, 45 రోజులకు వచ్చి పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

సెప్టెంబర్ 9 నాటికి కాళోజీ కళాక్షేత్రం పూర్తి

హన్మకొండలో నిర్మిస్తున్న కాళోజీ కళా క్షేత్రాన్ని సెప్టెంబర్ 9వ తేదీ నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశాలిచ్చారు. ఈ పనులకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు. ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు.

రూ.518.71 కోట్ల చెక్కుల పంపిణీ

స్వశక్తి మహిళలకు రూ.518.71 కోట్ల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపిణీ చేశారు. సమీక్షా సమావేశానికి ముందు హన్మకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, చీఫ్ సెక్రటరీ శాంతికుమార్, డీజీపీ రవి గుప్తా, విప్ డాక్టర్ రామచంద్రునాయక్, మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డి, వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.40 లక్షల నష్ట పరిహారమివ్వాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సౌత్ గ్లాస్ ప్రయివేట్ కంపెనీలో కంప్రెషర్ పేలి ఆరుగురు కార్మికులు దుర్మరణం చెందడం, మరికొందరు గాయపడడం చాలా బాధాకరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తున్నదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. తక్షణమే ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.40 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారంతా ఇతర రాష్ట్రాల వలస కార్మికులే కాబట్టి 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని సూచించారు. అన్ని కంపెనీల్లో భద్రత ఆడిట్ నిర్వహించాలని కోరారు. ఇలాంటి ఘటనలు ఈ ప్రాంతంలో అనేకసార్లు జరిగినా, అధికారులు యాజమాన్యాల ప్రలోభాలకు లొంగి తనిఖీలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. తక్షణమే ఈ ఘటనపై విచారణ జరిపి, జాగ్రత్తలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రానికి నితీశ్ ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక ప్యాకేజీ కూడా ప్రకటించాలన్న డిమాండ్లు మా తీర్మానంలో వున్నాయి. ఈ రెండింటి కోసం మేం పోరాటం కొనసాగిస్తాం." అని జేడీయూ రాజకీయ సలహాదారు, జాతీయ ప్రతినిధి కె.సి.త్యాగి ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని గతేడాది నవంబరులో, ఎన్‌డీఏలో తిరిగి చేరడానికి కొద్ది మాసాలు ముందుగా నితీశ్ కుమార్ హామీ ఇచ్చారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో, బీజేపీ స్వంతంగా మెజారిటీని సంపాదించడంలో విఫలమైంది. 240సీట్లతో సరిపెట్టుకుంది. ప్రభుత్వ ఏర్పాటులో ఎన్‌డీఏ మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఈసారి ఎన్‌డీఏ ప్రభుత్వంలో 12లోక్‌సభ స్థానాలున్న జేడీయూ 16 మంది ఎంపీలున్న తెలుగుదేశం కీలక మిత్రపక్షాలుగా వున్నాయి. బీజేపీకి మద్దతిస్తామని ప్రకటించిన తర్వాత ఈ నెల ఆరంభంలో త్యాగి మీడియాతో మాట్లాడుతూ, ప్రత్యేక హోదా అన్నది దీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్ అని, ఈ పొత్తుకు అదేమీ ముందు షరతు కాదని తేల్చి చెప్పారు. ఈ ప్రభుత్వానికి తాము సంతోషంగా మద్దతిస్తున్నామని చెప్పారు. అయితే అంత మాత్రాన తాము ప్రత్యేక హోదా డిమాండ్‌ను వదులుకోమని, తర్వాతనైనా దీన్ని చేపడతామని చెప్పారు. శనివారం పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం అనంతరం త్యాగి మాట్లాడుతూ, ఎన్‌డీఏలోనే వుంటామని నితీష్ సమావేశంలో మరోసారి పునరుద్ఘాటించారని చెప్పారు. కూటమి నుంచి బయటకు వచ్చే ప్రశ్నే లేదని స్పష్టం చేశారని తెలిపారు. విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలు, తీవ్రంగా వెనుకబడిన తరగతులు (ఈబీసీ), ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను 50నుంచి 65శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు కొట్టివేయడాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంను ఆశ్రయించాలని పార్టీ ఈ సమావేశంలో నిర్ణయించింది. పార్టీ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు గానూ రాజ్యసభ ఎంపి సంజయ్ ఝాను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చేసినట్లు త్యాగి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి ఆనాడు మోడీ ప్రభుత్వం తిరస్కరించినందువల్లే 2018లో తెలుగుదేశం పార్టీ ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చేసింది. జెడి(యు) మాదిరిగానే తెలుగుదేశం పార్టీ కూడా లోక్‌సభ ఎన్నికలకు ముందే తిరిగి ఎన్‌డీఏలో చేరింది.

వొడాఫోన్ ఐడియా చార్జీల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాలిడిటీతో 1 జిబి డేటా లభించే ప్లాన్ చార్జీని రూ.299 నుంచి రూ.349కు పెంచారు. యాడ్ ఆన్ డేటా ప్లాన్‌లు కూడా పెరిగాయి. ఒక్కరోజు వ్యాలిడిటీతో రోజుకు 1 జీబీ డేటా ప్లాన్ ధర రూ.19 నుంచి రూ.22కు చేర్చింది. 6 జీబీ రీచార్జీ ధర రూ.39 నుంచి రూ.48కు పెంచింది. 5జీ సేవలను అందుబాటులోకి తేవడానికి వచ్చే త్రైమాసికంలో పెట్టుబడులను ప్రకటించనున్నట్టు వొడాఫోన్ ఐడియా తెలిపింది.





17 ఏండ్ల నిరీక్షణ ఫలించింది. దశాబ్ది దాహం తీరింది. టీమ్ ఇండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ చాంపియన్‌గా అవతరించింది. బ్రిడ్జ్‌టౌన్‌లో శనివారం జరిగిన టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. రెండోసారి (2007, 2024) ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన ఘనత దక్కించుకుంది.
2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్. 2017 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఫైనల్. గత దశాబ్ది కాలంలో టీమ్ ఇండియా టైటిల్ పోరుకు చేరుకున్న సందర్భాలు. ఢాకా, లండన్, అహ్మదాబాద్.. మూడు చోట్ల భారత్‌కు గుండెకోత తప్పలేదు. ఎట్టకేలకు బ్రిడ్జ్‌టౌన్‌లో భారత్ దశాబ్ది టైటిల్ దాహం తీరింది. దక్షిణాఫ్రికా 177 పరుగుల లక్ష్యం. 16 ఓవర్లలో 151/4. క్లాసెన్ (52), మిల్లర్ (21) క్రీజులో ఉండగా.. 24 బంతుల్లో 26 పరుగులే అవసరం. భారత ఆశలు ఇక్కడ ఆవిరైనట్టే కనిపించింది. స్పిన్‌పై ఎదురుదాడితో లక్ష్యం దిశగా వేగంగా అడుగులు వేసిన సఫారీలకు పేసర్లు చెక్ పెట్టారు. బుమ్రా, హార్దిక్, అర్ష్‌దీప్ వరుస ఓవర్లలో కండ్లుచెదిరే బంతులు సంధించారు. చేజారింది అనుకున్న తరుణంలో.. పేసర్లు టైటిల్‌ను మన సొంతం చేశారు. భారత్ సాధించింది. అజేయ రికార్డుతో టీ20 ప్రపంచకప్‌ను సాధించిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. విరాట్ కోహ్లి (76), అక్షర్ పటేల్ (47) విలువైన ఇన్నింగ్స్‌లతో భారత్‌ను భారీ స్కోరు అందించగా.. స్పిన్నర్లు నిరాశపరిచినా పేసర్లు అద్భుతం చేశారు. తొలిసారి ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరుకున్న దక్షిణాఫ్రికాకు భంగపాటు తప్పలేదు.

అజేయ చాంపియన్

టీ20 వరల్డ్‌కప్ విజేత భారత్
ఉత్కంఠ ఫైనల్లో మెరుపు విజయం
టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాకు భంగపాటు

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ టీమ్ ఇండియా సొంతమైంది. 2007 తొలి ఎడిషన్ విజేతగా నిలిచిన భారత్.. 17 ఏండ్ల తర్వాత మళ్లీ పొట్టి ప్రపంచకప్‌ను ముద్దాడింది. శనివారం బ్రిడ్జ్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. 177 పరుగుల ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులే చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (52, 27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులు), క్వింటన్ డికాక్ (39, 31 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), ట్రిస్టన్ స్టబ్స్ (31, 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో ఓ దశలో దక్షిణాఫ్రికా విజయం లాంఛనమే అనిపించింది. కానీ భారత పేసర్లు జశ్‌ప్రీత్ బుమ్రా (2/18), అర్ష్‌దీప్ సింగ్ (2/20), హార్దిక్ పాండ్య (2/20) మ్యాచ్‌ను మలుపు తిప్పారు. అంతకుముందు, విరాట్ కోహ్లి (76, 59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), అక్షర్ పటేల్ (47, 31 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు), శివం దూబె (27, 16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో భారత్ నిర్దేశిత 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. టీ20 ప్రపంచకప్ టైటిల్ విజయంతో పొట్టి ఫార్మాట్‌కు కోహ్లి వీడ్కోలు పలికాడు.

పేసర్ల ప్రతాపం

ఛేదనలో సఫారీలకు బుమ్రా, అర్ష్‌దీప్ ఝులక్ ఇచ్చారు. హెండ్రిక్స్ (4) వికెట్లను బుమ్రా గిరాటేయగా..మార్‌క్రామ్ (4) కథ సింగ్ ముగించాడు. బుమ్రా, అర్ష్‌దీప్ పేస్‌కు విలవిల్లాడిన సఫారీ బ్యాటర్లు.. స్పిన్నర్లపై దాడి చేశారు. డికాక్



(39), స్టబ్స్ (31) అక్షర్, కుల్దీప్ ఓవర్లలో దండిగా పరుగులు పిండుకున్నారు. ఈ ఇద్దరు నిష్క్రమించినా.. క్లాసెన్ (52), మిల్లర్ (21) ధనాధన్‌తో సఫారీ లక్ష్యానికి మరింత చేరువైంది. సఫారీ విజయం ఇక లాంఛనమే అనుకున్న తరుణంలో.. బుమ్రా, హార్దిక్, అర్ష్‌దీప్ డెత్ ఓవర్లలో అద్భుతం చేశారు. క్లాసెన్, జాన్సెన్ వికెట్లతో పాటు పరుగుల నియంత్రణతో సఫారీలను ఒత్తిడిలోకి నెట్టారు. 30 బంతుల్లో 30 పరుగుల సమీకరణం 6 బంతుల్లో 16 పరుగులకు చేరుకుంది. ఆఖరు ఓవర్లో హార్దిక్ పాండ్య.. డెవిడ్ మిల్లర్ వికెట్‌తో పాటు ప్రపంచకప్ టైటిల్‌ను సైతం అందించాడు.

పవర్‌ప్లేలో షాక్

ఫైనల్లో టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. పవర్‌ప్లేలోనే స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ప్రయోగించిన దక్షిణాఫ్రికా.. భారత్‌కు గట్టి షాక్ ఇచ్చింది. భీకర ఫామ్‌లో ఉన్న కెప్టెన్ రోహిత్ శర్మ (9), రిషబ్ పంత్ (0) స్వీప్ షాట్ ఆడబోయి మహరాజ్ ఓవర్లో నిష్క్రమించారు. ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లతో సఫారీల ఉత్సాహం రెట్టింపైంది. సూర్యకుమార్ యాదవ్ (3) దూకుడుగా ఆడే ప్రయత్నంలో రబాడ ఓవర్లో వికెట్ పారేసుకున్నాడు. దీంతో 4.3 ఓవర్లలో 34 పరుగులకే భారత్ 3 వికెట్లు కోల్పోయింది. పవర్‌ప్లేలో భారత్ 45/3తో నిలిచింది.

కోహ్లి, అక్షర్ దూకుడు

టాప్ ఆర్డర్‌లో ముగ్గురు కీలక బ్యాటర్లు విఫలమైన వేళ బ్యాటింగ్ లైనప్‌లో ముందుకొచ్చిన ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (47) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. దూకుడు వ్యూహం అమలు చేసిన అక్షర్ పటేల్ వస్తూనే బౌండరీ బాదాడు. విరాట్ కోహ్లి, అక్షర్ పటేల్ జోడీ నాల్గో వికెట్‌కు 54 బంతుల్లో 72 పరుగులు జోడించింది. కోహ్లి, అక్షర్ దూకుడుగా పరుగులు రాబట్టారు. ఓ ఫోర్, నాలుగు సిక్సర్లు సంధించిన అక్షర్ పటేల్ అర్ధ సెంచరీ ముంగిట



రనౌట్‌గా నిష్క్రమించాడు. నాలుగు ఫోర్లతో మెరిసిన కోహ్లి 48 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కోహ్లి నెమ్మదిగా ఆడినా.. అక్షర్ దూకుడుతో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది. శివం దూబె (27) సైతం ధనాధన్ మోత మోగించాడ. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో రెచ్చిపోయాడు. అర్ధ సెంచరీ తర్వాత రెండు ఫోర్లు, సిక్సర్లు కొట్టిన కోహ్లి గేర్ మార్చాడు. ఆఖర్లో కోహ్లి అవుటైనా.. హార్దిక్ పాండ్య (5 నాటౌట్), రవీంద్ర జడేజా (2)లు భారత్‌ను 170 మార్క్ దాటించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, నోకియా చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) క్లాసెన్ (బి) మహరాజ్ 9, విరాట్ కోహ్లి (సి) రబాడ (బి) జాన్సెన్ 76, రిషబ్ పంత్ (సి) డికాక్ (బి) మహరాజ్ 0, సూర్యకుమార్ యాదవ్ (సి) క్లాసెన్ (బి) రబాడ 3, అక్షర్ పటేల్ రనౌట్ (డికాక్) 47, శివం దూబె (సి) మిల్లర్ (బి) నోకియా 27, హార్దిక్ పాండ్య నాటౌట్ 5, రవీంద్ర జడేజా (సి) మహరాజ్ (బి) నోకియా 2, ఎక్స్‌ట్రాలు : 7, **మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 176.**

వికెట్ల పతనం : 1-23, 2-23, 3-34, 4-106, 5-163, 6-174, 7-176.

బౌలింగ్ : మార్కో జాన్సెన్ 4-0-49-1, కేశవ్ మహరాజ్ 3-0-23-2, కగిసో రబాడ 4-0-36-1, ఎడెన్ మార్‌క్రామ్ 2-016-0, ఎన్రిచ్ నోకియా 4-0-26-2, షంసి 3-0-26-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : రీజా హెండ్రిక్స్ (బి) బుమ్రా 4, క్వింటన్ డికాక్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 39, మార్‌క్రామ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 4, స్టబ్స్ (బి) అక్షర్ 31, క్లాసెన్ (సి) పంత్ (బి) హార్దిక్ 52, మిల్లర్ (సి) సూర్య (బి) హార్దిక్ 21, జాన్సెన్ (బి) బుమ్రా 2, మహరాజ్ నాటౌట్ 2, రబాడ (సి) సూర్య (బి) హార్దిక్ 4, నోకియా నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 9, **మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 169.**

వికెట్ల పతనం : 1-7, 2-12, 3-70, 4-106, 5-151, 6-156, 7-161, 8-168.

బౌలింగ్ : అర్ష్‌దీప్ సింగ్ 4-0-20-2, జశ్‌ప్రీత్ బుమ్రా 4-0-18-2, అక్షర్ పటేల్ 4-0-49-1, కుల్దీప్ యాదవ్ 4-0-45-0, హార్దిక్ పాండ్య 3-0-20-3, రవీంద్ర జడేజా 1-0-12-0.


ఫలించని స్పిన్ మంత్రం!

ప్రపంచకప్‌లో భారత్ విజయాల్లో స్పిన్నర్లది కీలక పాత్ర. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ప్రతి మ్యాచ్‌లోనూ మ్యాజిక్ చేశాడు. క్లిష్ట సమయంలో వికెట్లు కూల్చి గెలుపు బాటలు పరిచాడు. ఫైనల్లో అదే ప్రదర్శన ఆశించినా.. కుల్దీప్ సహా అక్షర్, జడేజా నిరాశపరిచారు. అక్షర్, జడేజా, కుల్దీప్‌లు 54 బంతుల్లో ఏకంగా 106 పరుగులు ఇచ్చుకున్నారు. పేస్‌పై తడబడిన డికాక్, స్టబ్స్ స్పిన్‌పై ఎదురుదాడి చేసినా.. రోహిత్ శర్మ రెండు ఎండ్‌ల నుంచి స్పిన్ ప్రయోగించాడు. క్రమం తప్పకుండా ప్రతి ఓవర్లో బౌండరీ బాదిన సఫారీలు భారత్‌పై ఒత్తిడి పెంచారు. డికాక్, స్టబ్స్, క్లాసెన్‌లు స్పిన్‌పై విశ్వరూపం చూపించారు.

పేసర్ల అద్భుతం

16 ఓవర్లలో దక్షిణాఫ్రికా 151/4. సఫారీ విజయానికి 24 బంతుల్లో 26 పరుగులు అవసరం. క్రీజులో క్లాసెన్, డెవిడ్ మిల్లర్. దక్షిణాఫ్రికా విజయం నల్లేరు మీద నడకే అనిపించింది. కానీ హార్దిక్ పాండ్య, జశ్‌ప్రీత్ బుమ్రా వరుస ఓవర్లలో మ్యాజిక్ చేశారు. ప్రమాదకర క్లాసెన్‌ను హార్దిక్ పాండ్య అవుట్ చేయగా.. బుమ్రా కండ్లుచెదిరే బంతితో జాన్సెన్‌ను సాగనంపాడు. ఈ రెండు ఓవర్లలో కలిపి ఆరు పరుగులే వచ్చాయి. అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ 19వ ఓవర్లో 4 పరుగులే ఇచ్చాడు. ఆఖరు 6 బంతుల్లో 16 పరుగులు అవసరం కాగా.. తొలి బంతికి డెవిడ్ మిల్లర్ భారీ షాట్ ఆడగా.. బౌండరీ లైన్ దగ్గర సూర్యకుమార్ యాదవ్ సంచలన క్యాచ్ అందుకున్నాడు. ఇక తర్వాత ఐదు బంతుల్లో భారత్ లాంఛనం ముగించింది.

అఖండ విజయంతో మా లక్ష్యం నెరవేరింది



అన్ని పాత్రలూ మెస్మరైజ్ చేశాయి

అమితాబ్‌ని నాగ్ అశ్విన్ చాలా అద్భుతంగా చూపించారు. ఆయన్ని అలాంటి పాత్రలో చూడాలని ప్రేక్షకులు కూడా కోరుకున్నారు. అమితాబ్ పాత్ర గురించి దర్శకుడు ఏం అనుకున్నారో అలానే తీస్తారని తెలుసు, అలానే తీశారు కూడా. నిర్మాతగా గౌరవం ఇస్తూ నా కాళ్ళకి అమితాబ్ నమస్కరించినప్పుడు నాకు తలకాయ కొట్టేసినంత పనైంది (నవ్వుతూ). మేము కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం. అక్కడితో ఆగిపోతాం. అయితే స్టేజ్ మీద మాత్రం ఆయన అలా చేయడం నేను అస్సలు ఊహించలేదు. అమితాబ్ లెజెండ్. ఇందులో 'బుజ్జి' (కారు)ని కూడా ఒక పాత్ర చేశారు.. ఈ ఆలోచన దర్శకుడు చెప్పినపుడు ఆయన విజన్ చాలా గొప్పగా ఉందనిపించింది. బుజ్జి పాత్రను సినిమాలో చాలా గొప్పగా ప్రజెంట్ చేశారు. ఇక ప్రభాస్, దీపికా పదుకొనె, కమల్‌హాసన్ పాత్రలూ అద్భుతం చేశాయి.

నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన సైన్స్ ఫిక్షన్ ఎపిక్ మాగ్నం ఓపస్ 'కల్కి 2898 ఏడి'. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొనె లీడ్ రోల్స్‌లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై నిర్మాత సి.అశ్వనీదత్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ నెల 27న గ్రాండ్‌గా విడుదలై ప్రపంచ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాత సి.అశ్వినీదత్ శనివారం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

> **సోషల్ మీడియాలో**
> **మా అమ్మాయిల్ని 'కల్కి' రికార్డ్స్ గురించి అడిగితే రికార్డుల కోసం కాదు సినిమాపై ప్రేమతో చేశామని చెప్పడం చాలా ఆనందంగా ఉంది. తండ్రిగా నేను గొప్ప అదృష్టవంతుడిని. మా అమ్మాయిలు స్వప్న, ప్రియాంక వరల్డ్ రేంజ్ సినిమాని తీశారు. మా వైజయంతి సంస్థని గొప్ప శిఖరాలకి తీసుకెళ్తున్నారు. అంతేకాదు నా వారసత్వాన్ని వాళ్ళు బాగా కొనసాగిస్తున్నందుకు తండ్రిగా గర్వంగా ఉంది. రికార్డ్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. కానీ ఈసారి వస్తున్న రికార్డ్స్ చాలా అద్భుతం. ఒక్కమాటలో చెప్పాలంటే విప్లవాత్మకంగా ఉన్నాయి. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ అద్భుతాన్ని చేశారు. ఈ విజయాన్ని ఆస్వాదిస్తున్నాం.**

విప్లవాత్మక ఫలితం

కల్కి ఫలితం విషయంలో చాలా చాలా హ్యాపీగా ఉన్నాను. నిన్న మార్నింగ్ షో నుంచే.. తెలుగు రాష్ట్రాలు, ముంబయి, మద్రాస్, బెంగళూరు, ప్రపంచవ్యాప్తంగా రెవల్యూషనరీ రిపోర్ట్ వచ్చింది. నేను ఏదైతే అనుకున్నానో అలాంటి అఖండ విజయం వచ్చింది. హ్యాట్సాప్ టు నాగ్ అశ్విన్.

ఆ నమ్మకంతోనే తీశాం

నాగ్ అశ్విన్ గత రెండు సినిమాలు చాలా సెన్సిబుల్‌గా ఉంటాయి. తను ఇలాంటి వైల్డ్ డెప్త్ ఉన్న సబ్జెక్ట్‌ని హ్యాండిల్ చేయగలడనే కాన్ఫిడెన్స్ రావడానికి కారణం ఏంటంటే, తన మొదటి సినిమా నుంచి తనతో జర్నీ చేస్తున్నాం. తను ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడనే కాన్ఫిడెన్స్ నాకు మొదటి నుంచి ఉంది. అదే మా అమ్మాయిలతో చెప్పాను. తను ఏ సబ్జెక్ట్ చెప్పినా వెంటనే దూకేయమని అన్నాను.

ఎక్కడా జోక్యం చేసుకోను..

నా మొదటి సినిమా 'ఎదురులేని మనిషి' నుంచి ఇప్పటివరకూ దర్శకుడు చెప్పింది వినడం, తనకు కావల్సినది సమకూర్చడం తప్ప మరో డిస్కర్షన్ పెట్టను. ఈసినిమా మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఇంకా ఏం కావాలని అడగడం తప్ప ఎప్పుడూ ఎక్కడా జోక్యం చేసుకోలేదు.

కమల్ ఎంట్రీ తర్వాత..

ఈ కథ అనుకున్నప్పుడే పార్ట్ 2 ఐడియా ఉంది. కమల్ ఎంటరైన తర్వాత పార్ట్ 2ని చేయాలని కచ్చితంగా డిసైడ్ అయిపోయాం. కమల్ పాత్ర అంత అద్భుతమైనది. ఈ సినిమా చూసిన తర్వాత చాలా మంది పార్ట్2 కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఈ సినిమా మాదిరిగానే పార్ట్ 2 కూడా వచ్చే ఏడాది ఇదే టైమ్‌లో రిలీజ్ ఉండొచ్చని అనుకుంటున్నాను.

ఊహించినట్టే వచ్చింది

కల్కి విషయంలో ఎలాంటి టెన్షన్ పడలేదు. మిడ్ సమ్మర్‌లో రిలీజ్ అయితే బావుంటుందని అనుకున్నాం. మే 9 నుంచి పోస్ట్ పోన్ అయ్యింది. తర్వాత జూన్ 27 కరెక్ట్ అనుకుని ఆ డేట్‌కి తీసుకొచ్చాం. నాగీ, స్వప్న, ప్రియాంక ఈ ముగ్గురే కాపీ చూశారు. దేవుడి దయ. సినిమా అద్భుతమైన విజయం సాధించింది. ఈ సినిమా అఖండ విజయం సాధిస్తుందనే లక్ష్యంతోనే తీశాం. ఆ లక్ష్యం నెరవేరింది.

ప్రభాస్ నిజంగా డార్లింగే..

ప్రభాస్ కోపరేషన్ చాలా బావుంది. ఆయన కోపరేషన్ లేకపోతే అసలు సినిమా బయటికి రాదు. డార్లింగ్ అంటే నిజంగా డార్లింగ్ లానే పని చేశారు. ఇక రాజమౌళి-ప్రభాస్ ఎపిసోడ్ ఫన్నీగా పెట్టాం. బ్రహ్మానందం, రామ్ గోపాల్ వర్మ క్యామియోస్‌ని కూడా ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

ఇదొక అద్భుతమైన ప్రయాణం

వైజయంతి మూవీస్ సక్సెస్‌ఫుల్‌గా 50 ఇయర్స్ కంప్లీట్ చేసుకుంది. ఇదొక అద్భుతమైన ప్రయాణం. నా మొదటి సినిమా నుంచి, నేటి కల్కి వరకూ అందరికీ రుణపడి ఉంటాను. నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ సొంత మనిషిలా నన్ను దగ్గరకు చేర్చుకుని సినిమాలు చేశారు. వైజయంతీ మూవీస్‌లో శ్రీకాంత్ అబ్బాయితో ఓ సినిమా, అలాగే దుల్కర్ సల్మాన్‌తో ఓ సినిమా చేస్తున్నాం.



కూర్మనాయకిలో పవర్‌ఫుల్ రోల్

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మరో భారీ సోషియో ఫాంటసీ మూవీ 'కూర్మనాయకి'. ఈ చిత్రాన్ని ఎంఎం క్రియేషన్స్, కాలభైరవ ప్రొడక్షన్స్‌తో కలిసి రోషన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో కె విజితా రావ్ నిర్మిస్తున్నారు. స్నిగ్ధ మణికాంత్ రెడ్డి, పూజ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటిదాకా రానటువంటి కథాకథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు హర్షవర్ధన్ కడియాల.
వరలక్ష్మీ శరత్ కుమార్, సాయి కుమార్, అతిరారాజ్, వీటీవీ గణేష్ కీ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో శివాజీ ఓ ప్రధాన పాత్రను పోషించనున్నారు. శనివారం శివాజీ బర్త్ డే సందర్భంగా ఆయన్ని పుట్టినరోజు శుభాకాంక్షలుతో ప్రాజెక్ట్‌లోకి వెల్కమ్ చేస్తూ స్పెషల్ వీడియో రిలీజ్ చేసింది చిత్ర బృందం. శివాజీ ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తోంది.
మహావిష్ణు అవతారాల్లోని కూర్మావతారం నేపథ్యంలో భారీ పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు హర్షవర్ధన్ కడియాల. అత్యున్నత సాంకేతిక విలువలతో పాటు హై క్వాలిటీ వీఎఫ్ఎక్స్ షాట్స్ ఈ సినిమాకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం రెండు షెడ్యూల్స్ చిత్రీకరణ పూర్తి అయ్యాయి. మూడో షెడ్యూల్‌లో శివాజీ జాయిన్ అయ్యారు. ఈ సినిమాలో ఓ స్టార్ హీరో కూడా నటించనున్నారు. ఆయన ఎవరనేది మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.
ఈ చిత్రానికి ఎడిటర్ - ఛోటా కె ప్రసాద్, సినిమాటోగ్రఫీ - రామ్, మ్యూజిక్ - శేఖర్ చంద్ర.

నవచిత్రం

పోలీసుల వేట ఎవరి కోసం?



హీరో విజయ్ ఆంటోని నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తుఫాన్'. ఈ సినిమాను ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో ఈ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. ఈ సినిమాను జూలైలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.
'ఎవరి గతంలో లేని, మరొకరి భవితగా మారిన ఓ వ్యక్తి కథ ఇదని ట్రైలర్‌లో చెప్పారు. తనకు ఎవరూ తెలియని ఓ ప్రాంతంలోకి వెళ్లి ఎవరూ తనను గుర్తుపట్టకుండా జాగ్రత్తపడుతుంటాడు హీరో విజయ్ ఆంటోని. అతన్ని తన చీఫ్ శరత్ కుమార్ గైడ్ చేస్తుంటాడు. హీరోను ఓ కుటుంబం ఆదరిస్తుంది. మరోవైపు పోలీస్ అధికారి మురళీ శర్మ...హీరో కోసం వేట సాగిస్తుంటాడు. ఇంతకీ ఎవరి గతంలోలేని హీరో గతమేంటి? అతని కోసం పోలీసుల వేట ఎందుకు సాగుతోంది?, కొత్త ప్రాంతంలో తనను ఆదరించిన కుటుంబం కోసం హీరో ఏం చేశాడు అనేది ట్రైలర్‌లో ఇంట్రెస్టింగ్‌గా చూపించారు. సినిమాటోగ్రఫీ, బ్యూటిఫుల్ లోకేషన్స్, పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్సులు, విజయ్ ఆంటోనీ ఇంటెన్స్, ఎమోషనల్ పర్‌ఫార్మెన్స్ ఆకట్టుకుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ట్రైలర్ కూడా ఇన్‌స్టంట్‌గా ఆడియెన్స్‌కు రీచ్ అయ్యేలా ఆసక్తికరంగా ఉంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

సత్యభామకు సూపర్ రెస్పాన్స్



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాష్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు.
'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. ఈ నెల 7వ తేదీన థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన ఈ సినిమా విశేష ఆదరణ పొందింది. అలాగే అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతూ ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది.
ఈ నేపథ్యంలో మేకర్స్ మాట్లాడుతూ, 'ఓ హత్యకేసులో ఎమోషనల్ అయిన సత్యభామ ఆ కేసును ఒక ఛాలెంజ్‌గా తీసుకుని ఎలా సాల్వ్ చేసింది?, బాధితురాలికి ఎలా న్యాయం చేసింది అనేది ఈ సినిమాలో హార్ట్ టచింగ్‌గా, ఇంటెలిజెంట్‌గా చూపించాం. ఇందులో కాజల్ అగర్వాల్ యాక్షన్ సీక్వెన్సులు హైలైట్ అయ్యాయి. పర్‌ఫెక్ట్ క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల దీన్ని రూపొందించారు. ప్రైమ్ వీడియోలోనూ మరింత మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



ఎంఎస్ఎంఈ ఖాతాదారులకు యాక్సిస్ బ్యాంక్ సత్కారం

నవతెలంగాణ బిజినెస్ బ్యూరో : అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా తమ ఖాతాదారులను సన్మానించినట్టు యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది. గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, నెల్లూరు, కర్నూలు, రాజమండ్రి, అమలాపురం, అనంతపురం తదితర ప్రాంతాల్లోని యాక్సిస్ బ్యాంకు శాఖల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయని ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని 250పైగా ఎంఎస్ఎంఈ కస్టమర్లను వారి కృషికి గాను సత్కరించినట్టు పేర్కొంది. ఈ కార్యక్రమంల్లో యాక్సిస్ బ్యాంక్ సీనియర్ ప్రతినిధులైన నూతి చక్రవర్తి, విజయ్ శెట్టి, రాజేంద్ర జై కుమార్, జె రవీంద్రనాథ్ పాల్గొని ఎంఎస్ఎంఈ రంగాల్లో రాణించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. 2024 మార్చి 31 నాటికి ఎంఎస్ఎంఈ రంగ రుణాల్లో యాక్సిస్ బ్యాంకుకు 8.4శాతం మార్కెట్ వాటా ఉంది.

జీడీపీ స్థిర ఏడాది మార్పు..!

న్యూఢిల్లీ : స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) స్థిర ఏడాది మార్పునకు 26 మందితో కూడిన అడ్వైజరీ కమిటీ ఆన్ నేషనల్ ఎకౌంట్స్ స్టాటిస్టిక్స్ (ఏసీఎన్ఏఎస్)ను ఏర్పాటు చేస్తూ కేంద్ర గణాంకాల శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి ఛైర్మన్‌గా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకానమిక్ గ్రోత్ మాజీ ప్రొఫెసర్ బిస్వంత్ గోల్డర్‌ను నియమించింది. సభ్యుల్లో సీఎస్ఓ మాజీ డైరెక్టర్ జనరల్ జీసి మన్న, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మౌసమి దాస్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ డైరెక్టర్ చేతన్ ఘాటే ఉన్నారు. అదే విధంగా ఆర్‌బీఐ, నీతి అయోగ్, వ్యవసాయ మంత్రిత్వ శాఖ, జీఎస్‌టీ నెట్‌వర్క్, వాణిజ్య మంత్రిత్వ శాఖల నుంచి ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. జీడీపీ నూతన స్థిర ఏడాది కోసం ఏర్పాటు చేసిన కమిటీ కాలపరిమితి ఐదేండ్లు లేదా తదుపరి స్థిర ఏడాది పూర్తి అయ్యే వరకు అమల్లో ఉంటుంది. ప్రస్తుతం 2011-12 స్థిర ధరల వద్ద జీడీపీని లెక్కిస్తున్నారు.

కృష్ణా జలాల వాదనలు

- కౌంటర్‌కు మరోసారి
- గడువు కోరిన ఏపీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా జలాల వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్‌లో జరుగుతున్న వాదనలకు కౌంటర్ దాఖలు చేసేందుకు ఏపీ సర్కారు మరోసారి గడువు కోరింది. గత మే నెల 15న ఇరురాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణా జలాల పంపిణీ వ్యవహారంపై తెలుగు రాష్ట్రాలు ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపించిన విషయం విదితమే. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ వేసింది. అయితే ఏపీలో ఎన్నికలు జరగడం , కొత్త ప్రభుత్వం రావడంతో కౌంటర్ దాఖలు చేయడం ఆలస్యమవుతున్నది. తాజా సర్కారు విధానం ప్రకారం కౌంటర్ వేయాల్సి ఉంటుందనే అభిప్రాయంతో ఏపీ సాగునీటి శాఖ అధికారులు ఉన్నట్టు తెలిసింది. జులై 15, 17 తేదీల్లో మళ్లీ ఢిల్లీలో కేడబ్ల్యూడీటీ-2లో వాదనలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మరో నాలుగు వారాలు గడువు కావాలంటూ ఏపీ చీఫ్ ఇంజినీర్ కేడబ్ల్యూడీటీ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు.

వారెన్ బఫెట్ రూ.44వేల కోట్ల దానం

న్యూయార్క్ : ప్రముఖ ప్రపంచ కుబేరుడు, బెర్క్‌షైర్ హత్‌వే ఛైర్మన్ వారెన్ బఫెట్ 5.3 బిలియన్ డాలర్లు (రూ.44,000 కోట్లు) దానం చేయాలని నిర్ణయించారు. ఇందులో 1.3 కోట్ల బెర్క్‌షైర్ హతావే స్టాక్స్‌ను బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కు, నాలుగు కుటుంబ ఛారిటీలకు విరాళంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. 2006 తర్వాత బఫెట్ ఇస్తున్న అత్యధిక వార్షిక విరాళం ఇదే. తాజా విరాళంతో కలిపి స్వచ్ఛంద సంస్థలకు ఆయన అందించిన మొత్తం విరాళాలు 57 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.4.7 లక్షల కోట్లు) చేరాయి. గేట్స్ ఫౌండేషన్‌కు బఫెట్ 43 బిలియన్ డాలర్లకు పైగా విలువైన బెర్క్ షైర్ షేర్లను అందించారు.

సింక్రోనీ 'ప్రైడ్' ఉత్సవాలు

హైదరాబాద్ : ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీ ప్రైడ్ మంత్ 2024ను నిర్వహించినట్టు తెలిపింది. సమానత్వం, వైవిధ్యతను పెంచే లక్ష్యంతో ఈ ర్యాలీని ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. ఇందుకోస మొబ్బెరా ఫౌండేషన్‌తో భాగస్వామ్యం కుదర్చుకున్నట్టు తెలిపింది. ఈ ర్యాలీలో హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సహా 350 మందికి పైగా మద్దతుదారులు పాల్గొన్నారని తెలిపింది.

ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై ఎఫ్‌టీసీసీఐ సదస్సు

హైదరాబాద్ : ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఇంటరాక్టివ్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పలువురు స్పీకర్లు, ఇన్వెస్టర్లు హాజరయ్యారు. వ్యవసాయం కలప, వస్త్రాలు, జీడిపప్పు, పండ్లు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, ఖనిజాలు, గాజు, నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విభిన్న రంగాలలో ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై నిపుణులు వివరించారు. అరైజ్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ ఎపి అండ్ తెలంగాణ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ ఎకె ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. ఆఫ్రికాలోని వ్యాపార అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలో వివరించారు. ఆఫ్రికా నుంచి యూరప్‌కు పన్నులు లేకుండా ఎగుమతులు చేసే విధానాలను తెలిపారు. అధిక రాబడులకు ఇదో మంచి అవకాశమన్నారు.

కాలే యాదయ్య పార్టీ ఎందుకు మారారు?

-బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విలువలతో బతుకుతా అని చెప్పిన చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య కాంగ్రెస్‌లోకి ఎందుకు మారారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, మహేష్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. తనను నమ్ముకుని గెలిపించిన కార్యకర్తలకు యాదయ్య సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ దేవుడని పొగిడిన యాదయ్యకు ఇప్పుడు ఆయన దయ్యం మాదిరిగా కనిపిస్తున్నారా? అని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని కోరారు.

భారత శతకోటీశ్వరుల్లో
88 శాతం అగ్ర కులస్తులే...

- ఎస్‌టీల నుంచి ఒక్కరూ లేరు..
- ప్రపంచ అసమానతల నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని వరల్డ్ ఇన్ ఇక్వాలిటీ నివేదిక స్పష్టం చేసింది. దేశంలో ఉన్న శతకోటీశ్వర్లుల్లో 88 శాతం అగ్ర కులస్తులే అని తెలిపింది. ఎస్‌టిల నుంచి ఒక్కరూ లేరని పేర్కొంది. 'టువర్డ్స్ ట్యాక్స్ జస్టిస్ అండ్ వెల్త్ రిడిస్ట్రిబ్యూషన్ ఇన్ ఇండియా' పేరుతో ఈ నివేదికను విడుదల చేశారు. భారత్‌లోని మొత్తం సంపదలో 40 శాతం సంపద ఒక్క శాతం జనాభా నియంత్రణలో ఉందని ఈ నివేదిక తెలిపింది.

ఈ నివేదిక ప్రకారం దేశంలో శతకోటీశ్వరుల్లో 88.4 శాతం వరకూ అగ్రకులస్తులే ఉన్నారు. అత్యంత అట్టడుగు వర్గాలుగా భావించే ఎస్‌టిల నుంచి ఒక్కరూ లేరు. ఇది దేశంలో పెరుగుతున్న అర్థిక అసమానతలను సూచిస్తుందని నివేదిక తెలిపింది. 2018-19 ఆల్ ఇండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే (ఎఐడిఐఎస్) నివేదిక ప్రకారం మొత్తం దేశ సంపదలో 55 శాతం సంపద అగ్ర కులస్తుల చేతిలోనే ఉందని తాజా నివేదిక గుర్తు చేసింది. భారత కుల వ్యవస్థలోని అసమానతలు దేశ ఆర్థిక వ్యవస్థలోనూ వ్యాప్తి చెందాయని తెలిపింది.





ఆర్థిక వ్యవస్థపై కులాధిపత్యం

దేశ ఆర్థిక వ్యవస్థపైనా కులాధిపత్యం కొనసాగుతోందని నివేదిక స్పష్టం చేసింది. సంపద సృష్టికి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, సోషల్ నెట్‌వర్క్, రుణాలు వంటి అన్ని అంశాలపైనా కులాధిపత్యం తీవ్రస్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది. చారిత్రాత్మకంగా దళితులకు అనేక ప్రాంతాల్లో భూమి లేకుండా నిషేధించారని, ఇది దళితుల ఆర్థిక పురోగతిని పరిమితం చేస్తుందని తెలిపింది. కుల అధారిత ఆర్థిక అసమానత ఎంటర్‌ప్రైజ్ యజమానుల్లోనూ ఉందని పేర్కొంది. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2023 నివేదికను ప్రస్తావించింది. ఈ నివేదిక ప్రకారం ఎస్‌సిలు, ఎస్‌టిల శ్రామిక శక్తితో పోల్చుకుంటే, ఎంటర్‌ప్రైజ్ ఓనర్లుగా చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. శ్రామిక శక్తిలో ఎస్‌సిలు 19.3 శాతం వరకూ ఉండగా, సొంతంగా వ్యాపారాలు చేసుకునే వారిలో 11.4 శాతం మాత్రమే ఉన్నారు. శ్రామిక శక్తిలో 10.1 శాతంగా ఉన్న ఎస్‌టిల్లో 5.4 శాతం మాత్రమే ఎంటర్ ప్రైజ్ ఓనర్లుగా ఉన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అధిక సంపదవర్గంలో ఎస్‌సిలు 12.3 శాతం, ఎస్‌టిలు 5.4 శాతం ఉన్నారు. తక్కువ సంపద వర్గంలో ఎస్‌సిలు 25 శాతం, ఎస్‌టిలు 46.3 శాతం ఉన్నారు. ఒబిసిలు అధిక సంపద వర్గంలో 19.2 శాతంగానూ, తక్కువ సంపద వర్గంలో 16.3 శాతం ఉన్నారు.

రికార్డు స్థాయికి ఆర్థిక అసమానతలు

స్వాతంత్ర్యం తరువాత దేశంలో ఆర్థిక, ఆదాయ అసమానతల్లో క్షీణత ఉంది. 1980 నుంచి మళ్లీ ఇవి పెరగడం ప్రారంభమైంది. 2000 నుంచి పెరుగుదల తీవ్రమైంది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 ఏడాది వరకూ ఆర్థిక, ఆదాయ అసమానతలు, సంపద కేంద్రీకరణ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక అసమానతల విషయంలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశ సంపదలో 90 శాతం 10 శాతం జనాభా చేతిలోకి పోతుంటే, మిగిలిన 10 శాతం సంపదను మిగిలిన 90 శాతం జనాభా పంచుకుంటున్నారు.

నీటి కోసం వెళితే కాల్పులు

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- సుజయెలో కొనసాగుతున్న సైనిక చర్యలు



గాజా : గాజా నగరంలో నీటి పంపిణీ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బలగాలు దాడులు జరిపాయి. ఈ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. వీరిలో పిల్లలు కూడా వున్నారు. దాడుల కారణంగా నీటి కాలుష్యం బాగా పెరిగిపోయింది, దీంతో నిర్వాసితులైన పాలస్తీనియన్లు కంటెయినర్లతో నీటిని పట్టుకుంటుండగా, వారిపై కాల్పులు జరిగాయి. శనివారం ఉదయం నుండి వివిధ ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో మొత్తంగా 31మంది పాలస్తీనియన్లు మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గత రాత్రి నివాస భవనాలపై జరిగిన సైనిక దాడుల్లో నలుగురు పిల్లలతో సహా ఆరుగురు మరణించగా, మరో 15మంది గాయపడ్డారు. సెంట్రల్ గాజాలోని మఘాజి శరణార్థ శిబిరంపై కూడా దాడి జరిగిందని, అనేకమంది మరణించారని పాలస్తీనా వార్తా సంస్థ వాఫా తెలిపింది. బురెజి శరణార్థ శిబిరంపై కూడా ఇజ్రాయిల్ బలగాలు దాడులు జరిపాయి. నివాస భవనాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో అనేకమంది మరణించారని మీడియా వార్తలు తెలిపాయి. సాబ్రా ప్రాంతంలో ఇంటిపై, కారుపై జరిగిన దాడిలో నలుగురు మరణించగా, 8మంది గాయపడ్డారు. గత 9మాసాలుగా జరుగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 37,834మంది మరణించగా, 86,858మంది గాయపడ్డారు. సెంట్రల్ గాజాలో మున్సిపల్‌పార్క్‌పై బాంబు దాడి జరగడంతో మరో ఐదుగురు పాలస్తీనియన్లు మరణించారు.

ఇదిలావుండగా, సుజయె ప్రాంతంలో సైనిక చర్యలు చేపడతామని, ప్రమాదకరమైన యుద్ధ జోన్‌గా మారుతుందని హెచ్చరిస్తూ ప్రజలను ఖాళీ చేయాలని సైన్యం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పటికే దాదాపు 60వేల మంది ప్రజలు అక్కడ నుండి వెళ్ళిపోయారు. దక్షిణ గాజాలోని అల్ మవాసి ఏరియాలో సైనిక చర్యల ఫలితంగా 5వేల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. అనేకమంది మరణించారు. సుజయెలో సైనిక చర్యలు కొనసాగుతున్నాయని ఆర్మీ ప్రకటించింది. మొత్తంగా వాయు, భూతల దాడులు ఒకేసారి కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్కూలు ఆవరణలో ఆయుధాల నిల్వ కేంద్రాన్ని తాము కనుగొన్నామని సైన్యం ప్రకటించింది. తమకందిన నిఘా సమాచారం ప్రాతిపదికగా భూతలదాడులు సాగుతున్నాయని తెలిపారు. గత 24గంటల్లో 40మంది పాలస్తీనియన్లు చనిపోయారని వైద్య వర్గాలు తెలిపాయి.

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో ఏ అభ్యర్థికీ మెజారిటీ రాని వైనం

జులై 5న రెండో రౌండ్



టెహరాన్ : ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో రికార్డు స్థాయిలో తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడం, ఏ అభ్యర్థి మెజారిటీ సాధించని పరిస్థితి నెలకొనడంతో జులై 5న రెండో రౌండ్ ఎన్నికలు జరగనున్నాయి. 6.1కోట్ల మందికి పైగా అర్హులైన ఓటర్లు వుండగా, కేవలం 40శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని హోం శాఖ వర్గాలు శనివారం తెలిపాయి. 1979 విప్లవం అనంతరం అధ్యక్ష ఎన్నికల్లో ఇంత తక్కువ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి కాగా, రెండో రౌండ్ అధ్యక్ష ఎన్నిక జరగడం కూడా రెండోసారి మాత్రమే. మధ్యేమార్గవాది పెజెషికాన్‌కు 100.41 లక్షల ఓట్లు రాగా. అణు చర్చల మాజీ ప్రతినిధి సయీద్ జలీల్‌కు 90.47లక్షల ఓట్లు లభించాయి. పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘలిబఫ్‌కు 30.38లక్షలు, కన్జర్వేటివ్ ఇస్లామిక్ నేత ముస్తఫాకు 2,06,397ఓట్లు వచ్చాయి. దాంతో వారు పోటీ నుండి వైదొలగారు. మరో ఇద్దరు అభ్యర్థులు కూడా పోటీ నుండి తొలగారు. ఈ పరిస్థితుల్లో రెండో రౌండ్‌లో జలీల్‌కు ఓటు వేయాల్సిందిగా వీరందరూ వారి మద్దతుదారులకు పిలుపిచ్చారు. మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో అధ్యక్షుడు ఇబ్రహీం రైసి మరణించడంతో ఈ ఎన్నికలు నిర్వహించడం అనివార్యమైంది.

2022-23లో దేశవ్యాప్తంగా నిరసనల నేపథ్యంలో ప్రజలకు భ్రమలు తొలగడం, అమెరికా ఆంక్షల కారణంగా 40శాతానికి పైగా ద్రవ్యోల్బణం నెలకొనడంతో ఎన్నికల పట్ల ఓటర్లకు ఉదాసీనత బాగా పెరిగింది. రెండు ప్రధాన వర్గాల మధ్యనే పోటీ నెలకొన్న నేపథ్యంలో జులై 5న జరిగే రెండో రౌండ్‌లో పోలింగ్‌శాతం పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

పోస్టుల పెంపు కోసం నిరుద్యోగుల ర్యాలీ

- జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్
- లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరిక

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

గ్రూప్ 2, 3, డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయం నుంచి క్లాక్ టవర్ చౌరస్తా వరకు జరిగిన ర్యాలీలో పలువురు నిరుద్యోగులు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి 25 వేలతో మెగా డీఎస్సీ, 2 వేల పోస్టులతో గ్రూప్ 2, 3000 పోస్టులతో గ్రూప్ 3 ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే ఖాళీలన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరుస్తామని హామీలిచ్చి గద్దెనెక్కాక గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ ఆవేదన పట్టించుకునే నాయకుడు ఒక్కరూ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోతే వేలాది మంది నిరుద్యోగులతో కలిసి టీజీపీఎస్సీ భవన్, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.




అమెరికాలోని నార్త్ కరోలినాలో కరువు

- అధిక ఉష్ణోగ్రతలతో పంటలకు తీవ్రనష్టం

వాషింగ్టన్ : అమెరికాలోని యావత్తు నార్త్ కరోలినా రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. ఈ రాష్ట్రంలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు స్థానిక రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధిక వేడికి పొగాకు, పత్తి, మొక్కజొన్న పంటలు నేలరాలుతున్నాయి. నార్త్ కరోలినాలోని 100 కౌంటీలలో 99 కౌంటీల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వర్షాలు కురవకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. నదీ ప్రవాహాలు, జలాశయాలు ఎండిపోయాయి. వసంత రుతువు చివరిలోనూ, వేసవి ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితి తలెత్తడం రాష్ట్రంలో గత 24 ఏళ్లలో ఇది రెండోసారి. ఆదివారం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నా.. కరువు పరిస్థితులను అధిగమించడానికి ఈ వర్షాలు సరిపోవని నిపుణులు చెబుతున్నారు. సోమవారం నుంచి మరో 18 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వేడి గాలులతో భూగర్భ జలాలపై కూడా ఒత్తిడి పడుతోంది. అధిక వినియోగంతో భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయి.

అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్‌కు
1575 ఎకరాలు

నోటిఫై చేసిన ప్రభుత్వం
రాజధాని నిర్మాణంలో మరో ముందడుగు




అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణంలో మరో ముందడుగు పడింది. ఈ ప్రాంతంలో చేపట్టనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు 1575 ఎకరాల భూమిని ప్రభుత్వం గుర్తించింది.ఆ ప్రాంతాన్ని సిఆర్‌డిఎ శనివారం నోటిఫై చేసింది. ఈ మేరకు సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ శనివారం గెజిట్ విడుదల చేశారు. సిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 39 ప్రకారం బహిరంగ ప్రకటన కూడా జారీ చేశారు. రాయపూడి. నేలపాడు, లింగాయపాలెం,శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాన్ని నోటిఫై చేస్తున్నట్లు ఈ ప్రకనటలో పేర్కొన్నారు. అమరావతి రాజధాని నగరంలోని 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో మొత్తం ప్లానుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్లాను పరిధిలో ఎక్కడ ఏమి నిర్మించాలన్నా దానికి గుర్తిస్తూ సిఆర్‌డిఏ విడివిడిగా నోటిపికేషన్ ఇవ్వాల్సి ఉంది. 2019కు ముందు అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం ఈ ప్రాంతంలో అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్లాను రూపొందించింది. దీనిలో శాశ్వత సెక్రటేరియట్, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండనున్నాయి. దీనిలో సెక్రటేరియట్ భవనాల నిర్మాణానికి అడుగు భాగంలో ర్యాఫ్ట్ కూడా వేశారు. ఇది గిన్నిస్‌బుక్ ఆఫ్‌రికార్డులోనూ ఎక్కింది. మొత్తం 1575 ఎకరాల పరిధిలో వేసిన ఈ ప్లానును అప్పట్లో నోటిఫై చేయలేదు. ఆలోపు ఎన్నికలు రావడం, ఇతర ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. ఇప్పుడు మరలా తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్(ఎజిసి) నిర్మించబోయే ప్రాంతం మొత్తాన్ని నోటిఫై చేసింది.

ఇంటర్ ప్రవేశాల గడువు జులై 31

- రెండో విడత షెడ్యూల్ విడుదల
- గుర్తింపు ఉన్న కాలేజీల్లో చేరాలి : ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును వచ్చేనెల 31వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రెండో విడత షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శనివారం విడుదల చేశారు. మొదటి ప్రవేశాల గడువు ఆదివారంతో ముగియనున్న విషయం తెలిసిందే. దీంతో వచ్చేనెల 31 వరకు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పొందాలని సూచించారు. అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. ఆ కాలేజీల జాబితాను acadtsbie.cgg.gov.in లేదా tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దని సూచించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కాలేజీల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమైన సంగతి తెలిసిందే.



ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టీడీపీ కార్యాలయంలో వెల్లువెత్తిన వినతులు



అమరావతి : ప్రజాసమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తామని టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి టీడీపీ కార్యాలయానికి తరలివచ్చిన ప్రజల నుంచి శనివారం ఆయన వినతులు స్వీకరించారు. సామాన్య ప్రజలు, కార్యకర్తలు ముఖ్యమంత్రిని కలిసేందుకు భారీగా తరలిరావడంతో టీడీపీ కార్యాలయం కిక్కిరిసి పోయింది. దీంతో అక్కడ గందరగోళం ఏర్పడటంతో కొంతసేపు వినతిపత్రాల స్వీకరించడాన్ని నిలిపివేశారు. సర్దుబాటు అయిన తరువాత మరలా స్వీకరించారు. అందరి నుంచి వినతిపత్రాలు తీసుకున్న చంద్రబాబు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భారీగా తరలివస్తున్న ప్రజలను కలిసేందుకు ఇకపై ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఐదేళ్ల ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో వెల్లువలా వస్తున్న ఈ విన్నపాలను చూస్తే అర్థమవుతోందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, వాటన్నింటినీ పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గత ప్రభుత్వం సరిగా పనిచేయనందునే సమస్యలతో ప్రజలు భారీగా వస్తున్నారని చెప్పారు. ప్రజా ఇబ్బందులు చూస్తుంటే ఎంతో బాధనిపిస్తోందని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కార్యాలయంలో కూడా ప్రజా సమస్యలు గుర్తించి వాటికి సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేంద్ర విద్యాసంస్థల్లో ఓబీసీ విద్యార్థులకు న్యాయం చేయండి : ఐఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీ, జీఎఫ్‌టీఐల్లో ఓబీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) ఆందోళన వ్యక్తం చేసింది. ఆ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శనివారం ఆ సంఘం జాతీయ అధ్యక్షులు పాపని నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్ గౌడ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ అంశంపై అధ్యయనం చేసి ఓబీసీ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానంటూ ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

కరెంట్ అఫైర్స్

లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నిక



రాజస్థాన్ కోటా నుండి బీజేపీ అభ్యర్థిగా గెలిచిన ఓం బిర్లా లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. దాదాపు 48 ఏండ్ల తర్వాత లోక్‌సభ స్పీకర్ పదవికి జరిగిన ఎన్నికల్లో ఆయన వరుసగా రెండవసారి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్‌గా ఓం బిర్లా అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మెజారిటీ సభ్యులు మూజువాణీ ఓటుతో మద్దతు పలికారు. ప్రతిపక్ష ఇండియా కూటమి తమ స్పీకర్ అభ్యర్థిగా కేరళకు చెందిన ఎంపి కొడికున్నిల్ సురేష్‌ను నిలబెట్టటంతో పోటీ అనివార్యమయ్యింది. మాడభూషి అనంతశయనం అయ్యంగార్, గుర్దియాల్‌సింగ్ థిల్లాన్, బలరాం జాఖడ్, జిఎంసి బాలయోగిల తర్వాత రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన జాబితాలో ఓం బిర్లా చేరారు. దానితో పాటు తొలివిడతలో పూర్తిగా ఐదేండ్లు స్పీకర్‌గా పని చేసి, వరుసగా రెండవసారి స్పీకర్ పదవి చేపట్టిన తొలివ్యక్తి బలరాం జాఖడ్ కాగా, ఓం బిర్లా రెండో వ్యక్తిగా రికార్డు సృష్టించారు.

నాటో సెక్రటరీ జనరల్‌గా మార్క్ రుట్టే



ప్రపంచంలోనే అతిపెద్ద సైనిక కూటమిగా పేరు పొందిన 'నార్త్ అట్లాంటిక్ ట్రీటి ఆర్గనైజేషన్' (నాటో)కి నూతన సెక్రటరీ జనరల్‌గా డచ్ ప్రధానమంత్రి మార్క్ రుట్టే నియమితులయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1949లో అమెరికా చొరవతో నాటో ఏర్పాటు చేయబడినది. ప్రస్తుతం సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జెన్స్ స్టాల్టెన్‌బర్గ్ పదవీ కాలం ముగిసిన అనంతరం అక్టోబర్ 1న రుట్టే భాధ్యతలు స్వీకరించనున్నారు. ఒక పక్క ఉక్రెయిన్ యుద్ధం, ఐరోపా దేశాలలో అనిశ్చితి పరిస్థితులు నెలకొన్న తరుణంలో మార్క్ రుట్టే నాటో సెక్రటరీ జనరల్‌గా నియమితులు కావటం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎఐకి కోడ్ ఆఫ్ కాండాక్ట్



కృత్రిమ మేధ రంగంలో విస్తృతంగా పరిశోధనలు చేస్తూ అడ్వాన్స్‌డ్ ఎఐ సిస్టమ్స్‌తో రూపొందిస్తున్న సంస్థలను కట్టడి చేయడానికి కొన్ని విధివిధానాలకు రూపకల్పన చేయాలని జీ 7 దేశాలు ఇటీవల ఇటలీలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో నిర్ణయం తీసుకున్నాయి. రానున్న రోజుల్లో ఎఐ టెక్నాలజీ ద్వారా పొంచి ఉన్న ముప్పు కట్టడి చేసే దిశగా ఎఐ సాంకేతికతకు రూపకల్పన చేస్తున్న సంస్థలకు కోడ్ ఆఫ్ కాండాక్ట్ (ప్రవర్తనా నియమావళి)ని జీ 7 దేశాలు రూపొందించాయి. కృత్రిమమేథ సృష్టించే సమస్యలను ఎదుర్కొంటూ, దాని ప్రయోజనాలను మాత్రమే అందిపుచ్చుకునేలా ప్రపంచ దేశాలకు చెందిన ఎఐ సాంకేతిక సంస్థలు కృషి చేయాలని ఈ సదస్సు ద్వారా జీ 7 దేశాలు పిలుపునిచ్చాయి. దీంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలలో మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రారంభించిన 'పార్టనర్‌షిప్ ఫర్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టమెంట్ ద్వారా 2027 నాటికి 600 బిలియన్ డాలర్ల నిధిని సమీకరించాలని నిర్ణయం తీసుకున్నాయి.

సాక్షిమాలిక్‌కు అరుదైన గౌరవం

ప్రతిష్టాత్మకమైన టైమ్ మ్యాగజైన్ 2024 సంవత్సరానికి సంబంధించి రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలుర జాబితాలో భారత మహిళా రెజ్లర్ సాక్షిమాలిక్ స్థానం పొందారు. మహిళా రెజర్లను లైంగికంగా వేధించాడన్న ఆరోపణలతో భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై సాక్షి మాలిక్ జరిపిన పోరాటానికి ఈ అరుదైన గౌరవం లభించింది. 2016లో జరిగిన ఒలింపిక్స్‌లో రెజ్లింగ్‌లో కాంస్యం సాధించి సాక్షి రికార్డు సృష్టించింది. ఈ జాబితాలో సాక్షి మాలిక్‌తో పాటు మరొక ఏడుగురు భారతీయులు, భారతీయ సంతతికి చెందిన వారికి చోటు లభించింది. ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల, బాలీవుడ్ నటి ఆలియాభట్, నటుడు, దర్శకుడు దేవ్ పటేల్, అమెరికా ఇంధన రవాణా కార్యక్రమాల కార్యాలయ డైరెక్టర్ జిగర్ షా, యేల్ విశ్వవిద్యాలయ ఖగోళ, భౌతికశాస్త్రాల ఆచార్యుడు ప్రియావేరా నటరాజన్‌తో పాటు భారతీయ సంతతికి చెందిన రెస్టారెంట్ యజమాని అమ్మిఖాన్ ఉన్నారు.



విజయవంతమైన పుష్పక్ ప్రయోగం



పునర్ వినియోగానికి అవకాశం ఉండే అంతరిక్ష వాహనం (రీ యూజబుల్ లాంచ్ వెహికిల్) పుష్పక్‌ను ఇస్రో వరుసగా మూడవ సారి విజయవంతంగా ప్రయోగించింది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెర తాలుకాలోని నాయకన హట్టిలో గల డిఆర్‌డిఒ ప్రాంగణంలో ఈ పరీక్ష నిర్వహించారు. అనంతరం పుష్పక్ వాహనం యొక్క సామర్థ్యాన్ని దశల వారీగా పరీక్షించటం జరిగిందని, ఆఖరిగా నిర్వహించిన అంతిమ సన్నాహక ప్రయోగం పూర్తిగా విజయవంతమైందని ఇస్రో అధికారులు ఇటీవల ప్రకటించారు.

బజరంగ్‌పై వేటు



భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియాపై మరొక్కసారి వేటు పడింది. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) రెండోసారి పునియాని సస్పెండ్ చేసింది. ఈ ఏడాది మార్చి 10వ తేదిన సోన్‌పట్‌లో జరిగిన సెలక్షన్ ట్రయల్స్ పునియా నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణపై నిజానిజాలు తేల్చడానికి యూరిన్ నమూనాలు ఇవ్వాలని నాడా కోరింది. దీనికి పునియా నిరాకరించటంతో నాడా మొదటిసారి అతనిపై వేటు వేసింది. తనపై నాడా విధించిన సస్పెన్షన్ ఎత్తి వేయాలని అతను యాంటీ డిసిప్లినరీ డోపింగ్ ప్యానెల్ (ఎడిడిపి)ని ఆశ్రయించాడు. కొన్ని టెక్నికల్ వంటి అంశాల ఆధారంగా ఎడిడిపి పునియాపై నిషేదాన్ని ఎత్తి వేసింది. కాగా రెండవసారి పునియాకి నోటీసు ఇచ్చి, మరొక సారి వేటు వేసింది.



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

ఎన్‌టిఎ డైరక్టర్‌పై వేటు



దేశంలో పెను దుమారం రేపిన నీట్, యుజిసి నెట్ పరీక్షలలో జరిగిన అవకతవకలపైన కేంద్ర దృష్టి సారించింది. దిద్దుబాటు చర్యలలో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) డైరక్టర్ జనరల్ పై వేటు వేసింది. ఇప్పటి వరకూ డైరక్టర్‌గా ఉన్న సుబోద్ కుమార్‌ను తొలగించి, అతని స్థానంలో భారత వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (ఐపిటిఒ) చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మాజీ ఐఎఎస్ అధికారి ప్రదీప్ సింగ్ ఖరోరాను నియమించింది. దీంతో పాటు ఇక నుండి నీట్, నెట్‌తో సహ పలు పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల లీకెజ్ కేసులలో దోషులుగా తెలితే 10 సంవత్సరాలు జైలుశిక్ష, కోటి రూపాయల వరకు జరిమానా విధించేలా కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకు వచ్చింది. ఇక మీదట ఎవరైనా పేపర్ లీకేజీ వంటి నేరాలకు పాల్పడితే 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం 2024 కింద శిక్షార్హులవుతారని పేర్కొంది. ఈ నెల 21వ తేది నుండి దేశవ్యాప్తంగా ఈ చట్టం అమలులోకి వచ్చిందని కేంద్రం ప్రకటించింది.

పరీక్షల సంస్కరణలపై కమిటీ



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకురావల్సిన సంస్కరణలపై అధ్యయనం చేయడానికి ఇస్రో మాజీ చైర్మన్ కె. రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో కేంద్రం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల నిర్వాహణ, డేటా భద్రతకు తీసుకోవాల్సి చర్యలు, ఎన్‌టిఎ నిర్మాణం పరంగా తీసుకోవాల్సిన చర్యలు, అన్నింటి కన్నా ముఖ్యంగా ఎన్‌టిఎ పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకోవల్సిన చర్యల వంటి అంశాలపై అధ్యయనం చేసి, రెండు నెలల్లో తీసుకురావల్సిన సంస్కరణలతో ఒక నివేదికను కేంద్రానికి సమర్పించనుంది.

జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్



జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్‌ను తీసుకు రావాలన్న యోచనలో కేంద్రం ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రాలకు స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ఇటీవల నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన 53వ జిఎస్‌టి సమావేశంలో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఉక్కు, ఇనుము, అల్యూమినియంల మిల్క్ కేన్‌లపై 12 శాతం జిఎస్‌టిని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోను ఒకేరీతిగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ప్యాకింగ్‌కు ఉపయోగించే కార్టన్ బాక్సులపైన కూడా 12 శాతం జిఎస్‌టిని అమలు చేయనున్నారు. దీంతో హిమాచల్ ప్రదేశ్, జమ్మూ అండ్ కశ్మీర్ వంటి రాష్ట్రాల్లోని ఆపిల్ పండించే రైతులకి మేలు జరిగే అవకాశం కలగనుంది. పెట్రోల్‌ని జిఎస్‌టి పరిధిలోనికి తీసుకురావటంపై రాష్ట్రాలు తన వైఖరిని తెలియచేయాలని మంత్రి సీతారామన్ ఆయా రాష్ట్రాలను కోరారు.

తెలుగులో ప్రథమాంధ్ర స్వతంత్ర దేశి పురాణం ఏది?



నానాపురం నర్సింహులు
9030057994

1. తెలుగులో తొలి క్షేత్రమహాత్మ్య కావ్యం?
   - ఎ. భీమేశ్వర పురాణం
   - బి.కాశీఖండం
   - సి. నృసింహ పురాణం
   - డి. పాండు రంగమహత్యం
2. తెలుగులో మొదటి పద్య రామాయణం?
   - ఎ. రంగనాథ రామాయణం
   - బి. భాస్కర రామాయణం
   - సి. మొల్ల రామాయణం
   - డి. రామాభ్యుదయం
3. భాస్కర రామాయణ కవులలో ఒకరు?
   - ఎ.గోన బుద్ధారెడ్డి
   - బి.వెలిగందల నారయ
   - సి. కుమార రుద్రదేవుడు
   - డి. కాచవిభుడు
4. రామాయణంలోని విభాగాలను ఏమంటారు?
   - ఎ. స్కంధాలు బి.పర్వాలు
   - సి.కాండలు డి.పరిచ్ఛేదాలు
5. ఉత్తర రామాయణం రాసిన కవి?
   - ఎ. తిక్కన బి.గోనబుద్ధారెడ్డి
   - సి.భాస్కరుడు డి. పింగళి సూరన
6. తెలుగులో ప్రథమాంధ్ర స్వతంత్ర దేశి పురాణం ఏది?
   - ఎ. విష్ణు పురాణం
   - బి. బసవపురాణం
   - సి. భీమేశ్వర పురాణం
   - డి. నృసింహపురాణం
7. క్రింది వానిలో రామాయణాన్ని రచించని వారు?
   - ఎ. తిక్కన బి.భాస్కరుడు
   - సి.శ్రీనాథుడు డి. ఎర్రన
8. గరుడు పురాణాన్ని తెలుగులోకి అనుసృజన చేసిన కవి?
   - ఎ. మడిగి సింగన
   - బి. వెన్నలకంటి సూరన
   - సి. పింగళి లక్ష్మీకాంతం
   - డి. పింగళి సూరన
9. తెలుగు పురాణ సాహిత్యంలో కవిత్రయం వంటివారు?
   - ఎ. పాల్కురికి సోమనాథుడు
   - బి. మారన
   - సి. బమ్మెర పోతన
   - డి. పైవారందరు
10. సంస్కృతంలో అష్టాదశ మహాపురాణాలు ఎవరు రచించారు?
    - ఎ. వాల్మీకి మహర్షి
    - బి. వ్యాసుడు
    - సి. కాళిదాసు
    - డి. నన్నయ
11. ఈ క్రింది వానిలో ఇతిహాసాలు?
    - ఎ. భాగవతం, భారతం
    - బి. రామాయణం, భాగవతం
    - సి. నారదీయం, భాగవతం
    - డి. రామాయణం, భారతం
12. నన్నయ ఆంధ్రమహాభారతంలో ఎంత వరకు రచించాడు?
    - ఎ. ఆదిపర్వం, అరణ్యపర్వం, సభాపర్వంలో తృతీయశ్వాసం వరకు
    - బి. ఆది, సభా, అరణ్య పర్వంలో చతుర్థాశ్వాసంలో 142వ పద్యం వరకు.
    - సి. ఆది, సభా, అరణ్య పర్వాలు
    - డి. 18 పర్వాలు రాశాడు
13. కవిత్రయంలో పద్దెనిమిది పర్వాల మహాభారతాంధ్రీకరణ ఎక్కువ భాగం రచించింది?
    - ఎ. నన్నయ
    - బి.తిక్కన
    - సి. ఎర్రన
    - డి. పాల్కురికి సోమన
14. శ్రీ మదాంధ్ర మహాభాగవతంలో ఎన్ని స్కంధాలున్నాయి?
    - ఎ. 18 బి.11
    - సి.12 డి.7
15. ఆంధ్రమహాభారతం..?
    - ఎ. శాస్త్రేతిహాసం బి.కావ్యేతిహాసం
    - సి. ఇతిహాసం డి.పురాణం
16. జతపరుచుము:

1. రామాయణం		అ.పర్వం
2. భారతం		ఆ. స్కంధ
3. భాగవతం		ఇ. కల్పం
4. వేదాంగం		ఈ. కాండం

	1	2	3	4
ఎ.	ఈ	అ	ఆ	ఇ
బి.	ఈ	ఆ	అ	ఇ
సి.	ఇ	ఈ	ఆ	అ
డి.	ఈ	ఇ	అ	ఆ

సమాధానాలు

1. సి	2. బి	3. సి	4. సి
5. ఎ	6. బి	7. సి	8. డి
9. డి	10. బి	11. డి	12. బి
13. బి	14. సి	15. బి	16. ఎ

అమెరికా ప్రభుత్వం ఈ కేసుతో జర్నలిజాన్ని ఒక నేరంగా మార్చింది. వార్తల సేకరణ, ప్రచురణను నేరంగా పరిగణించింది.తోటి జర్నలిస్టులు వాస్తవాన్ని గ్రహించి కేసు తీరుతెన్నులను బహిర్గత పరచాలని అసాంజే భార్య స్టెల్లా యావత్ విజ్ఞప్తి చేసింది. అసాంజే ఉదంతంతో పరిశోధనాత్మక జర్నలిజం ఇక ముందు కూడా ఆగదు, తమ పాలకుల దుర్మార్గాలను వెల్లడించాలని చిత్తశుద్ధితో పనిచేసే జర్నలిస్టులకు ఈ ఉదంతం ఓ ధైర్యన్ని ఇచ్చింది. ఇక ముందు ఈ స్ఫూర్తి కొనసాగుతుంది.మీడియా స్వేచ్ఛ దేశద్రోహం కాదు.ప్రజల పక్షాన నిలవటమే జర్నలిజం వృత్తి ధర్మం.ప్రతి ఒక్క జర్నలిస్టుకూ అసాంజే ఒక రోల్ మోడల్. నియంతృత్వ ప్రభుత్వాలకు ఓ హెచ్చరిక కూడా.

మీడియా స్వేచ్ఛకు ప్రతీక అసాంజే



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

మొదటి నుండి అమెరికా అగ్రరాజ్యం. తన అగ్ర రాజ్యహోదా కోసం ఏ దేశాన్నైనా తేలిగ్గా బలిపెట్టగలదు.పచ్చటి భూముల్ని మరుభూములుగా మార్చగలదు. జపాన్‌పై అణుబాంబును ప్రయోగించి మానవ మారణ హోమాన్ని సృష్టించింది. తాను తప్ప ఏదేశమూ పచ్చగా,శాంతియుతంగా ఉండటాన్ని సహించలేదు.ఇరుగు పొరుగు దేశాలు సఖ్యతగా ఉంటే చూడలేదు. తన ఆధిపత్యం కోసం ఇరుదేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తుంది.ఆ దేశాలకే మళ్లీ మారణాయిధాలను అమ్ముకొని లాభాలు గడిస్తుంది.తన దేశంలో సహజ వనరులను భవిష్యత్ తరాలకు భద్రంగా దాచుకుంటుంది.ఇతర దేశాల వనరులను తన బలంతో తవ్వితీసి తన దేశ అవసరాలకు వాడుకుంటుంది. పేరుకోసం మానవ హక్కుల గురించి మాట్లాడుతుంది.కానీ జాతివివక్షతలను పాటించటంలో ఆ దేశానినిది అగ్రస్థానం.

ఇలాంటి అమెరికాలో అగ్రరాజ్య ముసుగులో దాగివున్న నయవంచన, దుర్మార్గాలను సాధికారికంగా బయటపెట్టిన ఆస్ట్రేలియాకు చెందిన వికీలీక్స్ సంస్థ స్థాపకుడు, జూలియన్ అసాంజే పై 'గూఢాచర్యం' ఆరోపణలతో పద్నాలుగు సంవత్సరాలు నిర్బంధించింది. నానా అగచాట్లకు గురిచేసింది.చివరకు ఆయన విడుదలకోసం అమెరికా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఆయన మీద మోపబడిన నేరాన్ని అసాంజే అంగీకరించాడు. ఈ నేరానికి ఐదేండ్ల జైలు శిక్షను విధించారు.అయితే అసాంజే బ్రిటన్‌లో ఇప్పటికే అంతకంటే ఎక్కువ కాలం జైల్లో శిక్ష అనుభవించినందున శిక్షాకాలం పూర్తయినట్లు భావించి ఆయన్ను మూడురోజుల కిందట విడుదల చేశారు.వెంటనే ఆయన తన మాతృదేశం ఆస్ట్రేలియాకు చేరుకున్నాడు.అక్కడ ప్రజల నుంచి, ప్రజాస్వామికవాదుల నుంచి ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి కూడా ఘన స్వాగతం లభించింది.

ఇరాక్‌లో అమెరికా దారుణాలను అసాంజే నేతృత్వంలోని వికీలీక్స్ బయటపెట్టింది. ఇరాక్‌లో అణు ఆయుధాలు,రసాయన ఆయుధాలు ఉన్నాయని తప్పుడు ఆరోపణలు చేసింది. ప్రపంచాన్ని నమ్మించింది. అన్యాయంగా సద్దాం హుస్సేన్‌ను ఉరితీసింది. అలాగే ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దుశ్చర్యలను బయటపెట్టింది.ప్రపంచం ముదు అమెరికాను ఒక దోషిగా నిలబెట్టడమే అసాంజే చేసిన నేరమా? అమెరికా లాంటి దేశంలో కట్టుదిట్టమైన రక్షణ వలయాన్ని దాటి అనేక ప్రభుత్వ రహస్య పత్రాలను, అధికారిక డాక్యుమెంట్లను సంపాదించిన సాహసోపేతమైన జర్నలిస్ట్ అసాంజే. ఒక ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా ప్రభుత్వం దమననీతిని ఎండగట్టడం ఆయన వృత్తి ధర్మం. చెల్సియా మానింగ్ అనేక అమెరికా మిలిటరీ అధికారిణి ద్వారా అస్సాంజే రహస్య పత్రాలు సేకరించాడు. ఈ అంశం బయట పడిన తరువాత ఆమె మీద ప్రభుత్వం వివిధ కేసులు మోపింది. సుమారు 35 ఏండ్ల జైలు శిక్ష ,జరిమానా కూడా విధించింది. కానీ ఆనాటి అమెరికా అధ్యక్షుడిగా బరాక్ ఒబామా ఆ శిక్షాకాలాన్ని ఏడేండ్లకు తగ్గించాడు. దానితో 2017లో ఆమె జైలు నుంచి విడుదలైంది. ఆ తరువాత ఏడాది పాటు జైలు శిక్ష, జరిమానా చెల్లించటానికి సిద్ధపడింది. ఆమె అసాంజేకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం ఇవ్వలేదు.

జర్నలిస్టుగా ఒక ప్రభుత్వ నేరపూరిత చర్యను ప్రజలకు తెలపడం అసాంజే భాధ్యత.అందుకు తగిన సాక్షాధారులను సేకరించి ప్రపంచానికి ఇంటర్నెట్ ద్వారా వీకీలీక్స్ సాధనంగా ప్రపంచానికి తెలిపాడు. దానికి అమెరికా ప్రభుత్వం అతనిపై కక్షకట్టింది.ఇప్పటికే ప్రపంచంలో అనేక మంది జర్నలిస్టులు పలు దేశాల్లో ప్రభుత్వ లోపాలను సంచలనాత్మక అంశాలుగా బయట



పెట్టి ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు.జర్నలిస్టులు వివిధ మార్గాల్లో వారికి కావాల్సిన సమాచారం సేకరించటం వారి బాధ్యత. వారికి సహకరించి సమాచారం ఇచ్చిన వారి వివరాలు ఎరికీ,ఎప్పటికీ చెప్పకుండా గోప్యత పాటించటం కూడా వారి వృత్తి ధర్మంలో భాగమే.

అసాంజేను విడుదల చేయాలని, జర్నలిజం వృత్తిని గౌరవించాలని, మీడియా స్వేచ్ఛను కాపాడాలంటూ ఐరోపాతో సహా అనేక దేశాలు,స్వచ్ఛంద సంస్థల నుంచి అమెరికా ప్రభుత్వంపై నానాటికీ ఒత్తిడి పెరుగుతూ వచ్చింది.ఆ ఒత్తిడి మేరకు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా అసాంజేతో రాజీ పడవలసి వచ్చింది. అసాంజే ప్రస్తావన వచ్చినపుడల్లా అమెరికా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడిందా? అని భావితరాలు తెలుసుకోనేందుకు ఈ ఉదంతం తోడ్పడింది. పైగా రహస్య పత్రాలను ముద్రించినందు వల్ల లేదా ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉంచినందువల్ల జరిగిన నష్టం ఏమిటో రుజువు చేసేందుకు అమెరికా వద్ద ఎలాంటి సాక్ష్యాధారాలు లేవు.అందుకే కేసును విచారించిన న్యాయమూర్తి కూడా అదే అభిప్రాయం తన తీర్పులో చెప్పాడు.అలాగే అసాంజే భార్య స్టెల్లా యావత్ తన భర్త కేసుకు సంబంధించిన వివరాలను సమాచార స్వేచ్ఛ హక్కు చట్టం కింద అమెరికా నుంచి సంపాదించి లోకానికి వెల్లడించాల్సిందిగా తోటి జర్నలిస్టులకు విజ్ఞప్తి చేసింది. కేసు నడిచినంత కాలం భర్తకు అండగా నిలిచిన ధీరవనితగా ఆమె చరిత్రకెక్కింది.ఆమెను ఇప్పుడు అందరూ అభినందిస్తున్నారు.

అమెరికా ప్రభుత్వం ఈ కేసుతో జర్నలిజాన్ని ఒక నేరంగా మార్చింది. వార్తల సేకరణ, ప్రచురణను నేరంగా పరిగణించింది.తోటి జర్నలిస్టులు వాస్తవాన్ని గ్రహించి కేసు తీరుతెన్నులను బహిర్గత పరచాలని అసాంజే భార్య స్టెల్లా యావత్ విజ్ఞప్తి చేసింది. అసాంజే ఉదంతంతో పరిశోధనాత్మక జర్నలిజం ఇక ముందు కూడా ఆగదు, తమ పాలకుల దుర్మార్గాలను వెల్లడించాలని చిత్తశుద్ధితో పనిచేసే జర్నలిస్టులకు ఈ ఉదంతం ఓ ధైర్యన్ని ఇచ్చింది. ఇక ముందు ఈ స్ఫూర్తి కొనసాగుతుంది.మీడియా స్వేచ్ఛ దేశద్రోహం కాదు.ప్రజల పక్షాన నిలవటమే జర్నలిజం వృత్తి ధర్మం.ప్రతి ఒక్క జర్నలిస్టుకూ అసాంజే ఒక రోల్ మోడల్. నియంతృత్వ ప్రభుత్వాలకు ఓ హెచ్చరిక కూడా.

మన దేశంలో కూడా అనేక పేరు మోసిన పత్రికలు,ప్రఖ్యాత మీడియా సంస్థలు (ఛానళ్ళు) కార్పోరేట్లు అదానీ, అంబానీ చేతుల్లోకి వెళ్ళిపోయాయి.అవి స్వలాభం కోసం అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు బాకా కొడుతున్నాయి.నిజమైన ప్రజా సమస్యలను చర్చకు పెట్టడం లేదు. గత పదేండ్లుగా మన ప్రధాన మీడియా కట్టు బానిసలుగా కేంద్రప్రభుత్వానికి ఊడిగంచేసి ప్రపంచ దృష్టిలో అభాసుపాలైంది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 'గోదీ' మీడియా చెప్పిన కల్పిత సర్వే ఫలితాలు,జోస్యాలు, తిరగబడ్డాయి.వారు అధికార పార్టీ నేతను(మోదీని) ఇంటర్వ్యూ చేసిన విధానం,వారు అడిగిన ప్రశ్నలు,పొగడ్తలు ప్రపంచం ముందు అప్రతిష్టను మూటకట్టుకున్నాయి.

ఇప్పుడు మనదేశంలో గోదీ మీడియాను నమ్మే నాధుడు కరువయ్యాడు.ఆ ఛానళ్ల ఊదరగొట్టే చర్చలను, అరుపులను, కేకలను వినేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది.ధృవ్ రాఠీ, రవీష్ కుమార్ లాంటి ఇండిపెండెంట్ యూట్యూబర్లకు మంచి ఫాలోయింగ్ ఉంది. వారి వీడియోలకు అమాంతం లక్షల్లో అనూహ్యంగా వ్యూవర్స్ పెరిగారు.వారు ప్రజాస్వామ్యంలో సామాన్య ప్రజల గొంతుకను వినిపిస్తున్నారు.మన తెలుగులో ప్రొఫెసర్ నాగేశ్వర్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, డా. ప్రసాదమూర్తి మహిళా జర్నలిస్టులు వనజ, తులసీచందూ మొదలైన యూట్యూబర్లకు వీక్షకుల ఆదరణ క్రమంగా పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పేరుమోసిన దినపత్రికలు ఏదో పార్టీతో జతకట్టడంతో నిష్పాక్షిక వార్తలను ప్రజలకు చేరడం లేదు. ప్రజలు విశ్వసనీయతను పొందడానికి ప్రజల పక్షాన నిలిచే వామపక్ష పత్రికల్ని ఎక్కువమంది చదువుతున్నారు. ఇంకా సోషల్‌మీడియా వేదిక కూడా ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందుబాటులో ఉంచుతోంది. అయితే ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో తెలుసుకోవాల్సింది మాత్రం పాఠకులే. ఏది ఏమైనా అమెరికా దురాగతాలను వెల్లడించిన అసాంజే జర్నలిజానికి ఒక దిక్సూచి అని చెప్పక తప్పదు.



2018లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం చేసిన ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి యేటా 30 జూన్‌న ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ పార్లమెంటరిజమ్ దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ పార్లమెంటరిజమ్)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. ప్రజా సంక్షేమ కేంద్రాలు, చట్ట శాసన సభలుగా పార్లమెంటరీ వ్యవస్థలు చేస్తున్న అపార కృషికి స్పందనగా సాధారణ మానవాళి కృతజ్ఞతలు తెలియజేయడానికి ఈ వేదికలు ఉపకరిస్తున్నాయి. పార్లమెంటరీ వ్యవస్థలు పారదర్శకంగా, జవాబుదారీతనంతో

ప్రజాగొంతుకలు కావాలి... పార్లమెంట్ వేదికలు



డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సేవలందించాలని కూడా సూచనలు చేస్తున్నాయి. 30 జూన్ 1889న ఉద్భవించిన "ఇంటర్-పార్లమెంటరీ యూనియన్(ఐపియూ)" అంతర్జాతీయ సంఘ కృషికి గుర్తుగా 2018 నుంచి ప్రతి ఏట "అంతర్జాతీయ పార్లమెంటరిజమ్ దినం" నిర్వహించబడుతున్నది. 135 ఏండ్ల ఘన చరిత్ర కలిగిన ఐపియూలో 180 దేశాల పార్లమెంట్లకు చెందిన 46,000 మంది పార్లమెంటేరియన్లు సభ్యులుగా ఉండడం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు పార్లమెంటరీ వ్యవస్థలో సమాన అవకాశాలు కల్పించాలని కోరడం, ప్రజాస్వామ్య విలువలకు పట్టం కట్టడం, శాంతి నెలకొల్పడం, లింగ సమానత్వ సాధన, మానవ హక్కుల పరిరక్షణ, మైనారిటీ వర్గాల హక్కులు కాపాడడం, యువతకు చోటు ఇవ్వడం, వికలాంగులకు సముచిత స్థానం ఇవ్వడం, అవినీతి పాలకుల పంతం పట్టడం లాంటి పలు అంశాలను చర్చించే వేదికలుగా అంతర్జాతీయ పార్లమెంటరిజం దినం సమావేశాలు ఉపకరిస్తాయి.

ఫ్రెంచ్ భాషలో 'పార్లర్' అనగా 'చర్చించడం (టుటాక్)' అని అర్థం. పార్లమెంటరీ ప్రజాస్వామ్య నియమాలను ప్రపంచ దేశాలు పాటించాలని సూచించడం జరుగుతున్నది. ప్రజాస్వామ్యానికి గుండెకాయలుగా పార్లమెంట్లు సేవలందించాలి. ప్రజల గొంతుకలుగా పార్లమెంట్లు పని చేయాలని, ప్రజాహిత నిర్ణయాలను నిష్పాక్షికంగా తీసుకోవాలని, అన్ని వర్గాల ప్రజల సమ్మిళిత సమగ్రాభివృద్ధికి ప్రతిన బూనడానికి వేదికలుగా పార్లమెంట్లు కృషి చేయాలని విశ్వ మానవాళి కోరుకుంటున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న మానవీయ విలువలు, జరుగుతున్న అరాచకాలు, ప్రజాందోళనలు, ప్రజాస్వామ్యానికి పడుతున్న తూట్లు, బడుగులకు ప్రాతినిధ్యం కొరవడడం, రాక్షస రాజకీయ క్రీడలు, స్వేచ్ఛా హక్కుకు తలుపులు మూయడం, చట్ట సభలు డబ్బునోళ్లకే చుట్టాలుగా మారడం, అశాంతి నెలకొన్న సమాజం లాంటి పలు సవాళ్ళ నడుమ నేటి పార్లమెంట్లు దారితప్పుతూ ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కడం కొనసాగుతోంది. ప్రపంచ జనాభాలో 40 ఏండ్ల లోపు యువత 40 శాతం వరకు ఉన్నప్పటికీ పార్లమెంటరీ శాసన సభల్లో యువత ప్రాతినిధ్యం 17.5 శాతం మాత్రమే ఉన్నట్లు గణాంకాలు వివరిస్తున్నాయి. ప్రపంచ దేశాల్లోని దాదాపు 33 శాతం పార్లమెంట్లలో 30 ఏండ్ల లోపు యువత ప్రాతినిధ్యం లేకపోవడం ఒక ప్రమాదకర అంశంగా భావించాలి. చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం 20 - 30 శాతం వరకు కూడా ఉండడం లేదు.మహిళల శాతం పెరగాల్సివుంది.

అంతర్జాతీయ పార్లమెంటరిజం దినం-2024 థీమ్‌గా "పార్లమెంటరీ దౌత్యం: శాంతి, అవగాహనలకు వారధుల నిర్మాణం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతోంది. పార్లమెంటరీ వ్యవస్థలు నిస్వార్థంగా పని చేస్తేనే ప్రపంచ మానవాళి సంక్షేమం, శాంతి స్థాపనలు కొనసాగుతాయని గమనించి పార్లమెంట్ సభ్యులు ప్రజా సేవకులుగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో కఊషి చేయాలని ప్రజలు కోరుకుంటూ ఎదురు చూస్తున్నారు. భారత పార్లమెంటరీ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలుగా నిరక్షరాస్యత, పేదరికం, అనంత అవినీతి, లింగ వివక్ష, అసమానతల అగాధాలు, ఉగ్రవాదం, నిరుద్యోగం, ప్రాంతీయ వాదనలు, కులమత వివక్షలు/విబేధాలు, డ్రగ్స్ దుర్వినియోగాలు, మహిళలపై హింస, కోరలు చాస్తున్న కాలుష్యం లాంటి అంశాలు అనాదిగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య భారత పార్లమెంటరీ వ్యవస్థలో లోకసభ, రాజ్యసభలు పునాదులుగా నిలుస్తున్నాయి. మన పార్లమంట్‌లో మెజారిటీ పార్టీ నాయకుడిగా ప్రధానమంత్రి లోకసభలో నాయకత్వం వహించడం, రాజ్యసభలో సీనియర్ మంత్రిని సభా నాయకుడిగా పీఎం నియమించడంతో జరుగుతుంది. ఇప్పటివరకు 18 సాధారణ ఎన్నికల ద్వారా పార్లమెంటు లోకసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. మన పార్లమెంటరీ వ్యవస్థకు జవాబుదారుడిగా ప్రధానమంత్రి నిలుస్తున్నారు. 17వ పార్లమెంట్‌లోని రెండు సభల 776 ఎంపీల్లో 306 మంది (40 శాతానికి పైగా) ఎంపీలపై క్రిమినల్ కేసులు (మర్డర్లు, మానభంగాలు, కిడ్నాపులు, మహిళల పట్ల హింస లాంటి అభియోగాలు) నమోదు కాగా వాటిలో 194 (25 శాతం) మంది తీవ్రమైనవిగా గుర్తించారు. మన ఎంపీల సగటు ఆస్తి రూ.38 కోట్లుగా ఉండగా అందులో 53 మంది (అనగా 7 శాతం) బిలియనీర్లు ఉన్నారు. 2024లో నేడు కొలువు తీరిన 18వ లోకసభలో ఎంపికైన 543 మంది ఎంపీల్లో 251 మంది (46 శాతం) ఎంపీలపై క్రిమినల్ కేసులు, 31 శాతం ఎంపీలపై తీవ్రమైన ఆరోపణలు నమోదు అయ్యాయని సమాచారం.

దాదాపు సగం మంది పార్లమెంట్ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు కావడం, ధన బలం గెలుపును నిర్ణయించడం, కండబలం పార్లమెంటరీ స్ఫూర్తికి తూట్లు పొడవడం జరుగుతున్న నేపథ్యంలో భారత పార్లమెంట్ ప్రజల పక్షపాతిగా సేవలు అందిస్తుందనే విశ్వాసాని క్రమంగా కొల్పోవడం విచారకరం. అయితే ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు వామపక్ష, లౌకిక శక్తుల ప్రతిఘటన ప్రజలకోసం నిలబడుతున్న తీరు అమోఘం. ఎన్డీయే ఏలుబడిలో ప్రజాస్వామ్యం పరిహాసం పాలవడం, అధికారం స్వార్థ ప్రయోజనాలకు నెలవుగా మారడంతో పార్లమెంటరీ వ్యవస్థలపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోవడం ప్రమాదకర పరిణామంగా భావించాలి. పార్లమెంటరీ వ్యవస్థలు ప్రజాభిప్రాయాలకు పట్టం కట్టాలి. అసలైన నాయకులే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావాలి. దానికి ఓటర్ల అంతిమ తీర్పే కీలకమన్న సంగతి గుర్తించాలి.

(30 జూన్ "అంతర్జాతీయ పార్లమెంటరిజం" దినోత్సవం)

దాదాపు సగం మంది పార్లమెంట్ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు కావడం, ధన బలం గెలుపును నిర్ణయించడం, కండబలం పార్లమెంటరీ స్ఫూర్తికి తూట్లు పొడవడం జరుగుతున్న నేపథ్యంలో భారత పార్లమెంట్ ప్రజల పక్షపాతిగా సేవలు అందిస్తుందనే విశ్వాసాని క్రమంగా కొల్పోవడం విచారకరం. అయితే ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు వామపక్ష, లౌకిక శక్తుల ప్రతిఘటన ప్రజలకోసం నిలబడుతున్న తీరు అమోఘం. ఎన్డీయే ఏలుబడిలో ప్రజాస్వామ్యం పరిహాసం పాలవడం, అధికారం స్వార్థ ప్రయోజనాలకు నెలవుగా మారడంతో పార్లమెంటరీ వ్యవస్థలపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోవడం ప్రమాదకర పరిణామంగా భావించాలి.